

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 156

శుక్రవారం 26-8-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పతకానికి గెలుపు దూరంలో..

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ - 12లో



ఇండియా పోస్ట్ భారీ విస్తరణ

కొత్తగా 10,000 శాఖలు.. ఈ ఆర్థిక ఏడాదిలోనే రెడీ - 13లో



చిక్కుల్లో జార్ఖండ్ సీఎం

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌పై అనర్హత వేటు వేయాలని గవర్నర్‌కు ఈసీ సిఫారసు చేసినట్టు సమాచారం.

వివరాలు 6లో



డీఆర్‌డీవో చీఫ్‌గా సమీర్

డీఆర్‌డీవో చైర్మన్‌గా సమీర్ వి కామత్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారుగా సతీశ్‌రెడ్డిని కేంద్రం నియమించింది.

వివరాలు 6లో



అది 'పెగసస్'గా నిర్ధారించలేం

5 ఫోన్లలో మాల్‌వేర్ ఉందని.. దాన్ని పెగసస్‌గా నిర్ధారించలేమని టెక్నికల్ కమిటీ సుప్రీంకు నివేదిక ఇచ్చింది.

వివరాలు 6లో

మంచిని ఓర్వలేరు

సంతోషపడే హృదయాలు కావవి.. రాళ్లు విసిరే కుళ్లు మనసులవి

దుష్ట చతుష్టయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

- మన స్వాతంత్ర్య పోరాటాన్ని సంఘటితం చేసిన ఘనత నేతన్నలదే
- వరుసగా నాలుగో ఏడాదీ వైఎస్సార్ నేతన్న నేస్తం నిధులు విడుదల
- 80,546 మంది నేతన్నల ఖాతాల్లోకి రూ.193.31 కోట్లు జమ
- మూడేళ్లలో నేతన్నల సంక్షేమానికి రూ.2,049.43 కోట్లు
- త్వరలోనే బందరు పోర్టుకు శంకుస్థాపన చేస్తా
- పెడన నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.102 కోట్లు మంజూరు



గురువారం కృష్ణా జిల్లా పెడనలో జరిగిన కార్యక్రమంలో మగ్గం నేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

> రాష్ట్రంలో మునుపెన్నడూ లేని రీతిలో మనం మంచి పనులు చేస్తుండటాన్ని చంద్రబాబుతో కూడిన దుష్ట చతుష్టయం జీర్ణించుకోలేకపోతోంది. అన్ని వర్గాలకు అండగా నిలవడాన్ని కూడా తప్పుబడుతున్నారు. వీరి వైఖరి చూస్తుంటే బాధ కలుగుతోంది.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఒక రాట్నం... ఒక మగ్గం మన దేశం రూపురేఖలను మార్చేశాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక్కసారి మన స్వాతంత్ర్య పోరాటాన్ని గమనిస్తే భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు, ఆచారాలు, జాతీయ ఉద్యమాన్ని సంఘటితం చేసిన ఘనత నేతన్నలదేనని గుర్తు చేశారు. మన నేతన్నలు మగ్గాల మీద నేసేది దారాల కలబోత మాత్రమే కాదన్నారు. గురువారం కృష్ణా జిల్లా పెడనలో వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా 80,546 మంది నేతన్నలకు రూ.193.31 కోట్లను బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమ చేసిన అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు.

బతుకుదెరువు కోసం..

మన నేత, చేనేత గొప్ప సంస్కృతి, చరిత్ర, స్వాతంత్ర్య పోరాటాలకు నిదర్శనాలుగా నిల్చాయి. అటువంటి మగ్గాన్ని, చేనేతను వేల సంవత్సరాల నుంచి నమ్ముకుని బతుకుదెరువు కోసం

మిగతా 2వ పేజీలో ▶

పోలవరానికి అడ్‌హక్ నిధుల విడుదలకు ఆమోదం

రెండు, మూడు రోజుల్లో భోగాపురం అనుమతులు

- పురోగతిలో ఇతర 'విభజన' అంశాలు
- పీఎంవో కమిటీతో సమావేశం ఫలప్రదమైంది
- 11 అంశాలపై చర్చించాం
- అన్ని అంశాలపై కేంద్ర ప్రభుత్వ అధికారులు సానుకూలం
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధుల భేటీ

10లో





కుప్పంలో కట్టెలతో టీడీపీ కార్యకర్తల స్వైర విహారం.. తన మీదకు టీడీపీ కార్యకర్తలు రాళ్లు విసిరి భయభ్రాంతులకు గురిచేయడంతో కన్నీరు పెడుతున్న కుప్పం ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేత అశ్విని

కుప్పంలో టీడీపీ గూండాగిరి

చంద్రబాబు డైరెక్షన్‌లో కార్యకర్తల స్వైరవిహారం

- ఓటములు తట్టుకోలేకే బాబు రెచ్చగొట్టే ప్రసంగాలు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస దాడులు..
- గాయాలతో పలువురు ఆస్పత్రిపాలు
- పోలీసులనూ వదిలిపెట్టని టీడీపీ రౌడీలు
- కర్రలతో కుప్పం వీధుల్లో విచక్షణారహితంగా దాడులు
- ప్రాణభయంతో పరుగులు తీసిన ఎంపీపీ అశ్విని
- నేడూ అల్లర్లకు కుట్ర.. ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టేందుకు ప్రణాళిక
- భారీగా మోహరించిన పోలీసు బలగాలు

సాక్షి, చిత్తూరు : ఇన్నేళ్లు మభ్యపెట్టి ఓట్లు దండుకుంటూ వచ్చిన చంద్రబాబుకు కుప్పం నియోజకవర్గం ప్రజల్లో వచ్చిన చైతన్యం కంటగింపుగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఏకపక్ష విజయాన్ని కట్టబెట్టడంతో పాటు శ్రేణులు క్రమంగా పార్టీకి దూరమవుతుండటంతో దిక్కుతోచని స్థితిలో ఆయన ఏకంగా పార్టీ శ్రేణుల్ని భౌతిక దాడులకు ఉసిగొల్పుతున్నారు. బుధ, గురువారాల్లో ఆయన తన కార్యకర్తలను రెచ్చగొట్టిన తీరుచూస్తే.. నయానో భయానో

మిగతా 3వ పేజీలో ▶

'స్కిల్' కుంభకోణంలో ఇద్దరు అరెస్టు

- కీలక నిందితులైన షెల్ కంపెనీ నిర్వాహకులు విపిన్ శర్మ, నీలం శర్మ దంపతులను అరెస్టు చేసిన సీఐడీ
- ట్రాన్సిట్ వారెంట్‌పై ఢిల్లీ నుంచి విజయవాడ తీసుకొచ్చిన అధికారులు
- ఏసీబీ న్యాయస్థానంలో హాజరు
- జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు
- వీరిద్దరితో కలిపి ఇప్పటివరకు ఎనిమిది మంది అరెస్టు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం
- యువతకు నైపుణ్యాభివృద్ధి పేరుతో రూ.241 కోట్లు కొల్లగొట్టిన టీడీపీ పెద్దలు


3లో

ఇదండీ సంగతి



పార్లమెంట్ బోర్డులో నుంచి సకాలంలోనే తీసేశాం కదా!

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం



- కర్ణాటకలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. క్రూయిజర్ వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో 10 మంది వలస కూలీలు మరణించారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు.

- వివరాలు 6లో

రాజాసింగ్‌పై పీడీ చట్టం



- తెలంగాణలోని గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై హైదరాబాద్ పోలీసులు పీడీ చట్టాన్ని ప్రయోగించారు. ఆయన్ని గురువారం అరెస్టు చేసి పోలీసు బందోబస్తు మధ్య చర్లపల్లి జైలుకు తరలించారు.

- వివరాలు 14లో

క్లుప్తంగా

27న స్కూళ్లకు సెలవు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని స్కూళ్లకు ఈ నెల 27(నాలుగో శనివారం)ను సెలవు దినంగా పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు కమిషనర్ కె.సురేష్‌కుమార్ గురువారం సర్క్యులర్ జారీ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల కోసం ఆగస్టు 13వ తేదీ(రెండో శనివారం) నాడు రాష్ట్రంలోని అన్ని స్కూళ్లు, ఇతర విద్యాసంస్థలు పనిచేశాయి. సెలవు దినంలో స్కూళ్లు, ఇతర విద్యాసంస్థలు పనిచేసినందున దానికి ప్రత్యామ్నాయంగా 27వ తేదీని సెలవు దినంగా పరిగణించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కృష్ణా జిల్లా టీచర్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



సాక్షి, అమరావతి: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎంపికైన వారి జాబితాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 46 మందిని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేసింది. ఏపీ నుంచి ఒక్కరికే ఈ అవార్డు దక్కింది. కృష్ణా జిల్లా కానూరులోని ఏఎస్ఎస్ఆర్ఏ జెడ్పీ హైస్కూల్ డాక్టర్ రవిఅరుణ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. టీచర్స్ డేను పురస్కరించుకుని సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులను అందిస్తారు.

బందరు పోర్టుకు లైన్‌క్లియర్

నవయుగ పోర్టు లిమిటెడ్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

- ఆ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేయడం సబబే
- ఒకేసారి 5,342 ఎకరాల భూమి అప్పగిస్తేనే పనులు ప్రారంభిస్తామనడం సరికాదు
- ఒకేసారి భూములు ఇవ్వాలని ఒప్పందంలో ఎక్కడా లేదు
- తేల్చిచెప్పిన న్యాయస్థానం



సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా మచిలీపట్నం పోర్టు అభివృద్ధికి అడ్డంకులు తొలగిపోయాయి. నవయుగ పోర్టు లిమిటెడ్‌తో ఒప్పందాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు సమర్థించింది. ఒప్పందం రద్దును ప్రశ్నిస్తూ నవయుగ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం కొట్టేసింది. ఒప్పందం ప్రకారం చేపట్టాల్సిన బాధ్యతలను నిర్వర్తించడంలో నవయుగ విఫలమైందని తేల్చిచెప్పింది. ఒప్పందంలోని బాధ్యతలను నిర్వర్తించడానికి నిరాకరించినప్పుడు ఒప్పందాన్ని రద్దు చేయడం సబబేనని పేర్కొంది. మొత్తం 5,342 ఎకరాల భూమిని ఒకేసారి అప్పగిస్తేనే ప్రాజెక్టు పనులు చేపడతామని నవయుగ చెప్పడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఇది ఆ కంపెనీ పెట్టిన కొత్త ఏకపక్ష నిబంధన అని ఆక్షేపించింది. ఒప్పందంలో ఎక్కడా భూమిని ఒకేసారి ప్రారంభంలోనే ఇవ్వాలన్న నిబంధన ఏదీ లేదని స్పష్టం చేసింది. సముద్రానికి పక్కన ఉన్న 2,601 ఎకరాల భూమిని ఇస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనను నవయుగ తిరస్కరించిందని పేర్కొంది. తమకు ఒకేసారి 5,342 ఎకరాలను ఇవ్వాలని పట్టుబట్టిందని తెలిపింది. మొత్తం 5,342 ఎకరాల భూమిని అప్పగిస్తే తప్ప, నిధుల లభ్యతను సాధించేందుకు.. పోర్టు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోబోమని ఆ కంపెనీ చెప్పిందంది. తద్వారా పోర్టు అభివృద్ధి కోసం కుదుర్చుకున్న ఒప్పందంలోని బాధ్యతలను నిర్వర్తించడానికి నవయుగ నిరాకరించినట్టైందని స్పష్టం చేసింది. 2018 మార్చి కల్లా నిధుల లభ్యతను సాధించడంలోనూ ఆ కంపెనీ విఫలమైందని వెల్లడించింది. దీంతో ప్రభుత్వం ఒప్పందాన్ని రద్దు చేస్తూ జీవో 66 జారీ చేసిందని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు గురువారం తీర్పు వెలువరించారు.

ఇదీ నేపథ్యం..

మచిలీపట్నం పోర్టుకు సంబంధించి పదకొండున్నరేళ్ల క్రితం నవయుగ పోర్టు లిమిటెడ్ నాటి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాథమికంగా ప్రభుత్వం 412 ఎకరాల భూమిని అప్పగించింది. ఆ తర్వాత 2,601 ఎకరాల భూమిని అప్పగిస్తామని ప్రతిపాదించినా నవయుగ ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో ఒక్క పని కూడా మొదలు పెట్టలేదు. పోర్టు శంకుస్థాపన శిలాఫలకం తప్ప.. ఏ రకమైన పనులు చేపట్టలేదు. సవరణ ప్రాజెక్టు రిపోర్టులు సమర్పించడం తప్ప ఇన్నేళ్లలో ఆ కంపెనీ చేసిందీ ఏమీ లేదు. ప్రతి విషయంలో మినహాయింపులు కోరడం తప్ప ఏమీ చేయలేదు. ఒప్పందానికి అనుగుణంగా నడుచుకోకపోవడం, నిర్దేశిత కాల వ్యవధిలోపు పనులు ప్రారంభించకపోవడంతో నవయుగతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేస్తూ 2019లో జీవో 66 జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ నవయుగ పోర్టు లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు జీవో అమలుపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. టెండర్ల ప్రక్రియ కొనసాగించుకోవచ్చని, అయితే టెండర్లను ఖరారు చేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.



పీవీ సింధు సాధించిన పతకాన్ని చూస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తన కుటుంబసభ్యులతో సీఎం జగన్‌ను కలిసిన హాకీ క్రీడాకారిణి రజనీ, చిత్రంలో మంత్రి రోజా

క్రీడలకు మరింత ప్రాధాన్యం

- పీవీ సింధు, రజనీలను అభినందించిన సీఎం జగన్
- రజనీకి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాల విడుదలకు సీఎం ఆదేశం

సాక్షి, అమరావతి: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు, హాకీ క్రీడాకారిణి ఇ.రజనీ గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. అంతర్జాతీయ క్రీడా వేదికలపై తెలుగువారి ఖ్యాతిని నిలబెడుతున్న సింధు, రజనీలను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని.. క్రీడలకు మరింత ప్రాధాన్యమిస్తున్నామని సీఎం జగన్ చెప్పారు. కామన్వెల్త్‌గేమ్స్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో పసిడి పతకం గెలిచిన పీవీ సింధు సీఎం వైఎస్ జగన్‌కు చూపించారు. కాంస్య పతకం సాధించిన భారత మహిళల హాకీ జట్టు గోల్‌కీపర్ రజని.. హాకీ క్రీడాకారిణుల ఆటోగ్రాఫ్‌తో కూడిన హాకీ స్టిక్, టీ షర్ట్‌ను సీఎం జగన్‌కు బహూకరించారు. కాగా, రజనీకి ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సింధు, రజని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంచిని ఓర్వలేరు



సీఎం వైఎస్ జగన్‌కు నవరత్నాల లోగోతో కూడిన చేనేత వస్త్రాన్ని చూపుతున్న నేతన్న



నేతన్న నేస్తం లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న సీఎం జగన్

▶ మొదటి పేజీ తరువాయి

నేతన్నలు అవస్థలు పడటాన్ని శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ప్రతిచోటా గమనిస్తున్నాం. అద్భుతమైన వస్త్రాలను నేసే నేతన్నల జీవితాలు ఎలా ఉన్నాయో నా 3,648 కి.మీ. పాదయాత్రలో చాలాచోట్ల కళ్లారా చూశా. మాట ప్రకారం వారికి తోడుగా నిలుస్తున్నాం.

నేతన్నపై ప్రేమకు నిదర్శనం..

2019లో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని నా పుట్టిన రోజు నాడే తెచ్చాం. నేతన్న మీద నా ప్రేమకు అది నిదర్శనం. క్రమం తప్పకుండా ఏటా రూ.24 వేల చొప్పున అందించే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇవాళ వరుసగా నాలుగో ఏడాదీ అందచేస్తున్నాం. ఈ ఒక్క పథకం కింద ఇప్పటివరకు ఒక్కో నేతన్న కుటుంబానికి రూ.96 వేల మేర ప్రయోజనాన్ని చేకూర్చాం. గత అప్పుల కింద బ్యాంకులు ఈ డబ్బులను జమ చేయకుండా అన్ ఇన్‌కంబర్డ్ ఖాతాల ద్వారా జమ చేస్తున్నాం.

మొత్తం సాయం రూ.2,049.43 కోట్లు

ఇవాళ అందించే సాయంతో కలిపితే ఇప్పటివరకూ వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా అందించిన మొత్తం సాయం రూ.776.13 కోట్లు. ఇది కాకుండా నేతన్నలకు సామాజిక పింఛన్ల ద్వారా మరో రూ.880 కోట్లు, ఆప్కో ద్వారా మరో రూ.393.30 కోట్లు చెల్లించాం. ఇలా మూడేళ్లలో నేతన్నల సంక్షేమానికి మన ప్రభుత్వం ఏకంగా రూ.2,049.43 కోట్లు ఖర్చు చేసింది. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కార్యక్రమం చేయడం లేదు. మన గతంలో ఏ ఒక్క ప్రభుత్వమైనా నేతన్నలకు ఇంత అండగా నిలబడిందా? ఒక్కసారి మీ మనస్సాక్షిని అడగండి.

మూడేళ్లలో చేసిన మంచి ఇదీ..

■ శాశ్వత బీసీ కమిషన్...

శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్, బీసీ కులాలకు ఏకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన తొలి ప్రభుత్వం మనదే. మూడేళ్లలో వివిధ పథకాల ద్వారా రూ.1.65 లక్షల కోట్ల మేర నేరుగా అక్కచెల్లెమ్మలకు లబ్ధి చేకూర్చగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన అక్కచెల్లెమ్మలకే 75 శాతం పైగా డబ్బులు ఇవ్వగలిగాం.

■ అధికారంలో..

మొదటి విడత మంత్రివర్గంలో 56 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకిస్తే రెండో విడతలో వారికి 70 శాతం ఇవ్వగలిగాం. రెండు మంత్రివర్గాల్లోనూ ఐదుగురికి డిప్యూటీ సీఎం పదవులిస్తే అందులో నాలుగు (80 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చాం. శాసనసభ స్పీకర్‌గా బీసీ, శాసనమండలి చైర్మన్‌గా ఎస్సీ ఉన్నారు. మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ అక్క ఉన్నారు. మూడేళ్లలో రాజ్యసభకు 8 మందిని పంపిస్తే అందులో నలుగురు బీసీలే. ఎమ్మెల్సీలుగా 32 మందికి అవకాశం కల్పిస్తే వారిలో 18 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారు.

■ కార్పొరేషన్లలో...

98 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీ చైర్మన్ల పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏకంగా 70 పదవులు దక్కాయి. 648 మండల ప్రజా పరిషత్ పదవుల్లో వైఎస్సార్ సీపీ 637 గెలుచుకుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 66.7 శాతం పదవులు ఇచ్చాం. జెడ్పీ చైర్మన్లు 13కిగానూ 13 వైఎస్సార్‌సీపీనే గెల్చుకుంది. వీటిలో 9మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారంటే గతానికి, ఇప్పటికి తేడా మీరే గమనించండి.

■ సామాజిక న్యాయం...

చంద్రబాబు పాలనలో ఎలాంటి సామాజిక న్యాయం ఉందో చెప్పేందుకు ఒక్క ఉదాహరణ చాలు. నాడు విజయవాడ మేయర్‌గా కోనేరు శ్రీధర్, కృష్ణా జెడ్పీ చైర్మన్‌గా గద్దె అనురాధ, కనకదుర్గమ్మ ఆలయం చైర్మన్‌గా యలమంచి గౌరంగబాబు ఉన్నారు. వీరంతా ఒకే సామాజిక వర్గానికి చెందినవారు. ఇవాళ మన పాలనలో విజయవాడ మేయర్‌గా నా చెల్లి, బీసీ మహిళ భాగ్యలక్ష్మి ఉన్నారు. కృష్ణా జెడ్పీ చైర్మన్‌గా మరో బీసీ చెల్లెమ్మ హారిక ఉన్నారు. దుర్గ గుడి చైర్మన్‌గా బీసీ అన్న సోమినాయుడు ఉన్నారు. ఎటు చూసినా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులే కనిపిస్తున్నారు. సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించాం.

■ 50 శాతం కేటాయిస్తూ చట్టం

నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే కేటాయిస్తూ ఏకంగా చట్టం చేశాం. అందులోనూ 50 శాతం పదవులు నా అక్కచెల్లెమ్మలకే రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేశాం. వివిధ కార్పొరేషన్లకు సంబంధించి 137 చైర్మన్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 58 శాతం ఇచ్చాం. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, ఎస్సీలకు 3, ఎస్టీలకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల్లో అక్కచెల్లెమ్మలు 50 శాతానికి పైగా కనిపిస్తారు.

■ అక్కచెల్లెమ్మలకు అండగా..

అక్కచెల్లెమ్మల పేరుతో ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. దాదాపు 22 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో శరవేగంగా సాగుతోంది.

నేతన్నల కుటుంబాలకు దన్ను

■ అప్‌గ్రేడ్ మిషన్స్..

ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో మగ్గాలను జాకార్డ్ లిఫ్టింగ్ మిషన్స్ లాంటి ఆధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేసుకునే అవకాశం నేతన్నలకు వచ్చింది. తద్వారా కొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారు. సులువుగా మగ్గాన్ని నడుపుతున్నారు. 2018–19లో నెలకి రూ.4,680 మాత్రమే ఉన్న నేతన్నల ఆదాయం వైఎస్సార్ నేతన్న నేస్తం దన్నుతో మగ్గాలు అప్‌గ్రేడ్ చేసుకోవడంతో ఏకంగా మూడు రెట్లు పెరిగి రూ.15 వేలకు చేరింది.

■ ఆన్‌లైన్‌తో ప్రపంచానికి పరిచయం..

ఆప్కో వస్త్రాలను మొట్టమొదటిసారిగా మన ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌కు పరిచయం చేశాం. ఈ కామర్స్ సంస్థలైన అమెజాన్, మింత్ర, ఫ్లిప్‌కార్ట్, గోకాప్, లూమ్‌ఫోక్స్, మిరావ్, పేటీఎం లాంటి వ్యాపార దిగ్గజాలతో ఒప్పందాలు చేసుకుని ఆప్కో ద్వారా వస్త్రాలను మార్కెటింగ్ చేసే స్థాయిని పెంచాం.



సీఎం జగన్‌కు మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో ఎమ్మెల్యే కొడాలి నాని

ఒక్కో ఇంటి విలువ కనీసం రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలు ఉంటుందనుకుంటే అక్కచెల్లెమ్మల చేతుల్లో రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల ఆస్తి పెడుతున్నాం. అమ్మఒడి, ఆసరా, సున్నావడ్డీ, చేయూత పథకాలతో తోడుగా నిలిచాం. వంద శాతం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యాదీవెన అమలు చేస్తున్నాం. వసతి దీవెన, ఇంగ్లీష్ మీడియం స్కూళ్లతో పాటు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నాం. 1.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ చెల్లెమ్మలు, తమ్ముళ్లు 86 శాతం ఉన్నారు.

రూ.102 కోట్ల పనులకు పచ్చజెండా

నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మంత్రి జోగి రమేష్ దాదాపు రూ.102 కోట్ల విలువైన పనుల ప్రతిపాదనలు అందచేశారు. ఇందులో రోడ్లు, డ్రైనేజీ, కాంపౌండ్ వాల్, నీటి సరఫరా, బ్రిడ్జిలు, బీటీ రోడ్ల పనులకు సంబంధించి మొత్తం మంజూరు చేస్తున్నా. ఇంకో శుభవార్త ఏమిటంటే.. కాసేపటి క్రితమే మచిలీపట్నం పోర్టుకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్న శుభవార్త వచ్చింది. జిల్లాలో నా తర్వాత కార్యక్రమం బందరు పోర్టుకు శంకుస్థాపన చేయడమే. అందుకోసం మళ్లీ వస్తా.

నేరుగా ప్రజల వద్దకే

ఈ సందర్భంగా వినతిపత్రాలు అందించేందుకు వచ్చిన వారిని గమనించిన సీఎం జగన్ తన రాజకీయ కార్యదర్శి ముత్యాలరాజు, జిల్లా కలెక్టర్‌ను నేరుగా వారి వద్దకు పంపి విజ్ఞాపనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జోగి రమేష్, ఆర్కే రోజా, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పెద్దఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

సంతోషించే హృదయాలు కావవి..

- ఇవాళ ఇన్ని మంచి పనులు జరుగుతుంటే జీర్ణించుకోలేని కుట్రదారులు చాలా మంది ఉన్నారు. మంచి జరుగుతున్నప్పుడు సంతోషపడే హృదయాలు కావవి. మంచి జరుగుతుంటే రాళ్లు వేసే కుళ్లు, కుతంత్రాలను మన కళ్లెదుటే చూస్తున్నాం.
- నాకు వాళ్ల మాదిరిగా ఈనాడు సపోర్టు ఉండకపోవచ్చు, ఆంధ్రజ్యోతి తోడుగా ఉండకపోవచ్చు, టీవీ 5 అండ ఉండకపోవచ్చు, దత్తపుత్రుడి సహాయం ఉండకపోవచ్చు. కానీ వాళ్లకు లేనిది, నాకు ఉన్నది ఒక్కటే.. దేవుడి దయ, మీ అందరి చల్లని దీవెనలు నాకు తోడున్నాయి.
- కోట్ల మందికి మంచి చేయడానికి దేవుడు ఈ ముఖ్యమంత్రి పదవిని ఇచ్చాడనుకుంటే.. అప్పుడు జనంపై నమ్మకం పెట్టుకుని పరిపాలన చేస్తారు. దేవుడిచ్చిన అవకాశాన్ని మంచి చేయడానికి వాడుతున్నా. అందుకే నేను చేసిన మంచి మీద నమ్మకం ఉంది. నా నమ్మకం మీమీద ఉంది.
- గత ప్రభుత్వంలో అధికారంలో ఉన్నవారు ముఖ్యమంత్రి పదవిని తన వాళ్ల కోసం, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, దత్తపుత్రుడి కోసం వినియోగించారు. రాష్ట్రాన్ని దోచుకో.. పంచుకో.. తినుకో అనే స్కీంతో పాలన సాగించారు.
- ఆ రోజు అప్పులు గమనిస్తే కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేటు (అప్పు శాతం పెరుగుదల) 19 శాతం ఉంటే ఈ రోజు 15 శాతం మాత్రమే ఉంది. అంటే ఆరోజు కన్నా ఇవాళ అప్పులు తక్కువగానే చేస్తున్నాం. అప్పుడు ఎందుకు చేయలేకపోయారు? ఇప్పుడు మీ బిడ్డ ఎలా చేయగలుగుతున్నాడో ఆలోచన చేయండి. అప్పటికి, ఇప్పటికి తేడా ఒక్కటే.. సీఎం మార్పు.



నేతన్న నేస్తం లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బారికేడ్లు అధిగమించిన మానవత్వం!

సాక్షి, మచిలీపట్నం: కృష్ణా జిల్లా పెడనలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో ఆసక్తికరమైన దృశ్యాలు చోటు చేసుకున్నాయి. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ప్రారంభోత్సవానికి హాజరైన అనారోగ్య బాధిత బాలుడి తల్లిదండ్రులు, ఓ వృద్ధురాలు, మరో ముగ్గురు మహిళలు ముఖ్యమంత్రి జగన్‌కు తమ సమస్యలను విన్నవించేందుకు నిరీక్షిస్తున్నారు. వేదికపై కూర్చున్న సీఎం జగన్ అర్జీలు చేతబట్టుకుని ఎదురుచూస్తున్న వారిని గమనించి తనవద్దకు తీసుకురావాలని కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ రావిలాల మహేష్‌కుమార్‌కు సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు వారందరినీ బారికేడ్లు దాటించి వేదిక వద్దకు తీసుకొచ్చారు. సీఎం కార్యాలయ కార్యదర్శి ముత్యాలరాజు, మాజీ మంత్రి పేర్ని నాని వారి వద్దకు వెళ్లి అర్జీలను స్వీకరించి సీఎంకు అందజేశారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. కార్యక్రమం ముగిశాక గుర్తు పెట్టుకుని మరీ మరోసారి వారిని పిలిచి మాట్లాడారు.



నేతన్న నేస్తం సభకు హాజరైన జనసందోహం

నేడు విశాఖకు సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సీఎం వైఎస్ జగన్ శుక్రవారం విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఉదయం 9.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి ముఖ్యమంత్రి చేరుకుంటారు. అక్కడి నుంచి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌కు చేరుకొని.. 'పార్లే ఫర్ ది ఓషన్' సంస్థ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్, బీచ్ పరిరక్షణకు నిర్వహించిన కార్యక్రమాలు, ప్లాస్టిక్ నియంత్రణకు సంబంధించి జీవీఎంసీ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం సందర్శిస్తారు. అనంతరం సీఎం జగన్ సమక్షంలో పార్లే సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు బీచ్ పరిరక్షణపై ఎంవోయూ కుదుర్చుకుంటారు. అనంతరం సిరిపురంలోని ఏయూ కాన్వకేషన్ హాల్‌కు సీఎం చేరుకుంటారు. మైక్రోసాఫ్ట్ సంస్థ అందించిన డిప్లొమా కోర్సును పూర్తి చేసుకున్న 5 వేల మంది విద్యార్థుల్లో కొందరికి సీఎం సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. అనంతరం సీఎం జగన్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత విశాఖ విమానాశ్రయానికి చేరుకొని.. మధ్యాహ్నం 12.40 గంటలకు గన్నవరానికి బయలుదేరుతారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కమిటీ కోఆర్డినేటర్ తలశిల రఘురాం, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డా.మల్లికార్జున, సీపీ శ్రీకాంత్ గురువారం పరిశీలించారు.

20వేల మంది వలంటీర్లతో బీచ్ క్లీనింగ్...

పార్లే ఫర్ ది ఓషన్ సంస్థ గిన్నిస్ రికార్డు నెలకొల్పేలా శుక్రవారం బీచ్ పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపడుతోంది. జీవీఎంసీ, జిల్లా కలెక్టరేట్, ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో శుక్రవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాగరతీరాన్ని పరిశుభ్రం చేయనుంది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు సుమారు 28 కిలోమీటర్ల పొడవునా సాగరతీరంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల్ని సేకరించే కార్యక్రమాన్ని చేపట్టనుంది. మొత్తం 20 వేల మంది వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

'గ్రామదర్శిని' ప్రారంభించిన సీఎం

- పల్లెల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పర్యవేక్షణ
- గడువులోగా సమస్యల పరిష్కారం

సాక్షి, మచిలీపట్నం: గ్రామాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామదర్శిని కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కృష్ణా జిల్లా పెడనలో లాంఛనంగా ప్రారంభించారు. పల్లెల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా గ్రామదర్శిని కార్యక్రమాన్ని రూపొందించినట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. వారంలో ఒకరోజు ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు పర్యటించి సమస్యలను నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించనున్నారు.

పెడనకు పండుగ



జగనన్న రాకతో పెడన నియోజకవర్గానికి ఈ రోజు పండుగ వచ్చింది. మాది పేదలుండే తీర ప్రాంత నియోజకవర్గం. చినగొల్లపాలెంలో వంతెన కడతామంటే ఎవరూ నమ్మలేదు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు బ్రిడ్జిలు కట్టించటమే కాకుండా మెగా వాటర్ స్కీంతో దాహార్తిని తీర్చారు. వైఎస్సార్ హయాంలో రెండు పంటలకు నీరిస్తే చంద్రబాబు ఒక పంటకు కూడా ఇవ్వలేకపోయారు.

– జోగి రమేష్, గృహ నిర్మాణశాఖ మంత్రి

రూ.100 కోట్లు వ్యాపారం లక్ష్యం



నేతన్నలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాదయాత్ర హామీకి కట్టుబడి సీఎం జగన్ నేతన్నలను ఆదుకుంటున్నారు. ఈ- కామర్స్, ఆప్కో ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు వ్యాపారం చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం.

– గుడివాడ అమర్‌నాథ్, చేనేత, జౌళి, పరిశ్రమలశాఖ మంత్రి

మల్లన్నకు పాగా.. అమ్మవారికి చీర



15 ఏళ్లుగా చేనేత వృత్తిలో ఉన్నా. శ్రీశైలం మల్లిఖార్జున స్వామికి పాగా నేసి స్వయంగా అందజేస్తాం. అమ్మవారి ఉత్సవాలకు కూడా మా నేతన్న చీరలే అందచేస్తాం. నేతన్న నేస్తమే కాకుండా అమ్మఒడి, సున్నావడ్డీ కూడా అందాయి.

– సజ్జా కుమారి, లబ్ధిదారు, బ్రహ్మపురం, పెడన

మగ్గాన్ని ఆధునికీకరించుకున్నా



20 ఏళ్లుగా చేనేత వృత్తిలో ఉన్నా. నేతన్న నేస్తం డబ్బులతో గోతిలో ఉన్న మగ్గాన్ని స్టాండ్ మగ్గంగా మార్చుకోవటమే కాకుండా మరింత ఆధునికీకరించుకున్నా. నాకు ఇద్దరు పిల్లలున్నారు. అమ్మఒడి, విద్యా కానుక కిట్లు అందాయి. ఇంగ్లీష్ మీడియం విద్యతో మా పిల్లలకు ఎంతో మేలు చేస్తున్నారు.

– కొసనం వాసు, లబ్ధిదారు, పోలవరం, గూడూరు మండలం

నర్సులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయం

సాక్షి, అమరావతి: నర్సులకు శిక్షణ ఇచ్చే స్టేట్ మిడ్ వైఫరీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఎంఐటీ)లను రాష్ట్రంలోని 10 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో దశలవారీగా ప్రారంభించాలని వైద్య శాఖ నిర్ణయించింది. ఇప్పటికే తిరుపతి, గుంటూరు నర్సింగ్ కాలేజీల్లో శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మాతా, శిశు సంరక్షణ, ప్రసూతి సేవలను నర్సుల ద్వారా అందించే ఉద్దేశంతో.. వారిలో నైపుణ్యాలు పెంపొందించేందుకు 'పోస్ట్ బేసిక్ డిప్లొమా ఇన్ నర్సింగ్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్‌వైఫరీ' కోర్సును కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నర్స్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్‌వైఫరీ(ఎన్‌పీఎం) కోర్సుకు సంబంధించి పలు మార్గదర్శకాలతో వైద్య శాఖ గురువారం ఉత్తర్వులిచ్చింది. 18 నెలల పాటు నర్సులకు మిడ్ వైఫరీ శిక్షణ ఇస్తారు. ఇందులో ఏడాది పాటు శిక్షణ, 6 నెలలు ఇంటర్న్‌షిప్ ఉంటుంది. వీరికి శిక్షణ ఇవ్వడానికి ప్రతి ఎస్ఎంఐటీలో ఆరుగురు మిడ్‌వైఫరీ ఎడ్యుకేటర్‌లు ఉంటారు. ఎన్‌పీఎం శిక్షణ పొందడానికి ఇన్‌సర్వీస్‌లో ఉన్న శాశ్వత, కాంట్రాక్ట్ నర్సులు అర్హులు. 45 ఏళ్లలోపు వయసు, జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత, ప్రసవాలు నిర్వహించడంలో రెండేళ్ల అనుభవం ఉండాలి. ఈ కోర్సు వ్యవహారాలను డీఎంఈ పర్యవేక్షిస్తారు. శిక్షణ అనంతరం నర్సులకు సర్టిఫికెట్‌లు కూడా ఇస్తారు.

క్లుప్తంగా

జీవన ప్రమాణాల మెరుగుదలకు చర్యలు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని


అవార్డు అందుకుంటున్న మంత్రి రజని

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి వైద్యాన్ని, విద్యను ప్రధాన వనరులుగా ఎంచుకుని సంస్కరణలు చేపడుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చెప్పారు. ఎకనమిక్ టైమ్స్ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో నిర్వహించిన డిజిటెక్ కాన్‌క్లేవ్-2022లో ఆమె పాల్గొన్నారు. ప్రజల హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు రాష్ట్రానికి వచ్చిన అవార్డును మంత్రి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచాన్ని కరోనా మహమ్మారి అతలాకుతలం చేసిన సమయంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో సాంకేతికతను అందిపుచ్చుకుని రాష్ట్ర ప్రభుత్వం అనేకమంది ప్రాణాలను కాపాడిందని చెప్పారు. ప్రజలకు భరోసాగా నిలిచిందన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాలకు భరోసాగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ పథకం కింద 2,446 చికిత్సలను కవర్ చేస్తున్నామని, త్వరలో మరిన్ని చికిత్సలను ఈ పథకం పరిధిలోకి తీసుకురాబోతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కుప్పంలో ప్రశాంతతను పాడుచేస్తున్నారు..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి/మంగళగిరి: కుప్పంలో ప్రశాంత వాతావరణాన్ని నాశనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే డీజీపీ కార్యాలయంతో పాటు సీఎం ఇంటినీ ముట్టడిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఫ్యాక్షన్, ఉన్మాద పాలనకు కుప్పం పరిణామాలు అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేకతను దారి మళ్లించేందుకు అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతోనే అన్న క్యాంటీన్లను టీడీపీ నిర్వహిస్తుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలు వాటిని అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. చంద్రబాబు కుప్పం పర్యటన వివరాలు పోలీసులకు వారం ముందే అందించినా.. భద్రత పరమైన ఏర్పాట్లు చేయకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

టీడీపీ నాయకుల అత్యుత్సాహంతో మంగళగిరి డీజీపీ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కుప్పంలో జరిగిన ఘటనకు నిరసనగా గురువారం డీజీపీకి ఫిర్యాదు చేసేందుకు పార్టీ శ్రేణులు గుంపులుగా వెళ్లడంతో కార్యాలయంలోకి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం అక్కడే బైఠాయించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, నాయకులు.. రాజారెడ్డి రాజ్యాంగం వద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం నార్త్ జోన్ డీఎస్పీ రాంబాబుకు వినతిపత్రం ఇచ్చి వెనుదిరిగారు.

ఎంపీ రఘురామ ఓ బఫూన్

వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని



సాక్షి, రాజమహేంద్రవరం: నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు ఓ బఫూన్ అని ఎంపీ మార్గాని భరత్‌రామ్ మండిపడ్డారు. పొద్దున లేచిన దగ్గర నుంచి మీడియా ముందు కూర్చొని సొల్లు కబుర్లు చెప్పడం తప్ప ఆయన చేయగలిగిందేమీ లేదన్నారు. సొంత కేడర్ కూడా లేని ఆయనకు సీఎంను విమర్శించే స్థాయి లేదని ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో రెండు ఫ్లై ఓవర్లు మంజూరయ్యాయని.. ఈ విషయమైనా ఎంపీ రఘురామకు తెలుసా? అని ప్రశ్నించారు. జాతీయ మీడియా సర్వేలన్నీ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే విజయం దక్కుతుందని స్పష్టం చేస్తున్నాయన్నారు. దీంతో రఘురామ వాటిని తప్పుదోవ పట్టించేందుకు దొంగ సర్వేల నాటకం మొదలుపెట్టాడని దుయ్యబట్టారు. రఘురామ సొంత నియోజకవర్గానికి వెళ్తే ప్రజలే తరిమికొడతారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు గతంలో ఏ సంక్రాంతికో తన సొంత నియోజకవర్గం కుప్పానికి వెళ్లేవారని ఎంపీ భరత్ గుర్తు చేశారు. ఇప్పుడు జగనన్న దెబ్బకు నెలకు మూడుసార్లు కుప్పం వెళ్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చే నాటికి ప్రభుత్వ ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉన్నాయన్నారు. 14 ఏళ్ల సీఎంగా వ్యవహరించిన బాబు ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి వెళ్లడం ఏంటని నిలదీశారు. సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్తే నానా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన పర్యటనతోనే పోలవరం ఇరిగేషన్ అథారిటీలో కదలిక వచ్చిందన్నారు. అలాగే మహారాష్ట్ర తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక జాతీయ రహదారులు మంజూరయ్యాయన్నారు.

‘స్కిల్’ కుంభకోణంలో ఇద్దరు కీలక నిందితుల అరెస్టు

యువతకు నైపుణ్యాభివృద్ధి పేరుతో రూ.241 కోట్లు కొల్లగొట్టిన టీడీపీ పెద్దలు

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)లో జరిగిన కుంభకోణానికి సంబంధించి ఇద్దరు కీలక నిందితులను సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఢిల్లీకి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ విపిన్ కుమార్ శర్మ, ఆయన భార్య నీలం శర్మను సీఐడీ అధికారులు అరెస్టు చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకువచ్చారు. వారిని విజయవాడలోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) న్యాయస్థానంలో బుధవారం రాత్రి హాజరుపరచగా కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు సీఐడీ అధికారులు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టైంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తామంటూ షెల్ కంపెనీల ముసుగులో గత టీడీపీ ప్రభుత్వ పెద్దలు రూ.241 కోట్ల నిధులను కొల్లగొట్టిన సంగతి తెలిసిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవహారంపై సీఐడీ విచారణకు ఆదేశించింది. ఈ విచారణలో సంచలన విషయాలు వెలుగు చూశాయి.

నకిలీ ఇన్వాయిస్‌లతో బురిడీ..

రూ.241 కోట్ల ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో గత టీడీపీ ప్రభుత్వ పెద్దలకు అడ్డదారిలో నిధులు మళ్లించడంలో ఢిల్లీకి చెందిన విపిన్ శర్మ, నీలం శర్మ దంపతులు కీలకంగా వ్యవహరించారు. వారిద్దరూ ఢిల్లీలో ‘ఇన్ వెబ్ సర్వీసెస్’ అనే ఓ షెల్ కంపెనీని నిర్వహిస్తున్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ నిబంధనలకు విరుద్ధంగా సీమెన్స్, డిజైన్ టెక్ కంపెనీలకు నిధులు చెల్లించింది. ఈ నిధులను సీమెన్స్, డిజైన్ టెక్.. వివిధ షెల్ కంపెనీల రూపంలో దారి మళ్లించాయి. ఈ క్రమంలో పూణేకు చెందిన స్కిల్లర్ అనే షెల్ కంపెనీ ద్వారా నకిలీ ఇన్వాయిస్‌లతో నిధులు కొల్లగొట్టిన విషయం గతంలోనే వెలుగు చూసింది. ఆ నిధులను సింగపూర్‌లోని సంస్థలకు తరలించి.. అక్కడి నుంచి టీడీపీ ప్రభుత్వ పెద్దలకు చేర్చారు. అదే రీతిలో విపిన్ శర్మ, నీలం శర్మలకు చెందిన ఇన్ వెబ్ సర్వీసెస్ కంపెనీ నుంచి నకిలీ ఇన్వాయిస్‌లు తీసుకుని ఆ కంపెనీకి రూ.8.50 కోట్లు చెల్లించారు. అందులో తమ కమీషన్‌గా రూ.7.5 లక్షలు తీసుకుని మిగిలిన మొత్తాన్ని మళ్లీ టీడీపీ ప్రభుత్వ పెద్దల ఖాతాల్లోకి ఆ కంపెనీ చేర్చింది. సీఐడీ దర్యాప్తులో ఈ విషయాలన్నీ బయటపడ్డాయి. దీంతో డిజైన్ టెక్ కంపెనీ బ్యాంకు ఖాతాల్లోని రూ.23 కోట్లను ఇటీవల సీఐడీ అధికారులు జప్తు చేశారు.

చంద్రబాబు ఆదేశాలతో రూ.371 కోట్లు చెల్లింపు

ప్రాజెక్టు పనులు మొదలుపెట్టకుండానే చంద్రబాబు ఆదేశాలతో అప్పటి ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ ప్రభుత్వం తరఫున 10 శాతం వాటాగా జీఎస్టీతో కలుపుకుని రూ.371 కోట్ల నిధులను సీమెన్స్ ఇండియా, డిజైన్ టెక్‌లకు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కుంభకోణంలో ఏపీఎస్ఎస్‌డీసీకి అప్పట్లో డైరెక్టర్‌గా ఉన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు కీలకంగా వ్యవహరించారు. ఇక ఏపీఎస్ఎస్‌డీసీ డిప్యూటీ సీఈవోగా ఐఏఎస్ అధికారి అపర్ణ ఉపాధ్యాయను నియమించారు. ఈ ప్రాజెక్టు కోసం ఒప్పందం కుదుర్చుకున్న సీమెన్స్ కంపెనీ కమిటీలో సభ్యుడైన జీవీఎస్ భాస్కర్ భార్య ఈమె. ఈ విధంగా పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు నిబంధనలను ఉల్లంఘిస్తూ మరీ ఆమెకు పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. కనీసం సీమెన్స్ ఇండియా, డిజైన్ టెక్‌ల నుంచి బ్యాంకు గ్యారంటీ కూడా తీసుకోలేదు. ఇందులో సీమెన్స్ కంపెనీ సరఫరా చేసిన రూ.56 కోట్ల సాఫ్ట్‌వేర్, మరికొన్నింటికి చెల్లింపులు చేసి కథ ముగించారు. మిగతా రూ.241 కోట్లను నకిలీ ఇన్వాయిస్‌లతో షెల్ కంపెనీలు, బినామీ కంపెనీ డిజైన్ టెక్ ఖాతాలోకి మళ్లించారు. అక్కడి నుంచి టీడీపీ పెద్దల ఖాతాల్లోకి రూ.241 కోట్లు చేరాయి.

తనిఖీల్లో వెలుగుచూసిన నకిలీ ఇన్వాయిస్‌లు..

కాగా కేంద్ర జీఎస్టీ అధికారులు 2018లో పూణేలో కొన్ని సంస్థలపై నిర్వహించిన తనిఖీల్లో నకిలీ ఇన్వాయిస్‌లు వెలుగు చూశాయి. అవి ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టుకు సంబంధించినవని గుర్తించి ఆ విషయాన్ని ఏపీ ఏసీబీ విభాగానికి తెలిపారు. కానీ అప్పటి టీడీపీ పెద్దలు ఈ విషయాన్ని కప్పిపుచ్చారు. పైగా ఏపీఎస్ఎస్‌డీసీలో కీలకమైన ఫైళ్లను మాయం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్ర జీఎస్టీ అధికారులు ఏసీబీ దృష్టికి తెచ్చిన విషయం బయటపడింది. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో సీఐడీ దర్యాప్తు చేపట్టింది. టీడీపీ హయాంలో ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం చేసుకున్న సుమన్ బోస్ అలియాస్ సౌమ్యాద్రి శేఖర్ బోస్ వ్యవహారాలతో తమకు ఏమాత్రం సంబంధం లేదని సీమెన్స్ కంపెనీ స్పష్టం చేస్తూ ఏపీఎస్ఎస్‌డీసీకి ఓ లేఖ రాసింది. తాము అందించిన లైసెన్స్‌డ్ సాఫ్ట్‌వేర్‌కుగాను తమకు రూ.56 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించింది. అంతేగానీ వేల కోట్ల ప్రాజెక్టుకు తమ బాధ్యత లేదని సీమెన్స్ స్పష్టం చేసింది. దీంతో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టు పేరుతో టీడీపీ పెద్దలు అడ్డగోలుగా రూ.241 కోట్లు ప్రజాధనాన్ని దోపిడీ చేసినట్టు తేలింది.

కుంభకోణం కథ ఇదీ..

2014–15 చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు రూ.3,556 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే కేవలం కాగితాలపైనే ఓ ప్రాజెక్టును చూపించి ప్రజాధనాన్ని టీడీపీ ప్రభుత్వ పెద్దలు కొల్లగొట్టారు. ఇందులో భాగంగా నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబును సీమెన్స్ ఇండియా లిమిటెడ్ ఎండీ సుమన్ బోస్, డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ కాన్విల్కర్ కలిశారు. మొత్తం రూ.3,556 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూరిస్తే సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలు 90 శాతం నిధులు పెట్టుబడి పెడతాయని ఒప్పందం కుదుర్చుకున్నారు. అసలు ఆ ప్రాజెక్టు వ్యయం రూ.3,556 కోట్లుగా ఎలా నిర్ధారించారని శాస్త్రీయంగా మదింపు చేయనే లేదు. అసలు సీమెన్స్ కంపెనీకి ఈ ఒప్పందం గురించే తెలియదు. భారత్‌లో గతంలో ఆ కంపెనీ ఎండీగా వ్యవహరించిన సుమన్ బోస్ అలియాస్ సౌమ్యాద్రి శేఖర్ బోస్‌తోపాటు టీడీపీ పెద్దలు డిజైన్ టెక్‌తో కలిసి కథ నడిపించారు.

కదిరి టౌన్ సీఐ మధును నరికి చంపాలి

- టీడీపీ కార్యకర్తల ఫోన్ సంభాషణ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

కదిరి: ‘మన నాయకుడు కందికుంట వెంకటప్రసాద్‌పై చర్యలు తీసుకుంటున్న కదిరి టౌన్ సీఐ మధును బహిరంగంగా నరికి చంపాలనేది నా కోరిక. మన నాయకుడి జోలికొస్తే పోలీసు అధికారులనే కాదు.. ఆఖరుకు సీఎంనైనా వదలకూడదు..’ అని శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త మరో కార్యకర్తతో ఫోన్‌లో జరిపిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై పోలీసులు ప్రాథమికంగా ఆరా తీయగా కదిరి టీడీపీ కార్యకర్త మౌలాలినాయుడు, మరో టీడీపీ కార్యకర్త సిద్ధూగౌతమ్‌తో ఫోన్‌లో సంభాషించినట్లు తేలింది.

ఏం జరిగిందంటే..

కదిరిలోని ఓ వెంచర్‌లో స్థలం కొనుగోలు చేసిన కొందరు ఈ నెల 24న ఇళ్ల నిర్మాణానికి పునాదులు తవ్వేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే 4 రోజుల కిందట వాళ్లను తన ఇంటికి పిలిపించిన కందికుంట దుప్పటి పంచాయతీకి దిగారు. తన అనుచరుడు సోమశేఖర్ పూర్వీకులు గతంలో ఆ భూమిని తక్కువ రేటుకు విక్రయించారని, అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారంతా సెంటుకు రూ.2 లక్షల చొప్పున సోమశేఖర్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే అక్కడ ఎవ్వరూ ఇల్లు కట్టుకోవడానికి వీల్లేదని హెచ్చరించారు. ఇందుకు వారు ఒప్పుకోకపోవడంతో బుధవారం అనుచరులతో కలిసి వెంచర్ వద్దకు వెళ్లిన కందికుంట పనులను అడ్డుకున్నారు. జేసీబీపై రాళ్లవర్షం కురిపించి ధ్వంసం చేశారు. ఈ దాడిలో జేసీబీ డ్రైవర్ గాయపడ్డారు. జేసీబీని తగలబెట్టేందుకు యత్నించారు. అక్కడే ఉన్న పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు అడ్డుకుని గుంపును చెదరగొట్టారు. దీన్ని జీర్ణించుకోలేని సీఐని అసభ్య పదజాలంతో దూషించారు. ఈ క్రమంలో ఇప్పుడు టీడీపీ వారు ఏకంగా సీఐనే చంపేయాలని మాట్లాడుకున్న ఆడియో వైరల్ అయింది.

కుప్పంలో టీడీపీ గూండాగిరి

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గ ప్రజలను లొంగదీసుకోవాలన్నదే వ్యూహంగా కనిపిస్తోంది. ఒకవైపు తన అనుచరులను రెచ్చగొడుతూనే.. మరోవైపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే దాడులు చేస్తున్నారంటూ ఆరోపణలకు దిగుతున్నారు. నిజానికి.. చంద్రబాబు అధికారంలో ఉన్నంతకాలం ఈ ప్రాంత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకపోగా.. స్థానిక టీడీపీ నేతలు ప్రజలను అడ్డగోలుగా దోచుకున్నారు. దీంతో ఉపాధి లేని ప్రజలకు వలసలే దిక్కు అయ్యాయి. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అభివృద్ధి ప్రారంభమైంది. కుప్పంను మున్సిపాలిటీగా ప్రకటించటంతో పాటు ప్రత్యేకంగా రూ.65 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం.. రెవెన్యూ డివిజన్‌గా మార్చుచేయడం చంద్రబాబు అసహనానికి కారణమైంది. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సాగుతుండటంతో నియోజకవర్గం నుంచి వలసలు పూర్తిగా నిలిచిపోయాయి. వాస్తవం బోధపడి టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలోకి క్యూ కట్టాయి. దీంతో కుప్పం చేజారిపోతుందని అర్థమయ్యే చంద్రబాబు ఇప్పుడు కల్లోలం సృష్టించేందుకు కుట్ర చేస్తున్నారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గత రెండ్రోజుల్లో ఇక్కడ చోటుచేసుకున్న పరిణామాలను గమనిస్తే ఇది నిజమేనని స్పష్టమవుతుంది.

ఉనికి కోల్పోతామనే భయంతోనే అరాచకాలు

అసలు చంద్రబాబు హయాంలో కుప్పంలో అభివృద్ధి ఏమాత్రం జరగలేదు. అయితే, సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ మూడున్నరేళ్ల పాలనలో చంద్రబాబు ప్రతిష్ట మసకబారింది. నానాటికీ దిగజారిపోతోంది. ప్రత్యేకించి స్థానిక ఎన్నికల్లో టీడీపీ డిపాజిట్లు గల్లంతయ్యాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో తన సీటుకే ఎసరు వచ్చే ప్రమాదాన్ని చంద్రబాబు గ్రహించారు. దీంతో కుప్పంలోనైనా తన ప్రాభవాన్ని నిలుపుకోవాలనే తాపత్రయంలో అరాచకాలకు తెరతీశారు. ప్రణాళికలు సిద్ధంచేసి, శాంతిభద్రతలకు విఘాతం కల్పించి ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపైకి మళ్లించే వ్యూహాన్ని రచించారు.


టీడీపీ శ్రేణులు ధ్వంసం చేసిన ఫ్లెక్సీలు



బాబు డైరెక్షన్‌లోనే అల్లర్లు

ఇక చంద్రబాబు బుధవారం రామకుప్పం మండలంలో ముందస్తు ప్రణాళికతోనే అల్లర్లకు తెరతీశారు. వందలాది మంది టీడీపీ కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులనే టార్గెట్‌గా చేసుకుని దాడులకు తెగబడ్డారు. వారి ఇళ్లపై రాళ్ల వర్షం కురిపించారు. ఆఖరికి రెండేళ్ల చిన్నారిని కూడా గాయాలపాల్జేశారు. ఎప్పుడో ఏర్పాటుచేసుకున్న వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలను బూచిగా చూపించి రాజకీయంగా సొమ్ము చేసుకునే ప్రయత్నం చేశారు. పైగా తమ వాళ్లపైనే వైఎస్సార్‌సీపీ దాడులు చేసిందంటూ ఎల్లో మీడియాలో విస్తృత ప్రచారం చేయించారు. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు సృష్టించాలనే సంకేతాలను టీడీపీ కేడర్‌కు పంపారు.

ప్రాణభయంతో మహిళా ఎంపీపీ పరుగులు

చంద్రబాబు గురువారం కూడా కొత్త నాటకానికి తెరతీశారు. మీడియా దృష్టి కోసం బస్టాండ్ కూడలి వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అన్న క్యాంటీన్ పేరుతో నానా రభస చేశారు. మీడియా ఫొటోసెషన్, వీడియో షూట్ తర్వాత కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. ‘‘వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపైకి తానే వెళ్తాను.. వారి అంతుచూస్తాను’’.. అంటూ మాట్లాడడంతో తెలుగు తమ్ముళ్లు కర్రలతో కుప్పం వీధుల్లో స్వైరవిహారం చేశారు. విచక్షణా రహితంగా దాడులు చేస్తూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపైకి దూసుకెళ్లారు. అడ్డొచ్చిన పోలీసులపై కూడా కర్రలతో దాడిచేసేందుకు ప్రయత్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అశ్విని ఉన్న సమయంలోనే రాళ్లవర్షం కురిపించారు. దీంతో ఆమె ప్రాణభయంతో పరుగులు తీశారు. అయినప్పటికీ ఆమెనే లక్ష్యంగా చేసుకుని కర్రలు, రాళ్లు విసిరారు. మరోవైపు.. లక్ష్మీపురంలో వైఎస్సార్‌సీపీ నేత మణి ఇంటి వద్ద ఉన్న బ్యానర్లు, పార్టీ తోరణాలను టీడీపీ అల్లరి మూకలు ధ్వంసం చేశాయి. ఎమ్మెల్సీ భరత్ ఇంటి వైపు అల్లరి మూకలు వెళ్లేందుకు ప్రయత్నించటంతో పోలీసులు అడ్డుకున్నారు.

వైఎస్సార్‌సీపీ ర్యాలీకి అడ్డంకులు

టీడీపీ నేతలు, కార్యకర్తల చేతుల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న భయ్యారెడ్డి, నారాయణరెడ్డితోపాటు మరి కొందరి బాధితులకు సంఘీభావంగా గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు చేపట్టిన శాంతియుత ర్యాలీకి కూడా టీడీపీ వర్గీయులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. పోలీసుల సూచనతో వైఎస్సార్‌సీపీ నేతలు శాంతియుతంగా ర్యాలీ సాగించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద బైఠాయించి టీడీపీ దౌర్జన్యాలపై నిరసన తెలిపారు. టీడీపీ గూండాల చేతుల్లో గాయపడిన బాధితులను ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్‌లు పరామర్శించారు.

నేడు బాబు రోడ్‌షో.. మళ్లీ అల్లర్లకు కుట్ర?

తొలి రెండ్రోజుల తరహాలోనే మూడోరోజైన శుక్రవారం కూడా తీవ్రస్థాయిలో అల్లర్లు చేసి, తద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు టీడీపీ వ్యూహం పన్నినట్లు.. ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే ముందస్తు సమాచారంతో పోలీసులు బందోబస్తును పటిష్టం చేశారు. జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు.

తమాషా చేస్తే ఇంటికొచ్చి కొడతా

చంద్రబాబు హెచ్చరిక


కుప్పంలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

సాక్షి, చిత్తూరు: ‘‘ఏం తమషా చేస్తున్నారా? మీ ఇంటికే వచ్చి కొడతా? వైసీపీ రౌడీలకు ఎక్స్‌పైరీ డేట్లు అయిపోయాయి. మగాళ్లైతే ఇప్పుడు రండి. రౌడీలు, గూండాలు, ముఠాలు, అణచివేసిన పార్టీ టీడీపీ. నేనూ రోడ్డు మీదకి వస్తా, ఎవరు వస్తారో చూస్తా’’.. అని ప్రతిపక్ష నేత చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుప్పం బస్టాండ్ ప్రాంతంలోని అన్న క్యాంటీన్ వద్ద గురువారం ఆయన రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అన్న క్యాంటీన్‌పై దాడిచేయడం పేదలపై దాడి చేయడమేనన్నారు. తన హయాంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇచ్చానని.. వ్యవస్థ సక్రమంగా పనిచేయాలని పోలీసులకు సూచించారు. దాడులు చేసిన వారిని పోలీస్‌స్టేషన్‌కు కాకుండా ఇంటికి పంపడం దారుణమన్నారు. కుప్పంలో జరిగింది ఏమిటో డీజీపీ వచ్చి చూడాలని డిమాండ్ చేశారు. కొల్లుపల్లిలో తన మీటింగ్ దగ్గరికి వచ్చి జెండాలు ఎగరేస్తారా? ఎంత కొవ్వు, ఎంత కండకావరం? అని చంద్రబాబు మండిపడ్డారు. తన ఇంటి గేటుకు తాళాలు వేసి, తాళ్లు కట్టారని, ఎయిర్‌పోర్టులోనూ అడ్డుకున్నారని, కోర్టు నిలదీస్తే డీజీపీ తలదించుకున్నారని తెలిపారు. మరోవైపు.. తన ఇంటికొచ్చిన రౌడీలకు ప్రమోషన్ ఇచ్చి మంత్రులు చేశారని ఆయన చెప్పారు. 40 ఏళ్లల్లో ఎందరినో చూశానని.. కరుడుకట్టిన నేరస్తుడు సీఎం అయ్యారంటే తప్పు వ్యవస్థదా, ప్రజాస్వామ్యానిదా? అని ప్రశ్నించారు. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పోరాడతామని ఆయన చెప్పారు. టీడీపీ వారికి ఏమైనా అయితే అది పోలీసుల హత్యేనన్నారు. కొట్టినా, కేసులు పెట్టినా భయపడేది లేదని, వెనక్కిపోయే సమస్యేలేదన్నారు.

ప్రజలే ముందుకు రావాలి..

ఇక తనను కుప్పానికి రాకుండా కుట్రలు పన్నుతున్నారని.. తాను సంకల్పం చేస్తే ప్రాణాలను సైతం లెక్కచేయనని చంద్రబాబు అన్నారు. ప్రాణాలు, ఆస్తులు, మానాలు కాపాడుకోవాలంటే ప్రజలే ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ వాళ్ల జోలికొస్తే వారి ఇంటికి వేల మందితో తాను వస్తానన్నారు. ధైర్యంగా ఉండండని, ప్రైవేటు కేసులు వేస్తామని పార్టీ శ్రేణులకు చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఏ రోజు ఎవరిని కొడతారో తాడోపేడో తేల్చుకోవడానికే ఇక్కడకు వచ్చానని.. తాను పిలుపిస్తే కుప్పానికి రెండు లక్షల మంది వస్తారన్నారు.

మహిళా ఎంపీపీపై దాడి శోచనీయం

ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆరంగి మురళి



నరసన్నపేట: ప్రతిపక్ష నేత చంద్రబాబు సమక్షంలో ఒక మహిళా ఎంపీపీపై దాడి జరగడం, ఈ దాడికి టీడీపీ నాయకులతో పాటు స్వయానా చంద్రబాబు వంత పాడటం దారుణమని ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆరంగి మురళి అన్నారు. కుప్పంలో చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కార్యాలయంలో ఉన్న ఎంపీపీ అశ్వినిపై టీడీపీ గూండాలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళ అని కూడా చూడకుండా రాళ్లతో దాడి చేయడం హేయమన్నారు. ఈ సంఘటనపై ప్రతిపక్షనేత చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కుప్పం ఎంపీపీపై దాడి చేసిన వ్యక్తులను గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయం

ఆయనతో అక్కడి ప్రజలు విసిగిపోయారు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే చిత్తుచిత్తు చేశారు
- వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలను కూల్చడం ఖాయం
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఫైర్



గుడివాడ రూరల్: చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో కుప్పం ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి అడ్రస్ లేకుండా చేయడం ఖాయమని మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని వ్యాఖ్యానించారు. కృష్ణాజిల్లా గుడివాడ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కుప్పం ప్రజలు 35 ఏళ్లుగా చంద్రబాబును గెలిపించారని, కానీ, ఆయన మాత్రం నియోజకవర్గ ప్రజలను పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతాడనే భయంతోనే ఈ మధ్య తరచూ కుప్పం వెళ్తున్నారని.. అలాగే, మూడు దశాబ్దాలుగా అక్కడ ఇల్లు కట్టుకోని చంద్రబాబు అడ్రస్‌లేని వ్యక్తిగా నిలిచిపోయారని నాని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలు ఎవరూ ఆయన వైపు చూడకపోవడంతో చిత్తూరు జిల్లాలోని టీడీపీ శ్రేణులను కుప్పం తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై ఉన్న పార్టీ జెండాలను తొలగించారని కొడాలి నాని మండిపడ్డారు. కనీసం కుప్పం నియోజకవర్గంలో ఆయనకు ఓటు కూడాలేదని.. 13 ఏళ్లు ప్రతిపక్ష నాయకుడిగా, 14ఏళ్లు సీఎంగా పనిచేశానని చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. కుప్పం నియోజకవర్గానికే చంద్రబాబును పరిమితమయ్యేలా వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. చంద్రబాబు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో కుప్పం ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడం తథ్యమని కొడాలి నాని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ కలిసి పోటీ చేస్తాయని, వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ చేసి వారిని చిత్తుచిత్తుగా ఓడిస్తుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలను కూల్చడం ఖాయమని నాని ధీమా వ్యక్తం చేశారు.

ఆక్రోశంతోనే బాబు అరాచకం

- కుప్పంలోనూ టీడీపీ జెండా పీకేశారనే కుతంత్రం
- చంద్రబాబుపై ప్రభుత్వ సలహాదారు ‘సజ్జల’ మండిపాటు
- ఉనికి చాటుకోవడానికే తరచూ అక్కడ బాబు పర్యటనలు
- వచ్చినప్పుడల్లా అరాచకాలతో ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారు
- ఊరేగింపుగా వెళ్తున్న టీడీపీ కార్యకర్తల చేతుల్లో కర్రలు ఎందుకున్నాయ్?



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీని ప్రజలు తిరస్కరిస్తే.. ‘స్థానిక’ ఎన్నికల్లో కుప్పం ప్రజలు టీడీపీ జెండా పీకేశారనే ఆ ఆక్రోశంతోనే ప్రతిపక్ష నేత చంద్రబాబు రౌడీమూకలతో ప్రశాంత వాతావరణానికి భంగం కల్గిస్తూ.. అరాచకాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండ్రోజులపాటు చంద్రబాబు నేతృత్వంలో సాగిన దౌర్జన్యకాండకు సంబంధించిన వీడియోలను ఆయన మీడియాకు ప్రదర్శించారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

కుప్పం నియోజకవర్గంలోని కొంగనపల్లిలో ముందే కట్టిన వైఎస్సార్‌సీపీ జెండాలను బుధవారం రౌడీలతో తొలగింపజేసి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి చంద్రబాబే ముందుగా ఉసిగొల్పారు. ఇందుకు నిరసనగా కుప్పంలో గురువారం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చంద్రబాబు బూతులు తిట్టారు. అలాగే, ఊరేగింపుగా వెళ్తున్న టీడీపీ మూకల చేతుల్లో కర్రలు ఎందుకున్నాయి? మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని, ఎంపీపీ, ఎంపీడీఓ కార్యాలయంపై ఎందుకు దాడిచేశారు? అసలు కుప్పంలో విధ్వంసకర ఘటనకు తెరతీసింది చంద్రబాబే.. ఈ వ్యవహారంలో ప్రథమ ముద్దాయి ఆయనే. టీడీపీ మూకలు దాడులు చేస్తున్నా సంయమనం పాటించిన పోలీసులను చంద్రబాబు బూతులు తిట్టడం సిగ్గుచేటు. ఎస్పీ ఇంటిపైకి వేలాది మంది కార్యకర్తలతో వెళ్తానని.. రెండు నిమిషాల్లో తేల్చేస్తానని బెదిరింపులకు దిగడం ఏమిటి? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ ఏనాడైనా ఇలా మాట్లాడారా? వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడిచేసి.. తమపైనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దాడిచేశారని ఆరోపించడం చూస్తుంటే మొగుణ్ని కొట్టి మొగసాలికెక్కినట్లుంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు చంద్రబాబుకు దూరంగా ఉండాలి.

ఇంకా రహస్య మైత్రి ఎందుకు?

పవన్‌తో చంద్రబాబుకు ఇంకా రహస్య మైత్రి ఎందుకు? బహిరంగంగా చెట్టాపట్టాలేసుకుని తిరగొచ్చు కదా? మా వ్యూహం ఏంటో చెప్పం అని పవన్ అంటున్నాడు. అసలు ఆయనకు తెలిస్తే కదా అది ఏంటో చెప్పడానికి? వైఎస్సార్‌సీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ అని బాబు పవన్‌తో చెప్పిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ విముక్త ఏపీ అంటే.. తాము అధికారంలోకొస్తే అవన్నీ రద్దుచేస్తామని చెప్పడమే అవుతుంది పవన్.

కుప్పంలో ఉనికి చాటుకునేందుకే..

వచ్చే ఎన్నికల్లో 175కు 175 శాసనసభ స్థానాలను గెలుచుకునే దిశగా వైఎస్సార్‌సీపీ అడుగులేస్తుంటే చంద్రబాబు జీర్ణించుకోలేకున్నారు. కనీసం కుప్పంలోనైనా ఉనికి చాటుకునేందుకు పదేపదే అక్కడ పర్యటిస్తూ అరాచకాలకు దిగుతున్నారు. ప్రభుత్వానికి 60 వేల మంది పోలీసులుంటే.. టీడీపీకి 60 లక్షల మంది కార్యకర్తలు ఉన్నారని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం.

సత్కార్యాల్లోనూ, దైవభక్తికి సంబంధించిన పనుల్లోనూ పరస్పరం సహకరించుకోండి. అంతేగానీ పాపకార్యాల్లో, హింసాదౌర్జన్యాల్లో మాత్రం ఎవరికీ సహకరించకూడదు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, ఆగస్టు, 26

నిగూఢంగానే మిగిలిన స్పైవేర్

పౌరుల గోప్యతకూ, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకూ పెనుముప్పు కలిగించగలదని దేశమంతా భావించిన స్పైవేర్ పెగసస్ వ్యవహారంలో సుప్రీంకోర్టు నియమించిన కమిటీ నివేదిక నిరాశనే మిగిల్చింది. మన దేశంలో మొత్తం 300 మంది ఫోన్లపై ఈ స్పైవేర్ దాడి చేసిందనీ, అందులో పాత్రికేయులతోపాటు కేంద్రంలోని ఇద్దరు మంత్రులూ, విపక్ష నేతలు ముగ్గురూ, రాజ్యాంగ పదవిలో ఉన్న ఒకరు, వ్యాపారవేత్తలు, పౌరహక్కుల నాయకులు ఉన్నారనీ అప్పట్లో బయటికొచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం నిరుడు అక్టోబర్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రన్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన కమిటీ పరిశీలనకు 29 మంది తమ ఫోన్‌లు అందజేయగా అందులో అయిదు ఫోన్లలో మాల్‌వేర్ ఉన్నట్టు గుర్తించారు. అది పెగసస్ సాఫ్ట్‌వేరా కాదా అన్నది కమిటీ తేల్చలేకపోయిందని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం తెలిపింది. నిపుణుల కమిటీ నివేదిక, పర్యవేక్షించిన మాజీ న్యాయమూర్తి నివేదిక సుప్రీంకోర్టు తన వెబ్‌సైట్‌లో ఉంచబోతోంది. ఆ తర్వాతగానీ ఈ విచారణ లోతుపాతులు తెలియవు. ఇజ్రాయెల్ సంస్థ ఎన్ఎస్ఓ రూపొందించిన పెగసస్ గురించి నిరుడు వెల్లడైనప్పుడు ప్రపంచ దేశాల ప్రజానీకమంతా నివ్వెరపోయింది. పలు ప్రభుత్వాలు ఈ సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసి తమ కంట్లో నలుసుగా మారినవారిపై నిఘా పెట్టాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ స్పైవేర్‌ను మన ప్రభుత్వం 2017లో కొనుగోలు చేసిందని మొన్న జనవరిలో 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక వెల్లడించింది. ఇజ్రాయెల్‌తో రక్షణ కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందంలో భాగంగానే ఇది జరిగినట్టు ఆ పత్రిక కథనం. మరో ఆసక్తికరమైన సంగతేమంటే... ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి చంద్రబాబు సర్కారు ఈ స్పైవేర్‌ను కొన్నదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించి సంచలనం సృష్టించారు. ఇలా ఇంటా బయటా అందరూ కోడై కూస్తున్నా కేంద్రం నోరు మెదపలేదు. పార్లమెంటులో అలజడి రేగినా, నిరుడు వర్షాకాల సమావేశాలు ఈ అంశంపైనే తుడిచిపెట్టుకుపోయినా 'భద్రతా కారణాల రీత్యా' ఏమీ చెప్పలేమన్న గంభీరమైన ప్రత్యుత్తరంతో సరిపెట్టింది. సర్వోన్నత న్యాయస్థానంలోనూ అదే వైఖరి తీసుకుంది. ఇక చంద్రబాబు సంగతి చెప్పనవసరం లేదు. ఆయన మొదటినుంచీ దబాయింపుతో నెట్టుకొస్తున్నారు.

మన స్వాతంత్ర్యోద్యమం ప్రజాజీవితంలోకి ఎన్నో కొత్త విలువలను మోసుకొచ్చింది. అట్టడుగు పౌరులకు సైతం ప్రజాస్వామ్య ఫలాలు అందాలన్న ఆకాంక్షతో ఆ విలువల ప్రాతిపదికనే మన రాజ్యాంగాన్ని రూపొందించారు. దేశంలో ప్రజాస్వామ్యం ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొంటున్నా, సమస్యలెన్ని ఎదురవుతున్నా అవన్నీ సంపూర్ణ రిపబ్లిక్ ఆవిర్భావానికి దేశం పడుతున్న పురుటి నొప్పులుగా మొదట్లో అందరూ భావించారు. కానీ రాను రాను ప్రజాస్వామ్యాన్ని ఛిద్రం చేస్తున్నవారిదే పైచేయి అవుతున్న వైనం కనబడుతూనే ఉంది. ఈ పరిణామాలే చివరకు పెగసస్ వంటి స్పైవేర్ కొనుగోలుకు దారితీసినట్టు భావించాలి. పెగసస్ గురించి అధికారికంగా ఆధారాలేవీ బయటపడకపోయినా భీమా కోరెగావ్ కేసులో ఇరుక్కున్న ఒకరిద్దరి కార్యకర్తల ఫోన్‌లు, కంప్యూటర్లలో అవాంఛనీయమైన సాఫ్ట్‌వేర్ చొరబడటంలో ఆ సాఫ్ట్‌వేర్ పాత్ర ఉందన్న సంగతి వెల్లడైంది. తమ స్పైవేర్‌ను 'బాధ్యతాయుత ప్రభుత్వాలకు' విక్రయించాం తప్ప ప్రైవేటు వ్యక్తులెవరికీ అందజేయలేదని ఎన్ఎస్ఓ స్పష్టంగా చెబుతోంది. ఆ 'బాధ్యతాయుత' ప్రభుత్వాల జాబితా అది బయటపెట్టకపోయినా, వ్యక్తులెవరికీ ఆ సంస్థ విక్రయించలేదన్న సంగతైతే మీడియా సంస్థల అంతర్జాతీయ కన్సార్షియం దర్యాప్తులో తేటతెల్లమైంది. పైగా ధర రీత్యా ఆ సాఫ్ట్‌వేర్ బడా కోటీశ్వరులకు తప్ప అందుబాటులో ఉండే అవకాశం లేదు. ఇటు కేంద్రం నడత సందేహాలను నివృత్తి చేయకపోగా మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. గూఢచర్యం విషయంలో తనపై వచ్చిన ఆరోపణలను కేంద్రం ఖండిస్తున్న మాట నిజమే అయినా... రాజ్యాంగ పదవిలో ఉన్నవారిపై, కేంద్రమంత్రులపై నిఘా కొనసాగిందన్న అంశంలో అది నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోవడం వింత కాదా? ప్రభుత్వ సంస్థలేవీ ఆ స్పైవేర్‌ను వినియోగించలేదని ప్రకటిస్తున్న ప్రభుత్వం, తామే కాదు... వేరెవరూ కూడా ఆ పని చేయలేదని నిర్ద్వంద్వంగా ఎందుకు చెప్పలేకపోతోంది? కనీసం ఆ విషయంలో దర్యాప్తు చేశామనీ, ఫలానా అంశాలు వెల్లడయ్యాయనీ ఎందుకు వివరించడం లేదు? బహిరంగ అఫిడవిట్‌లో వివరాలు పొందుపరచడం సాధ్యపడదనీ, నిపుణుల కమిటీ నియామకానికి తనను అనుమతిస్తే ఆ కమిటీకి నివేదిస్తాననీ నిరుడు కేంద్రం చేసిన వినతిని సుప్రీంకోర్టు అంగీకరించలేదు. తానే కమిటీ ఏర్పాటుచేసింది. దానికైనా కేంద్రం వివరాలందజేస్తే బాగుండేది. ఆ పని చేయకపోవడం వల్ల కమిటీ నివేదిక కొత్తగా ఏమీ చెప్పలేకపోయింది.

దేశం మొత్తాన్ని కుదిపేసిన పెగసస్ వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం ముందు కేంద్ర ప్రభుత్వం నీళ్లు నమలడం, దాటేయడం ఎవరి సలహా పర్యవసానమో గానీ ఈ వైఖరి దాని ప్రతిష్ఠను ఏమాత్రం పెంచదు. దేశ పౌరులనుంచి చట్టబద్ధ ప్రవర్తనను ఆశించే ప్రభుత్వాలూ, చట్ట ఉల్లంఘనకు పాల్పడే పౌరులపై చర్యలు తీసుకునేందుకు సర్వాధికారాలు ఉన్న ప్రభుత్వాలూ రాజ్యాంగ నైతికతకు కట్టుబడి ఉండాలి. ఆదర్శవంతంగా మెలగాలి. రాజ్యమే రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుంటే, అది రివాజుగా మారితే ఆ సమాజాన్ని కాపాడటం ఎవరి తరమూ కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణమాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.11.40 వరకు, తదుపరి అమావాస్య
నక్షత్రం: ఆశ్లేష రా.7.02 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.6.45 నుండి 8.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.08 వరకు తదుపరి ప.12.26 నుండి 1.18 వరకు
అమృతఘడియలు: సా.5.16 నుండి 7.02 వరకు

సూర్యోదయం: 5.47
సూర్యాస్తమయం: 6.18
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

సంస్కరణలతోనే క్రీడలు వర్ధిల్లుతాయి

విశ్లేషణ



శారద ఉగ్రా

నిబంధనల ఉల్లంఘన కారణంగా ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ మీద 'ఫీఫా'(ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఫుట్‌బాల్) నిషేధం విధించడంతో జాతీయ స్థాయిలో క్రీడల నిర్వహణకు సంబంధించిన చర్చ మొదలైంది. ఇది జీర్ణించుకోలేని విషయమే అయినా వాస్తవాన్ని అంగీకరించక తప్పదు. అయితే అక్టోబర్‌లో జరగనున్న ఫుట్‌బాల్ జూనియర్ ప్రపంచ కప్ నిర్వహణను వదులుకోలేని కేంద్ర ప్రభుత్వం దీన్ని స్నేహ పూర్వకంగా పరిష్కరించుకునేందుకు యత్నిస్తోంది. ఈ నిషేధ పరిణామాలు ఎలాగైనా ఉండనీ... మొత్తంగా దేశంలో క్రీడా రాజకీయాలకు సంబంధించి ఇదొక చెంపదెబ్బ కావాలి. దీని పాఠాల నుంచి నేర్చుకుని సంస్కరణలకు నడుం బిగించాలి. అప్పుడే దేశంలో నిజంగా క్రీడలు వర్ధిల్లుతాయి.

ఈ దేశంలో క్రీడాసంస్థల పనితీరుపై ఎవరైనా న్యాయస్థానంలో ప్రశ్నలు లేవనెత్తారనుకోండి... నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) సమాధానం ఒక్కటే. తమకు స్వయం ప్రతిపత్తి ఉందీ అని. అదే సమయంలో న్యాయస్థానాలు తమ పరిధిని మించి వ్యవహరిస్తున్నాయని సణుగుతారు కూడా. లేదా న్యాయపరిధిని తగ్గించేందుకు అంతర్జాతీయ నిషేధాలను ఒక బూచిగా చూపే ప్రయత్నం చేస్తారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఫుట్‌బాల్ (ఫీఫా) విషయంలో ఇప్పుడు జరుగుతున్నది ఇదే. ఫీఫా ఇటీవలే ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్‌పై నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ నిషేధాన్ని చూపుతూ ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌ను కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్(సీఓఏ) ఆధీనంలోకి తీసుకొస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే తెచ్చుకునే ప్రయత్నమూ జరిగింది. దీంతోపాటే 2011 నాటి జాతీయ క్రీడా నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నానికీ అడ్డు పడే ప్రయత్నం చేస్తున్నారు. ఏమిటీ 2011 క్రీడా నిబంధనలు?

అధికారమే తప్ప బాధ్యత లేదా?

ఎన్ఎస్ఎఫ్ ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగానికి అదనంగా సిద్ధం చేసిన ఒక డాక్యుమెంట్ ఇది. క్రీడా సంస్థల సమర్థ నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలు ఇందులో ఉన్నాయి. ఈ నిబంధనల కంటే ముందు ప్రభుత్వం లేదా యువజన వ్యవహారాలు, క్రీడా శాఖలు 1975, 1988, 1997, 2001లలో ఎన్ఎస్ఎఫ్‌కు మార్గదర్శకాలు జారీ చేశాయి. అయితే ఈ మార్గదర్శకాలను ఎన్ఎస్ఎఫ్ పట్టించుకోలేదు. ప్రజలు చెల్లించిన పన్నులను వాడుకుంటూ... భారత జాతీయ పతాకాన్ని అంతర్జాతీయ పోటీల్లో ప్రదర్శించే ఈ సంస్థల వ్యవహారం... అధికారం, డబ్బు అనుభవిస్తూ బాధ్యత, జవాబుదారీతనం లేకుండా వ్యవహరించడం అంటే తప్పులేదు.

నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ రాజకీయ నేతలు, అధికారుల ప్రభావానికి లోనవడం ఎప్పుడో మొదలైంది. ఈ సంస్థలకు ఎన్నికలు కానీ, క్రీడా కారుల ఎంపికలో పారదర్శకత కానీ అస్సలు కనిపించదు. కుంభకోణాలు, జరిగిన తప్పులు దిద్దుకునే చర్యలు లేకపోవడం వంటివి సర్వసాధారణమనే చెప్పాలి. దేశంలో జాతీయ క్రీడాభివృద్ధి చట్టం అమల్లోకి వచ్చే ముందు క్రీడాసంస్థల సమర్థ నిర్వహణకు ఉద్దేశించిన ప్రయత్నం 2011 నాటి క్రీడా నిబంధనల డాక్యుమెంట్. అయితే క్రీడాభివృద్ధి చట్టానికి సంబంధించిన బిల్లు ఇప్పుడు మరుగున పడిపోయింది. అన్ని రకాల రాజకీయ పార్టీలూ దీన్ని వ్యతిరేకించాయి. అయితే 2014లో ఢిల్లీ హైకోర్టు 2011 నాటి క్రీడా నిబంధనల డాక్యు మెంట్ సరైందేనని తేల్చి చెప్పింది. భారత క్రీడా సంస్థల నిర్వహణకు సంబంధించి ఇదో చారిత్రాత్మకమైన తీర్పు. క్రీడా సంస్థల్లో ఎన్నికలు, ఓటర్లు, అధికారుల అధికార పరిధి, వయసు వంటి అంశాలపై ఇప్పుడు వాడి, వేడి చర్చ నడుస్తోంది.



ఫుట్‌బాల్, టీటీ, హాకీ, జూడో... ప్రతి కేసులోనూ నిబంధనల ఉల్లంఘన జరిగిందని చాలామంది కోర్టులను ఆశ్రయించారు. టేబుల్ టెన్నిస్ విషయంలో నిబంధనలను అతిక్రమించారని గుర్తించిన ఓ క్రీడాకారుడే కోర్టుకెక్కడం గమనార్హం. కోర్టు కాస్తా ఎన్ఎస్ఎఫ్ అక్రమమైందని ప్రకటిస్తూ కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్‌ను నియమించింది. ఎన్ఎస్ఎఫ్ 2011 నాటి క్రీడా నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడటం ఈ సీఓఏ బాధ్యత. ఎన్నికల నిర్వహణ, పురాతన కాలం నాటి క్రీడా సంస్థల రాజ్యాంగాన్ని ఆధునికీకరించడం, మేనేజ్మెంట్ విధానాలను సమీక్షించడం వంటి వాటి ద్వారా సీఓఏ నిబంధనలు అమలయ్యేలా చూడాలి. అయితే ఈ సీఓఏలోనూ మాజీ న్యాయమూర్తులే ఉండటం, వారి పనితీరు నత్తనడకన సాగుతూండటం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం. అయితే భారతీయ క్రీడా వ్యవస్థలన్నింటిలోనూ జరిగే తప్పులు వీరికి తెలుసు. వీటిని ఉల్లంఘిస్తున్న వారిని కూడా గుర్తించగలరు. అందుకే ఎవరైనా క్రీడా వ్యవస్థ సమూల ప్రక్షాళణకు నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

కోర్టుల దాకా ఎందుకు?

విషయం కోర్టులకు ఎక్కక ముందే ఎన్ఎస్ఎఫ్‌ను దారిన పెట్ట గల సత్తా, అధికారం రెండూ మంత్రిత్వ శాఖకు ఉన్నాయి. ఫెడరేషన్లను రద్దు చేయగలిగే, నిధుల మంజూరీని నిలిపివేసే అధికారం కూడా యువజన, క్రీడల మంత్రిత్వ శాఖకు ఉన్న విషయాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. అయితే బాక్సింగ్, ఆర్చరీ వంటివాటిని మినహాయించి మిగిలిన చాలా సంస్థల విషయంలో మంత్రిత్వ శాఖ కూడా న్యాయస్థానాలు స్పందించేంత వరకూ నిమ్మకు నీరెత్తినట్టుగానే వ్యవహరించింది. ఎందుకంటే, నేతలకూ క్రీడాసంస్థల్లో స్థానం ఉండటం. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ నిర్వహణకు కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్‌ను ఏర్పాటు చేసిన వెంటనే క్రీడల మంత్రిత్వ శాఖ తరఫున స్వయంగా సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఆ కేసును చేపట్టి ఒలింపిక్ అసోసియేషన్‌కు అండగా నిలవడం గమనార్హం. ప్రభుత్వం, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ రెండింటి తరఫున కోర్టుకు హాజరైన తుషార్ మెహతా ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలనీ, లేదంటే అంతర్జాతీయ క్రీడా కార్యక్రమాల్లో భారత్‌ను నిషేధిస్తారనీ వాదించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు యథాతథ స్థితిని కొన సాగించాల్సిందిగా ఆదేశాలిచ్చింది. ఈ సందర్భంగానే ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ తాత్కాలిక అధ్యక్షుడు అనిల్ ఖన్నా... అసోసియేషన్ ఆఫీస్ బేరర్ల పదవీ కాలం పన్నెండేళ్లు కాకుండా, 20 ఏళ్లు ఉండాలని నిర్మొహమాటంగా వ్యాఖ్యానించారు.

సాధారణంగా జాతీయ స్థాయి క్రీడా సంస్థలు... క్రీడలు, క్రీడాకారుల కంటే అధికారుల అహానికి, రాజకీయ పలుకుబడికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాయి. భారతీయ క్రీడా వ్యవస్థలో ఉన్న ప్రాథమికమైన లోపం... క్రీడాకారులకు తగినన్ని పోటీలు, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో ఆడేందుకు తగినన్ని అవకాశాలు లేకపోవడమే. ఈ లోపాలే ఇప్పుడు ఫిర్యాదుల రూపంలో బయటపడుతున్నాయి. తమ స్థానాలను పదిలపరుచుకునేందుకు క్రీడా సంస్థల అధికార యంత్రాంగం తాపత్రయ పడుతూండటమే ఇప్పుడు అన్నిచోట్ల కనిపిస్తున్న అంశం. ఈ క్రమంలో అసలు విషయం కాస్తా మరుగున పడిపోతోంది. ఇందుకు ఉదాహరణలు కోకొల్లలు.

సమర్థతకే పట్టం కట్టాలి

నేను నివసించే బెంగళూరులో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జనవరిలో ఒక నోటీసు జారీ చేసింది. అసోసియేషన్ క్రీడాకారులు చిన్న 3 బై 3, 5 బై 5 పికప్ బాస్కెట్‌బాల్ కార్యక్రమాల్లో పాల్గొనడం అసోసియేషన్ నిబంధనలకు వ్యతిరేకమని. అలా పాల్గొన్న క్రీడాకారులను నిషేధిస్తామని ఈ నోటీస్ చెప్పడం గమనార్హం. 2019లో ప్రో వాలీబాల్ లీగ్ తొలి సీజన్లో విజయవంతమైంది. ఆ వెంటనే వాలీబాల్ అసోసియేషన్ ఈ లీగ్ నిర్వాహకులు బేస్‌లైన్ వెంచర్స్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని నిర్ణయించింది. కాంట్రాక్ట్ నిబంధనలను ఫెడరేషన్ ఉల్లంఘించినట్లు కోర్టు నియమించిన మధ్యవర్తులు గుర్తించారు. ఫెడరేషన్ బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేయడంతోపాటు బేస్‌లైన్ వెంచర్స్‌కు నష్టపరిహారం చెల్లించాల్సిందిగా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బేస్‌లైన్ వెంచర్స్... ప్రైమ్ వాలీబాల్ లీగ్ పేరుతో మళ్లీ ఫ్రాంచైజీ ఆధారిత టోర్నమెంటును ప్రారంభించింది. కానీ ఈ లీగ్‌లో పాల్గొన్న కొన్ని రాష్ట్రాల క్రీడాకారులను ఫెడరేషన్ పక్కన పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. క్రీడా సంస్థలకు స్వయం ప్రతిపత్తి కావాలని కోరుతున్న వారిలో కొందరు నిజానికి తాము అసమర్థ పరిపాలకులుగా కొనసాగేందుకు పోరాడుతున్నట్లు కనిపిస్తోంది. క్రీడా సంస్థల మెరుగైన నిర్వహణ వీరి ఉద్దేశం కానే కాదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

నోరు తిరగాలిగా...



నౌన్న వాళ్ల స్నేహితుడు వాళ్ల పెంపుడు కుక్కకు 'ఎకిలీస్' (గ్రీకు పురాణాల్లోని పాత్ర) అని పేరు పెట్టాడు; కానీ వాళ్ల వంటాయనేమో దాన్ని అఖిలేశ్ అని పిలుస్తున్నాడు.
– ఖుషీ లా విద్యార్థిని

ఇవి అవసరమా?



ఇది పిచ్చితనం. మన పిల్లలకు చిప్‌ను అమర్చాలనడానికి 'తార్కిక కారణాలు' ఉన్నాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వెబ్‌సైట్ చెబుతోంది. వాళ్లు మెదడులో చిప్‌ను అమర్చడం, అది ఆరోగ్యానికి చేసే 'సాయం' గురించి మాట్లాడుతున్నారు. ఇది చెడ్డ ఆలోచన.
– పీటర్ ఇమాన్యుయల్‌సేన్, జర్నలిస్ట్

ఆడనివ్వాలి



నా ట్వీట్స్‌కు స్పందించే చాలామంది, టెన్నిస్ క్రీడాకారుడు జొకోవిచ్‌ను యూఎస్ ఓపెన్ ఆడకుండా నిషేధించడం సబబేనని చెబుతూ, ఎందుకంటే అవి 'రూల్స్' అంటున్నారు. అయితే ఏంటి? 'రూల్స్' అనేవి అక్కర్లేనివీ, బలవంతమైనవీ, అశాస్త్రీయం అయినప్పుడు మనం వాటి గురించి మాట్లాడాలి. ప్రతి ఒక్క విషయంలోనూ ఏది మంచో ప్రభుత్వానికి తెలియాలని లేదు.
– కరోల్ సైకోరా, డబ్ల్యూహెచ్ఓ క్యాన్సర్ ప్రోగ్రామ్ మాజీ డైరెక్టర్

వాస్తవాలు వద్దా?



పాక్ మద్దతు పొందేందుకే భారతీయ సైన్యాన్ని చెడ్డ కోణంలో చిత్రిస్తున్నానని చాలామంది రైట్ వింగ్ వాళ్లు నన్ను దూషిస్తున్నారు. చెత్త వాగుడు! 1962 యుద్ధంలో కంటే దారుణంగా ఇండియా ఓడిపోకుండా ఉండటానికి, మేధాపరంగా బద్ధకంగా ఉన్న సైనిక నాయకులను మేల్కొల్పడమే నా లక్ష్యం.
– ప్రవీణ్ సహానీ, సైనిక అంశాల వ్యాఖ్యాత

అచ్చు దోశ



అయ్యో, 'దోశ ప్రింటర్'కు పదహారు వేల రూపాయలా? మంచి దోశకు ముఖ్యమైనది బాగా కలిపిన పిండి. ఆ సమస్యకు ఈ యంత్రంలో పరిష్కారం లేదు. వినియోగదారుల అవసరాలను విస్మరించిన వృథా సృజనలో ఇదొక మేనేజ్‌మెంట్ పాఠం.
– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

జరిగింది ఒకటేగా?



అంటే ప్రపంచంలోనే రెండో అత్యంత ధనికుడైన జెఫ్ బెజోస్ 'వాషింగ్టన్ పోస్ట్'ను సొంతం చేసుకుంటే స్వతంత్ర మీడియా నాశనమవుతోందని భయాలు కలగవు; అదే ప్రపంచంలో నాలుగో అత్యంత ధనికుడైన గౌతమ్ అదానీ ఎన్డీటీవీ మీద కన్నేస్తే మాత్రం ఆ భయాలు పుడతాయి. అన్నట్టూ, ఎన్డీటీవీలానే వాషింగ్టన్ పోస్ట్ కూడా అంతే స్వతంత్రమైనదీ, విశ్వసనీయమైనదీ.
– ఆనంద్ రంగనాథన్, రచయిత

గతమే వైభవం




ప్రాచీన భారతీయులు అత్యుత్తమ రకానికి చెందిన భారతీయులు. ఇప్పటి మనల్ని ఆరాధించడం చాలా కష్టం. వాళ్లు మార్గదర్శకులు, మనం కేవలం అనుకరించేవాళ్లం. వాళ్లు ప్రపంచాన్ని నడిపారు, మనం ప్రపంచాన్ని అనుసరిస్తున్నాం. భారతీయ ప్రయోగశాలల్లో అసలైన, మౌలికమైన పరిశోధన జరగడం గురించి మీకేమైనా తెలుసా?
– జోసెఫ్ టి. నూనీ, వైద్యుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మునుగుడా? తేలుడా?

సందర్భం



కొమ్మినేని శ్రీనివాసరావు


మునుగోడులో కేసీఆర్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పెద్ద సభను నిర్వహిస్తే, ఆ మరుసటి రోజు బీజేపీ కూడా పెద్ద సభ జరిపింది. మునుగోడులో కాంగ్రెస్ పక్షాన ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి తన పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరిన సందర్భంగా స్వయంగా అమిత్ షా హాజరు కావడం... ఈ ఉప ఎన్నికకు ఎంత ప్రాధాన్యం ఉందో అర్థం అవుతోంది. ఎన్నిక ప్రకటన రాక ముందే కేసీఆర్ సభ పెట్టడం కూడా దీనికి మరో ఉదాహరణ. ఇక కాంగ్రెస్ పార్టీ పాదయాత్రలు, లక్షమంది కాళ్లకు మొక్కడం వంటి కార్యక్రమాల ద్వారా తన పట్టు నిలబెట్టుకోవాలని విశ్వయత్నం చేస్తోంది.

దీనిని పక్కనబెడితే కేసీఆర్, అమిత్ షా పోటీపోటీ ప్రసంగాలు ప్రజలకు ఏ సందేశాలు ఇచ్చాయో తెలుసుకోవడం ఆసక్తికరం. కేసీఆర్ ఎక్కువగా జాతీయ రాజకీయాలు, దేశంలో ప్రగతిశీల శక్తులు ఐక్యం కావాల్సిన అవసరం, వ్యవసాయ మోటార్లకు మీటర్లు వంటి అంశా లపై దృష్టి పెట్టారు. అమిత్ షా పూర్తిగా తెలంగాణ అంశాలకు, కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను ప్రస్తావించడానికి పరిమితం అయ్యారు. బీజేపీని గెలిపిస్తే తెలంగాణ ఆగమవుతుందని కేసీఆర్ హెచ్చరించారు. అమిత్ షా తన ప్రసంగంలో రాజగోపాలరెడ్డి గెలిస్తే కేసీఆర్ ప్రభుత్వం మాయం అవుతుందన్నారు. అంటే వచ్చే ఎన్నికలలో ఓడిస్తామనా, ఇంకేదైనా చేస్తామనా? కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం అయిందని షా ఆరోపించారు కానీ అదెలా జరిగిందో చెప్పలేదు. పైగా పార్లమెంటులో ఈ ప్రాజెక్టుపై ఆరోప ణలు లేవని చెప్పినా, మునుగోడు ఉప ఎన్నికలో మాత్రం అవినీతి అంటూ విమర్శలు కురిపించారు.

బీజేపీకి ఓటు వేస్తే మోటార్లకు మీటర్లే అని కేసీఆర్ చెప్పడం ఒక విధంగా బలహీనత. రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీ భరిస్తున్నప్పుడు మీటర్లు పెడితే వచ్చే నష్టం ఏమిటి? కాకపోతే కేంద్రంపై ఆయన ఆరోపణ చేశారు. నిజానికి దీనిని ప్రతిపాదించిన కేంద్రం ఇప్పటికే వెనక్కి తగ్గింది. మోదీ సర్కారు ఈ అంశంలో ఓట్ల రాజకీయానికి భయపడి మీటర్లు పెట్టాలని తాము చెప్పడం లేదని పేర్కొంది. అమిత్ షా ఈ మీటర్ల వివాదంపై బహిరంగ సభలో చెప్పలేదు గానీ, రైతు నేతల భేటీలో వివరణ ఇచ్చారు. రైతుల పొలాల వద్ద కాకుండా విద్యుత్ సబ్ స్టేషన్ల దగ్గర వీటిని అమర్చాలని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇతర బీజేపీ నేతలు మాత్రం దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కూడా ఇదే మాట టీఆర్ఎస్ చెప్పిందనీ, అయినా ప్రజలు బీజేపీకి పట్టం కట్టారనీ అంటున్నారు.

ఏడాదిలోనే ఎన్నికలు ఉండగా ఈ ఉప ఎన్నిక ఎందుకని ఆయన ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పలు ఉప ఎన్నికలకు కారణమైన టీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికను ఎందుకు వ్యతిరేకిస్తున్నట్లు? ఎవరైనా ఎమ్మెల్యే పార్టీ మారదలిస్తే పదవికి రాజీనామా చేయడం మంచి సంప్రదాయమే. దానిని రాజగోపాలరెడ్డి కూడా పాటించారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ గెలిస్తే భవిష్యత్తు తెలంగాణ రాజకీయం మారిపోతుందనీ, బీజేపీ సీఎం వస్తారనీ అమిత్ షా అన్నారు. కేవలం ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ అధికారాన్ని ఎలా సాధిస్తుందన్నది ప్రశ్న. రాజగోపాలరెడ్డి గెలిస్తే ఏకనాథ్ షిండేలను బీజేపీ తయారు చేస్తుందా అని కేసీఆర్ ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను బీజేపీ ప్రోత్సహిస్తుందనీ, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందనీ కేసీఆర్ హెచ్చరించారు.

ఈ విషయంలో రెండు పార్టీలకూ పెద్ద తేడా ఉందని చెప్పజాలం. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ పార్టీల ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో ఎలా విలీనం చేసుకున్నారన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ఆకర్షించి, వారితో రాజీనామాలు



చేయించి బీజేపీ అధికారాన్ని కైవసం చేసుకుంది. రాజ్యసభలో నలుగురు టీడీపీ ఎంపీలను విలీనం చేసుకుంది. అందువల్ల టీఆర్ఎస్, బీజేపీ రెండింటికీ ఈ అంశం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని చెప్పక తప్పదు.

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిదేళ్లలో బీజేపీ ఒక్క మంచి పని అయినా చేసిందా అని కేసీఆర్ ప్రశ్నించడం కూడా రాజ కీయంలో భాగమే. మరి అలాంటి ప్రభుత్వానికి ఆయా సందర్భాలలో టీఆర్ఎస్ మద్దతు ఎలా ఇచ్చిందని అడిగితే సమాధానం దొరకదు. బీజేపీ ముగ్గురు ఎమ్మెల్యేలను కేసీఆర్ మూడు తోకలతో పోల్చారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి వాటితో తనకు పడని పార్టీలను బీజేపీ భయ పెట్టాలని చూస్తోందనీ, కానీ తాను నిజాయితీగా ఉన్నందున తనను ఎవరూ ఏమీ చేయలేరనీ ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మాటలు ఆయన గట్టిగానే చెబుతున్నా, ఏదో ఒక మూల కేంద్రంపై ఉన్న అను మానాలే ఆయనతో ఈ మాటలు అనిపిస్తున్నట్లుగా ఉంది. దానికి తగినట్లుగానే కేసీఆర్ కుమార్తె కవితపై బీజేపీ ఢిల్లీ ఎక్సైజ్ స్కామ్‌ను ఆరోపించింది. కవిత ఖండించినా, తర్వాత రోజుల్లో ఏమి అవుతుందో చెప్పలేం.

నల్గొండ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించామనీ, ఎవరు అడ్డుపడ్డా రైతు బంధు ఆగదనీ చెప్పడం ద్వారా కేసీఆర్ ప్రజలను ఆకట్టుకునే యత్నం చేశారు. హుజూరాబాద్ అనుభవం రీత్యా ముందస్తు జాగ్రత్త పడుతున్నట్లుగా ఉంది. దానికి తోడు రాజగోపాలరెడ్డి బలమైన అభ్యర్థి అవుతారు కనుక కూడా ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా ఉంది. దళితుడిని సీఎం చేస్తారన్న హామీ ఏమైందని అమిత్ షా అడిగారు. భవిష్యత్తులో కేటీఆర్‌ను చేస్తారు తప్ప, దళితుడిని చేయరని చెప్పారు. దేశంలో పెట్రోల్ ధరలను కేంద్రం తగ్గిస్తే తెలంగాణలో ఎందుకు తగ్గించలేదని అడిగారు. బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17న విమోచన దినం నిర్వహిస్తామనీ, మజ్లిస్‌కు టీఆర్ఎస్ భయపడుతోందనీ చెప్పడం ద్వారా అటు తెలంగాణ సెంటిమెంట్‌నూ, ఇటు హిందూ సెంటిమెంట్‌నూ షా ఒకేసారి ప్రయోగించారని అనుకోవచ్చు.

ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే– కేసీఆర్, అమిత్ షా ఇద్దరూ కూడా కాంగ్రెస్ గురించి పెద్దగా పట్టించుకోలేదు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందని కేసీఆర్ అంటే, అమిత్ షా కాంగ్రెస్ ఊసే తేలేదు. మరో వైపు ఈ పరిణామాలను గమనిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇప్పటికే లక్షమందికి పాదాభివందనం కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. మరి కాళ్లు మొక్కడం ద్వారా విజయం సాధించగలుగుతారా అన్నది చెప్పలేం. వామపక్షాలైన సీపీఐ, సీపీఎంలను కేసీఆర్ కలుపుకొని వెళ్లడం కొత్త పరిణామం. జాతీయ రాజకీయాలతో పాటు తెలంగాణలో ఆ పార్టీలకు అక్కడక్కడ ఉన్న బలాన్ని ఆయన వినియోగించదలిచారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉండాలని భావించే వామపక్షాలు ఇందుకు సిద్ధం కావడంలో ఆశ్చర్యం లేదు. కాకపోతే ఈ ఎనిమిదేళ్లలో ఎన్నడైనా సీపీఐ, సీపీఎం నేతలు ప్రగతి భవన్‌కు వెళ్లి ఆయా సమస్యలపై మాట్లాడగలిగారా? అంటూ మాజీ మంత్రి ఈటెల రాజేందర్ పలు ప్రశ్నలు సంధించారు. అవి వామపక్షాలకు ఇబ్బంది కలిగించేవే అయినా, దేశ రాజకీయాలు, తెలంగాణలో పరిస్థితుల రీత్యా, వారికి ఇంతకన్నా గత్యంతరం ఉండకపోవచ్చు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలోనే టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని సీపీఐ తలపెట్టినప్పటికీ, ఆ సమయంలో ఆర్టీసీ సమ్మె అడ్డం వచ్చింది. ఇప్పుడు కేసీఆర్ భవిష్యత్తులో కూడా ఈ పార్టీలతో స్నేహం కొనసాగుతుందని ప్రకటించి తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణలకు తెరదీశారు. పత్రికాధిపతి రామోజీ రావు, ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌తో అమిత్ షా భేటీ అయ్యారు. తెలంగాణ ఎన్నికలలో సహకరించాలని ఆయన వీరిని కోరి ఉండవచ్చు. మొత్తం మీద ఈ కబాడి ఆటలో ఎవరు లైన్ టచ్ చేసి విజేతలు అవుతారో, ఎవరు కాళ్లు గుంజివేస్తారో అన్న ఉత్కంఠభరిత సన్నివేశాలకు మునుగోడు వేదిక కాబోతోంది.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

ఢిల్లీ విమానం ఆలస్యంతో ప్రయాణికుల ఇక్కట్లు

గన్నవరం : న్యూఢిల్లీ నుంచి రావాల్సిన ఎయిరిండియా విమానం గురువారం సాంకేతిక కారణాల వల్ల దాదాపు మూడున్నర గంటలు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఎయిరిండియా విమానం రోజూ ఢిల్లీ నుంచి ఉదయం 8.35కు ఇక్కడికి చేరుకుని, తిరిగి 9.15 గంటలకు బయలుదేరి వెళ్తుంది. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం ప్రయాణికులతో ఢిల్లీ నుంచి బయలుదేరిన విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వెనక్కి మళ్లించారు. దీంతో ఇక్కడి నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన 164 మంది ప్రయాణికులు విమానం కోసం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్లో గంటల తరబడి నిరీక్షించారు. ఎట్టకేలకు మరమ్మతులు అనంతరం విమానం ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 12.30కు ఇక్కడికి చేరుకుని, తిరిగి ప్రయాణికులతో 1.45 గంటలకు బయలుదేరి వెళ్లింది.

సీపీఎస్ రద్దు చేయాలి

బండి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) నష్టదాయకమని, సామాజిక భద్రత లేని సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ హృదయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్‌పై ఏపీ జేఏసీ సెక్రటేరియట్ సమావేశం విజయవాడలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ భవనంలో గురువారం జరిగింది. బండి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు హృదయరాజు తెలిపారు. సీపీఎస్ విధానం అమల్లోకొచ్చిన సెప్టెంబర్ ఒకటో తేదీ నాడు విద్రోహక దినంగా పాటిస్తూ.. అన్ని జిల్లా కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన ప్రదర్శనలు చేయాలని పిలుపునిచ్చారు.

ఓర్వకల్లు పారిశ్రామిక పార్కుకు నీటివసతి

ఏపీఐఐసీ వీసీ, ఎండీ జవ్వాది సుబ్రమణ్యం

సాక్షి, అమరావతి: హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామికపార్కుకు అవసరమైన ఒక టీఎంసీ నీటిని సరఫరా చేయడానికి త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పైప్‌లైన్ ద్వారా 46.2 కిలోమీటర్ల మేర జలాలను తరలించే పనుల్ని కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, జీవీ ప్రతాప్‌రెడ్డి భాగస్వామ్య కంపెనీ దక్కించుకున్నట్లు ఏపీఐఐసీ వీసీ, ఎండీ జవ్వాది సుబ్రమణ్యం తెలిపారు. రూ.288.73 కోట్లకు టెండర్లు పిలవగా రూ.288.53 కోట్లకు బిడ్ దాఖలు చేసి ఈ సంస్థ పనులు దక్కించుకుందని తెలిపారు. త్వరలోనే ఈ పనుల్ని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రారంభించనున్నట్లు చెప్పారు.

అన్‌ట్రెయిన్డ్ టీచర్ల వివరాలు వెంటనే పంపాలి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అన్‌ట్రెయిన్డ్ టీచర్ల వివరాలను వెంటనే పంపాలని గురువారం పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే వారికి నిర్ణీత అర్హతలు తప్పనిసరైన నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది.

లోన్‌యాప్ సంస్థలపై కొరడా

- తక్షణ చర్యలు చేపడుతున్న సైబర్ పోలీసులు
- ఇప్పటివరకు 63 కేసులు నమోదు
- ఫిర్యాదులు చేసేందుకు వివిధ వ్యవస్థలు అందుబాటులోకి
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- బాధితులకు అండగా నిలుస్తున్న పోలీసులు



సాక్షి, అమరావతి: 'మీకు రుణం కావాలా.. ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా రెండు గంటల్లోనే మీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం'.. అంటూ గుంటూరుకు చెందిన మూర్తికి ఓ ఫోన్ వచ్చింది. కరోనాతో తన చిరు వ్యాపారం దెబ్బతినడంతో ఇబ్బందుల్లో ఉన్న ఆయన అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగిపోయి ఉన్నారు. దాంతో ఆ ఫోన్‌కాల్‌కు సానుకూలంగా స్పందించి 'రూ.లక్ష లోన్ కావాలి' అని అన్నారు. వారు అడిగిన వివరాలన్నీ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఆయన అడిగింది రూ.లక్ష.. కానీ, ఇచ్చింది రూ.70వేలే.. అంటే ముందే రూ.30వేలు వడ్డీ కింద ఉంచుకుని రూ.లక్ష అప్పు ఇచ్చినట్లు చూపించారు. ఆ తరువాత నుంచి ప్రతినెలా వాయిదాలు కడుతున్నా అప్పు పెరుగుతోందే కానీ, తగ్గడంలేదు. చివరికి రూ.రెండు లక్షలు చెల్లించిన తరువాతగానీ ఆయన మోసాన్ని గుర్తించలేదు. దాంతో వాయిదాలు చెల్లించడం మానేయడంతో ఫోన్లో తీవ్రపదజాలంతో దూషణలు, బెదిరింపులు మొదలయ్యాయి. వాట్సాప్ మెసేజులు వచ్చాయి. ఆయన కుటుంబ సభ్యులను దూషిస్తూ ఆయన ఫోన్లో ఉన్న వాట్సాప్ గ్రూపుల్లో మెసేజులు ప్రత్యక్షమయ్యాయి. ఫోన్‌చేసి వేధించడం మొదలుపెట్టారు. దీంతో మూర్తి సైబర్ పోలీసులను ఆశ్రయించగా వారు దర్యాప్తు చేపట్టారు.

..ఇలా మూర్తి ఫిర్యాదుపైనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా లోన్‌యాప్ కంపెనీల ఆగడాలపై రాష్ట్ర సైబర్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. చైనా నుంచి కార్యకలాపాలు నిర్వహించే ఈ అనధికారిక సంస్థల ఆగడాల నుంచి బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఈ దారుణాలకు అడ్డుకట్ట వేసేందుకు ద్విముఖ వ్యూహంతో కార్యాచరణను వేగవంతం చేశారు. మోసాలకు పాల్పడుతున్న వాటిపై కఠిన చర్యలను వేగవంతం చేశారు.

మొదటి స్థానంలో తిరుపతి జిల్లా

ఈ తరహా మోసాలపై రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకు 63 కేసులు నమోదుచేశారు. లోన్‌యాప్ కంపెనీలపై కేసుల్లో తిరుపతి జిల్లా మొదటిస్థానంలో ఉండగా గుంటూరు, విశాఖ జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఇక ఈ కంపెనీలపై అత్యధికంగా కేసులు నమోదు చేసిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

విస్తృతంగా అవగాహన..

నిజానికి.. దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లోన్‌యాప్ కంపెనీల్లో 90 శాతం కంపెనీలకు రిజర్వ్ బ్యాంకు అనుమతిలేదు. చైనాలో ఉంటూ ఇక్కడ అనధికారికంగా కాల్ సెంటర్లు ఏర్పాటుచేసుకుని మోసాలకు పాల్పడుతున్నాయి. అందుకే లోన్‌యాప్ కంపెనీల మోసాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించేందుకు రాష్ట్ర సైబర్ పోలీసు విభాగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పలు సూచనలు చేసింది. అవి..

- తెలియని వ్యక్తులు, కంపెనీలు పంపించే లింక్‌లు, ఈమెయిల్స్ ఓపెన్ చేయకూడదు. చేస్తే.. ఆ యాప్ డౌన్‌లోడ్ కాగానే వారి ఫోన్/ల్యాప్‌టాప్‌లోని కాంటాక్ట్స్ వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారం, వాటికి వచ్చే ఓటీపీ నంబర్లతోసహా సమాచారమంతా కూడా లోన్‌యాప్ కంపెనీకి అందుబాటులోకి వస్తుంది.
- అందుకే ఏదైనా లింక్‌ను క్లిక్ చేసేముందు ఆ కంపెనీకి గుర్తింపు ఉందా లేదా, గుర్తింపు ఉంటే ఆ కంపెనీకి రేటింగ్‌ను తెలుసుకోవాలి.
- బ్యాంకులు, గుర్తింపు పొందిన నాన్ బ్యాంకింగ్ కంపెనీలు మాత్రమే రుణాలు మంజూరు చేసేందుకు అనుమతి ఉంది. మిమ్మల్ని సంప్రదించిన కంపెనీ ఆ కేటగిరీకి చెందుతుందో లేదో పరిశీలించాలి.
- ఆధార్ నంబర్, కాంటాక్ట్స్ వివరాలు, ఫొటోలు, వ్యక్తిగత వివరాలు, ఓటీపీ నంబర్లు అడిగితే ఇవ్వొద్దు.
- ఆర్‌బీఐ గుర్తింపు పొందిన ఏ కంపెనీ కూడా రుణం మంజూరుచేసే ముందే కొంత మొత్తాన్ని మినహాయించుకోదు. అలా చేస్తామని ఏ కంపెనీ అయినా చెబితే మోసానికి పాల్పడుతున్నట్లే లెక్క.
- అలాగే, హామీలు, డాక్యుమెంట్లు అవసరంలేకుండా ఎవరైనా రుణం ఇస్తామన్నా విశ్వసించొద్దు.
- మీ యూపీఐ పిన్ నంబర్లు, పాస్‌వర్డ్, క్రెడిట్/డెబిట్ కార్డ్ నంబర్లు, సీవీవీ నంబర్లు ఎవరికీ చెప్పొద్దు. గుర్తింపు పొందిన బ్యాంకులు ఆ వివరాలు అడగవు.
- తెలియని ఖాతాల నుంచి మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే ఆ విషయాన్ని మీ బ్యాంకు అధికారులకు తెలియజేయండి. లేకపోతే మోసపూరిత లోన్‌యాప్ కంపెనీలు మీరు రుణం కోరితేనే బ్యాంకులో జమచేశామని చెప్పే ప్రమాదముంది.

జిల్లాల వారీగా లోన్‌యాప్ మోసాలపై నమోదైన కేసులు..

జిల్లా	కేసులు
విశాఖపట్నం	8
కాకినాడ	2
అంబేడ్కర్ కోనసీమ	1
తూ.గోదావరి	4
ఏలూరు	1
ఎన్టీఆర్	2
గుంటూరు	12
బాపట్ల	1
పల్నాడు	4
ప్రకాశం	4
ఎస్పీఎస్సార్ నెల్లూరు	8
అనంతపురం	1
వైఎస్సార్	1
చిత్తూరు	1
తిరుపతి	13
మొత్తం	63

ఫిర్యాదులకు ప్రత్యేక వ్యవస్థలు

మరోవైపు.. బాధితులు ఫిర్యాదు చేసేందుకు పలు వ్యవస్థలను పోలీసులు ఏర్పాటుచేశారు. అవి..

- డయల్ 1930 : లోన్ యాప్ కంపెనీల మోసాలపై ఈ టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చెయ్యొచ్చు.
- సైబర్‌మిత్ర వాట్సాప్ నం. 9121211100 : లోన్‌యాప్‌ల మోసాలు, వేధింపులపై దీనికీ ఫిర్యాదు చేయవచ్చు.
- సైబర్ క్రైమ్ పోర్టల్ : లోన్‌యాప్ కంపెనీలతోపాటు ఇతర సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు సంప్రదించాల్సిన సైబర్ క్రైమ్ పోర్టల్: www.cybercrime.gov.in

లోన్‌యాప్ మోసాలపై కఠిన చర్యలు



లోన్‌యాప్‌ల కంపెనీల మోసాలు, వేధింపులపై పోలీసు శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌తోపాటు బాధితులు ఫిర్యాదులు చేసేందుకు వివిధ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చాం. లోన్‌యాప్‌లపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా మోసపోయామని భావిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి.

– కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీపీ

పంపిణీకి సిద్ధమైన మట్టి విగ్రహాలు



పర్యావరణ హితమే లక్ష్యంగా....

- చంద్రగిరిలో 1.24 లక్షల మట్టి వినాయక విగ్రహాల తయారీ
- ప్రతి ఇంటికీ ఉచిత పంపిణీకి సన్నద్ధం
- ఎమ్మెల్యే చెవిరెడ్డి వెల్లడి

తిరుపతి రూరల్: పర్యావరణ హితమే లక్ష్యంగా..ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 1.24 లక్షల బంకమట్టి విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టారు. పదేళ్లుగా చెవిరెడ్డి బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గురువారం తిరుచానూరు మార్కెట్ యార్డ్‌లో బంకమట్టి విగ్రహాల తయారీని ఆయన పరిశీలించారు. విగ్రహాల తయారీకి అవసరమైన బంకమట్టి మిశ్రమాన్ని కలపడంలో కుమ్మరి కార్మికులతో కలిసి పాలుపంచుకున్నారు. చెవిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి ఏటా, ప్రతి ఇంటికీ బంకమట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను పంపిణీతో పాటు పూజించేలా ప్రోత్సహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని 25 ప్రదేశాల్లో.. 7 వేల మంది కుమ్మరి కార్మికులు 25 రోజులుగా బంకమట్టి విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారని, 2,500 టన్నుల బంకమట్టిని ఉపయోగించినట్లు చెప్పారు. ప్రజలకు గణనాథుని పూజించే విధానంపై బుక్‌లెట్‌ను అందించనున్నట్లు తెలిపారు. 2వేల మంది వలంటీర్లతో ఈ విగ్రహాలను ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు.

గుజ్జల శ్రీను రూ.వందల కోట్లు స్వాహా చేశారు

- ఇప్పటివరకు 174 మందిని విచారించి చార్జిషీట్ వేశాం
- ఆయనపై కేసును కొట్టేయకండి
- హైకోర్టుకు నివేదించిన సీఐడీ
- తదుపరి విచారణ 29కి వాయిదా

సాక్షి, అమరావతి: ఆప్కో మాజీ చైర్మన్ గుజ్జల శ్రీను చేనేత కార్మికుల పేరు మీద తప్పుడు సంఘాలు, ఖాతాలు, సభ్యులను సృష్టించి రూ.వందల కోట్ల మేర నిధులను స్వాహా చేశారని సీఐడీ గురువారం హైకోర్టుకు నివేదించింది. దీనిపై హైకోర్టులో విచారణ జరగాల్సిందేనని విన్నవించింది. గుజ్జల శ్రీను తదితరులపై నమోదైన కేసులో ఇప్పటివరకు 174 మంది సాక్షులను విచారించి.. పూర్తి వివరాలతో చార్జిషీట్ దాఖలు చేశామని సీఐడీ తరఫు న్యాయవాది వై.శివ కల్పనారెడ్డి కోర్టుకు నివేదించారు. ఆప్కోకు చైర్మన్‌గా వ్యవహరించడం వల్ల ఆయన ప్రజా సేవకుడు (పబ్లిక్ సర్వెంట్) కిందకే వస్తారని తెలిపారు. అందుకే గుజ్జల శ్రీనుపై అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) కింద కేసు నమోదు చేశామన్నారు. చేనేత సహకార సంఘాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన కోట్ల రూపాయల నిధులను దారి మళ్లించారన్నారు. ఈ నిధులతో గుజ్జల శ్రీను కడపలో 89 స్థిరాస్తులను కుటుంబ సభ్యుల పేరు మీద కూడబెట్టారని ఆమె కోర్టుకు వివరించారు. అందువల్ల ఆయనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయొద్దని కోరారు. ఈ కేసులో శ్రీను తరఫు న్యాయవాదులు ప్రస్తావించిన తీర్పును అధ్యయనం చేయాల్సి ఉందని, ఇందుకు కొంత గడువు కావాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ గుజ్జల శ్రీను, మరికొందరు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.



'క్షమాభిక్ష' విధి విధానాలేంటో చెప్పండి

- ఆ 8 మంది క్షమాభిక్ష రికార్డులను కోర్టు ముందుంచండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 6కి వాయిదా

సాక్షి, అమరావతి: జీవిత ఖైదు అనుభవిస్తున్న దోషులకు క్షమాభిక్ష ప్రసాదించే విషయంలో అనుసరిస్తున్న విధి విధానాలు ఏమిటో తెలియచేయాలని హైకోర్టు గురువారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవిత ఖైదులో భాగంగా 14 ఏళ్ల శిక్షను పూర్తి చేయకపోయినప్పటికీ 8 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తూ ఆగస్టు 15న వారిని విడుదల చేయడానికి సంబంధించిన రికార్డులను తమ ముందుంచాలంది. తదుపరి విచారణను సెప్టెంబర్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన భర్త పార్థమరెడ్డి హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న 8 మంది నేరస్తులను శిక్షాకాలం పూర్తి కాక ముందే విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిట్టమూరు మండలం మెట్టు గ్రామానికి చెందిన ముడి నవనీతమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ గురువారం మరోసారి విచారణ జరిపారు. ప్రభుత్వ న్యాయవాది (హోం) వేలూరి మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని అధికరణ 161 కింద ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించే విచక్షణాధికారం గవర్నర్‌కు ఉందన్నారు. శిక్షను తగ్గించే అధికారం కూడా గవర్నర్‌కు ఉందని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని గుర్తు చేశారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. గవర్నర్‌కున్న అధికారం గురించి ఎలాంటి సందేహం లేదన్నారు. అయితే జీవిత ఖైదు పడి 14 ఏళ్ల జైలు జీవితం గడిపిన వారికి మాత్రమే క్షమాభిక్ష ప్రసాదించగలరని తెలిపారు. ఈ రోజు శిక్ష పడ్డ వారిని క్షమాభిక్ష పేరుతో రేపు విడుదల చేయడానికి ఆస్కారం లేదు కదా? అని వ్యాఖ్యానించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. 14 ఏళ్ల జైలుశిక్ష అనుభవించనప్పటికీ 8 మంది ఖైదీలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే నష్టాల బాటలో డిస్కమ్‌లు

- ఆలిండియా పవర్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ శైలేంద్ర దూబే



మాట్లాడుతున్న శైలేంద్ర దూబే, గణపతి

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్లే దేశంలోని అన్ని విద్యుత్ పంపిణీ వ్యవస్థలు నష్టాల్లో ఉన్నాయని అఖిల భారత విద్యుత్ ఉద్యోగుల సమాఖ్య (ఏఐపీఈఎఫ్) చైర్మన్ శైలేంద్ర దూబే విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లు-2022ను వ్యతిరేకిస్తూ ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. శైలేంద్ర దూబే మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి రూ.64 వేల కోట్ల బిల్లులు బకాయిలున్నాయనీ, సబ్సిడీలకు సంబంధించి రూ.78 వేల కోట్ల బకాయిల్ని కేంద్రం చెల్లించని కారణంగానే డిస్కమ్‌లు నష్టాల్లో ఉన్నాయని ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని సర్వీస్ సెక్టార్‌గానే చూడాలి తప్ప వ్యాపార దృష్టితో చూడకూడదన్నారు. ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో యూనిట్ విద్యుత్ ఉత్పత్తి కంటే 45 పైసలు తక్కువగా వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఏ ప్రైవేట్ సంస్థ అయినా ప్రజలకు నష్టాలకు విద్యుత్‌ను పంపిణీ చేసే ప్రసక్తే లేదన్నారు. యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం మాట్లాడుతూ.. పబ్లిక్ సెక్టార్ సంస్థలు నష్టాల్లో ఉన్నాయంటూ కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతున్న మాటల్లో వాస్తవం లేదనీ.. ఎందుకంటే పబ్లిక్ సెక్టార్‌లో రూ.30 లక్షల కోట్ల ఆస్తులు, రూ.26 లక్షల టర్నోవర్ ఉన్నాయని వెల్లడించారు.

30 వేల ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం

- వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యం
- బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా వెల్లడి



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా, హాఫీజ్‌ఖాన్

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఏపీలో వక్ఫ్‌బోర్డుకు 65 వేల ఎకరాల భూములున్నాయని, వాటిలో దాదాపు 30 వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా చెప్పారు. వాటిని పరిరక్షించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఏపీలో వక్ఫ్ ఆస్తులు, భూముల పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తమ పాలకవర్గం కృషిచేస్తోందన్నారు. విజయవాడలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. బుధ, గురువారాల్లో విజయవాడలో జరిగిన బోర్డు సమావేశంలో 150 అంశాలను చర్చించినట్లు తెలిపారు. వక్ఫ్ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలిస్తున్నామని, అందుకోసం పెండింగ్‌లో ఉన్న 220 కమిటీలు వేశామని చెప్పారు. దర్గా (దౌలత్)లకు సంబంధించి ఈ 2 రోజుల్లో 200 కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వక్ఫ్ భూముల్లో సుమారు వందవరకు కమర్షియల్ ఆస్తులు ఉన్నాయన్నారు. వాటినుంచి వక్ఫ్‌బోర్డుకు ఆదాయాన్ని మరింత పెంచేందుకు తన అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సీఎం కమిటీ ఏర్పాటు చేశారన్నారు. వక్ఫ్ కేసులకు సంబంధించి కర్నూలులో ట్రిబ్యునల్ ఏర్పాటవుతోందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు సభ్యుడు హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న తెలంగాణ బీజేపీ నేత రాజాసింగ్‌ని కఠినంగా శిక్షించాలన్నారు.

చట్టసభల నిర్వహణలో టెక్నాలజీ కీలకం

- పార్లమెంటు సమావేశ వివరాల కోసం ప్రత్యేక యాప్
- కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌లో స్పీకర్ తమ్మినేని



కెనడాలో భారత పతాకంతో తమ్మినేని తదితరులు

సాక్షి, అమరావతి: దేశ, రాష్ట్ర చట్టసభల్లో సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తోందని రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు. ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) వినియోగించడం ద్వారా కాగితం అవసరం లేకుండా చట్టసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభలోను, శాసనమండలిలోను పూర్తిస్థాయిలో కంప్యూటరైజేషన్‌ను అమలు చేస్తున్నామన్నారు. టెక్నాలజీ ద్వారానే కోవిడ్ సమయంలో 15వ చట్టసభలనుద్దేశించి గవర్నర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించే వెసులుబాటు కలిగిందని చెప్పారు. కెనడాలో జరుగుతున్న 65వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌లో గురువారం ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ కార్యకలాపాలను, ప్రభుత్వ పాలన, ప్రజా సమస్యలు, రూల్ ఆఫ్ లా వంటి అంశాల్లో పాటిస్తున్న విధానాలను వివరించారు. చట్టాల రూపకల్పనలో సభ్యుల మధ్య జరిగే లోతైన చర్చలతో సరికొత్త విషయ ఆవిష్కరణ జరుగుతున్న తీరును తెలిపారు. దేశంలో లోక్‌సభ, రాజ్యసభల్లో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నారని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.738 కోట్లతో నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా పార్లమెంటు ప్రొసీడింగ్స్, ప్రశ్నోత్తరాలు, చర్చలు ఎప్పటికప్పుడు ప్రజలు తెలుసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. చట్టసభల నిర్వహణలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషిస్తోందన్నారు.

క్లుప్తంగా...

'మనీ లాండరింగ్' తీర్పుపై పునఃసమీక్షకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తగిన అధికారాలు ఉన్నాయని సమర్థిస్తూ ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. మనీలాండరింగ్ వ్యవహారంలో నిందితుల అరెస్టు, ఆస్తుల అటాచ్‌మెంట్, పీఎంఎల్ఏ కింద సోదాలు, ఆస్తుల సీజ్ వంటి అధికారాలు ఈడీకి ఉన్నాయని సుప్రీంకోర్టు సీజే జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం జులైలో తీర్పివ్వడం తెల్సిందే. ఈ తీర్పును పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎంపీ కార్తీ చిదంబరం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు ధర్మాసనం అంగీకరించింది. మొత్తం తీర్పును మళ్లీ సమీక్షించాల్సిన అవసరం లేదని పేర్కొంది. నిందితులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్టు(ఈసీఐఆర్) ఇవ్వకపోవడం, ఒక వ్యక్తి మనీ లాండరింగ్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటే అమాయకుడినని అతడే నిరూపించుకోవాలన్న రెండు అంశాలను మాత్రమే సమీక్షిస్తే సరిపోతుందని అభిప్రాయపడింది.

గోధుమ పిండి ఎగుమతులపై ఆంక్షలు

న్యూఢిల్లీ: గోధుమ పిండి ఎగుమతులపై ఆంక్షలు విధించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఈఏ) సమావేశంలో నిర్ణయించారు. దేశీయంగా గోధుమ పిండి ధరల పెరుగుదలను అరికట్టడానికే గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించడానికి ఇలాంటి చర్యలు తప్పవని అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. గోధుమ పిండి ఎగుమతుల విషయంలో ఆంక్షలపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) అతిత్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా గోధుమల కొరత ఏర్పడింది. భారత్‌లో ఉత్పత్తి అయిన గోధుమలకు విదేశాల్లో డిమాండ్ పెరిగింది. దీంతో గోధుమల ఎగుమతులపై భారత ప్రభుత్వం ఈ ఏడాది మేలో నిషేధం విధించింది. అనంతరం భారత్ నుంచి గోధుమ పిండి ఎగుమతులు పెరిగాయి. 2021 ఏప్రిల్-జూలైతో పోలిస్తే 2022 ఏప్రిల్-జూలైలో భారత్ నుంచి గోధుమ పిండి ఎగుమతులు ఏకంగా 200 శాతం పెరిగాయి. దేశీయంగా ధరలు పెరుగుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకే గోధుమ పిండి ఎగుమతులపై ఆంక్షలు విధించాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

బీజేపీ యూపీ చీఫ్‌గా భూపేంద్ర చౌదరి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌లో మంత్రి అయిన భూపేంద్ర చౌదరిని పార్టీ రాష్ట్ర విభాగానికి అధ్యక్షుడిగా నియమిస్తూ బీజేపీ గురువారం నిర్ణయం తీసుకుంది. వివాదాస్పద మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతూ జాట్‌లు మోదీ సర్కార్‌పై ఒకింత ఆగ్రహంగా ఉన్న విషయం విదితమే. అందుకే జాట్ కులస్తులకు చేరువయ్యే ఉద్దేశంతో చౌదరిని రాష్ట్ర చీఫ్‌గా ఎంపికచేశారని తెలుస్తోంది. జాట్ వర్గీయుడు చీఫ్‌గా ఉన్న మూడో రాష్ట్రమిది. ఇప్పటికే హరియాణాలో ఓపీ ధన్‌ఖడ్, రాజస్తాన్‌లో సతీశ్ పూనియాలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుదతున్నారు. తూర్పు ఉత్తరప్రదేశ్ నుంచి సీఎం యోగి ప్రాతినిధ్యం వహిస్తుండగా పశ్చిమ యూపీ నుంచి చౌదరి.. రాష్ట్రంలో ప్రాంతీయ సమతూకాన్ని కొనసాగిస్తారని పార్టీ కేంద్రనాయకత్వం యోచిస్తోంది.

సోనాలీ ఫోగాట్ మృతి కేసులో ఇద్దరి అరెస్ట్

పణజి: గోవాలో అనుమానాస్పద స్థితిలో చనిపోయిన బీజేపీ నేత సోనాలీ ఫోగాట్(42) మృతదేహంపై తీవ్రమైన గాయాలున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు. సోనాలీ సోదరుడు రింకూ ధాకా ఫిర్యాదు మేరకు ఆమె సహాయకులిద్దరిపై సెక్షన్ 302 కింద హత్య కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు. ఈ నెల 22వ తేదీన గోవా వచ్చిన సోనాలీ వెంట సుధీర్ సంగ్వాన్, సుఖ్వీందర్ వాసి అనే వారున్నారు. గుండెపోటుకు గురయ్యారంటూ సోనాలీని వీరిద్దరే అంజునాలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గురువారం గోవా మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో సోనాలీ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయింది.

ముగ్గురు ముష్కరులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి చొరబాటు యత్నాన్ని సైన్యం గురువారం విజయవంతంగా అడ్డుకుంది. ఉడి సెక్టార్‌లోని మడియన్ నానక్ పోస్టుకు సమీపంలో పాకిస్తాన్ వైపు నుంచి దొంగచాటుగా సరిహద్దులు దాటేందుకు యత్నించిన ముగ్గురు ఉగ్రవాదులను బలగాలు హతమార్చాయి. ఎలక్ట్రానిక్ నిఘా వ్యవస్థల హెచ్చరికలతో అప్రమత్తమైన బలగాలు 24వ తేదీ మధ్యాహ్నం నుంచే పలు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశాయని అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో మొదటి చొరబాటుయత్నాన్ని నిఘా వ్యవస్థలు గుర్తించాయి. ఆర్మీ, ఉగ్రవాదుల మధ్య 8.45 గంటల నుంచి ప్రారంభమైన ఎదురుకాల్పులు మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగాయన్నారు. సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించేందుకు యత్నించిన ముగ్గురినీ హతం చేసినట్లు వెల్లడించారు. రెండు ఏకే-47 రైఫిళ్లు, ఒక చైనా తయారీ ఎం-16 రైఫిల్, ఇతర మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిక్కుల్లో జార్ఖండ్ సీఎం సోరెన్



- అక్రమ మైనింగ్ లీజ్ కేసులో ఎమ్మెల్యేగా సోరెన్‌పై అనర్హత వేటు వేయాలి
- సీల్డ్ కవర్‌లో తన నిర్ణయాన్ని గవర్నర్‌కు పంపిన కేంద్ర ఎన్నికల సంఘం
- మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ డిమాండ్
- అనర్హతపై తనకు ఎలాంటి సమాచారం లేదన్న సోరెన్

రాంచీ: అక్రమ మైనింగ్ లీజ్ కేసులో జార్ఖండ్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ ఎన్నికల చట్టాలను ఉల్లంఘిస్తూ తనకు తానే మైనింగ్ లీజులను కేటాయించుకున్నారన్న ఆరోపణలపై దర్యాప్తు నిర్వహించిన కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్యేగా ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ గవర్నర్ రమేష్ బియాస్‌కు సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం తన అభిప్రాయాన్ని సీల్డ్ కవర్‌లో పంపిందని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. దీనిపై తుది నిర్ణయం గవర్నర్ తీసుకోవాల్సి ఉంది. ఢిల్లీ నుంచి గురువారం రాంచీకి చేరుకున్న గవర్నర్ రమేష్ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీ ఎయిమ్స్‌లో రెండు రోజులు ఉండి వచ్చానని, రాజ్‌భవన్‌కు వెళ్లి ఆ లేఖ చదివే వరకు తాను ఏమీ చెప్పలేదన్నారు. గవర్నర్ నుంచి నిర్ణయం రాకుండానే ప్రభుత్వంపై బీజేపీ దాడికి దిగింది. జేఎంఎం నైతికంగా అధికారంలో కొనసాగలేదని, అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్ చేశారు. సీఈసీ కానీ, గవర్నర్ దగ్గర్నుంచి కానీ తనకు ఎలాంటి సమాచారం రాలేదని సీఎం అన్నారు. బీజేపీ నాయకుల ప్రకటనలే మీడియాలో చూశానే తప్ప అధికారికంగా తనకు ఎలాంటి సమాచారం అందలేదని స్పష్టం చేశారు. బీజేపీ చేస్తున్న డిమాండ్లను జేఎంఎం నాయకులు తిప్పికొట్టారు. రాష్ట్రంలో జేఎంఎం-కాంగ్రెస్-ఆర్‌జేడీ సంకీర్ణ ప్రభుత్వానికి వచ్చిన ముప్పేమీ లేదని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అలంగిర్ అలమ్ అన్నారు. సోరెన్‌పై అనర్హత వేటు పడినా అసెంబ్లీలో తమకు మెజార్టీ ఉందని చెప్పారు. 2019లో ప్రజాస్వామ్యబద్ధంగా తాము అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి ప్రభుత్వాన్ని కూల్చి వేసే కుట్రకు బీజేపీ పాల్పడుతోందని జేఎంఎం అధికార ప్రతినిధి సుప్రియో భట్టాచార్య ఆరోపించారు. గనుల శాఖ వ్యవహారాలను కూడా చూస్తున్న ముఖ్యమంత్రి సోరెన్ స్టోన్ చిప్ మైనింగ్ లీజుని తన కోసం తానే కేటాయించుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఫిబ్రవరిలో బీజేపీ నేత రఘుబర్‌దాస్ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 9ఏని హేమంత్ సోరెన్ ఉల్లంఘించారని, ఎమ్మెల్యేగా ఆయనపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లగా ఇటీవల సీఈసీ దర్యాప్తు పూర్తి చేసింది.

అసలేమిటీ కేసు?

జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కొన్నేళ్ల క్రితం రాంచీలో అంగారా బ్లాక్‌లో మైనింగ్ లీజ్ దక్కించుకున్నారు. ఇందుకు అవసరమైన పర్యావరణ, అటవీ అనుమతుల కోసం 2021 సెప్టెంబర్ 9న దరఖాస్తు చేసుకున్నారు. 'స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ' సరిగ్గా తొమ్మిది రోజుల్లో.. అంటే సెప్టెంబర్ 18న అనుమతులు మంజూరు చేసింది. మైనింగ్, పర్యావరణం... రెండు శాఖలూ హేమంత్ పరిధిలోనే ఉండడం గమనార్హం. దీంతో ఈ అనుమతుల వ్యవహారంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా హేమంత్ తన భార్య కల్పనకు ఓ పారిశ్రామిక కారిడార్‌లో 11 ఎకరాల ప్లాట్ కేటాయించారు. ముఖ్యమంత్రి రాజకీయ ప్రతినిధి పంకజ్ మిశ్రా, మీడియా సలహాదారు ప్రసాద్ కూడా అక్రమంగా మైనింగ్ లీజులు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటన్నింటిపై కొందరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. 'పొరపాటు జరిగింది' అని అడ్వొకేట్ జనరల్ స్వయంగా అంగీకరించారు. హేమంత్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఎమ్మెల్యేగా ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రఘుబర్ దాస్ డిమాండ్ చేశారు. జార్ఖండ్ గవర్నర్ రమేశ్ బియాస్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హేమంత్‌కు కేటాయించిన మైనింగ్ లీజ్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

అనర్హత వేటు వేస్తే?

ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై అనర్హత వేటు పడితే అధికార సంకీర్ణ కూటమిలో అలజడి రేగే అవకాశం ఉంది. కొత్త ముఖ్యమంత్రి ఎన్నిక జేఎంఎంలో వివాదాలకు దారితీసే పరిస్థితి కనిపిస్తోంది. సీఎం రేసులో హేమంత్ సోదరుడు, ఎమ్మెల్యే బసంత్ సోరెన్ ముందంజలో నిలువనున్నారు. కానీ, ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. రాజకీయ పరిపక్వత, పరిపాలనా అనుభవం లేవు. ముఖ్యమంత్రి పదవికి తామే అర్హులమంటూ కొందరు మంత్రులు, సీనియర్ జేఎంఎం నేతలు అప్పుడే గళం విప్పుతుండటం గమనార్హం. మరోవైపు హేమంత్ తన భార్య కల్పనను సీఎంగా చేసే అవకాశం లేకపోలేదని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

మీ అంచనాలను అందుకున్నా..

న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాల పటిష్టత, జడ్జీల నియామక ప్రక్రియ వేగవంతంపై సీజేఐ రమణ వ్యాఖ్య



న్యూఢిల్లీ: న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాల పరిపుష్టీకరణకు తన శాయశక్తులా కృషిచేశానని దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ వ్యాఖ్యానించారు. శుక్రవారం సీజేఐగా ఆయన పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గురువారం ఢిల్లీ హైకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమంలో జస్టిస్ రమణ మాట్లాడారు. 'నేను సీజేఐగా ఉన్న కాలంలో సుప్రీంకోర్టు కొలీజియం విజయవంతంగా మొత్తంగా 224 మంది జడ్జీలను పలు హైకోర్టుల్లో నియమించింది. ఢిల్లీ హైకోర్టులో నియామకాలకు సంబంధించిన దాదాపు అన్ని పేర్లను సిఫార్సుచేసింది. ఇక ఆమోద ముద్ర వేయాల్సింది కేంద్ర ప్రభుత్వమే. సమ్మతి తెలుపుతుందనే ఆశిస్తున్నా. సీజేఐగా ఇక్కడ రెండు బాధ్యతలను ప్రస్తావించాలి. అవి న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాల పటిష్టతకు కృషిచేయడం, కొత్త న్యాయమూర్తుల నియామకం. ఈ బాధ్యతలను నా శక్తిమేరకు, మీ అంచనాలకు తగ్గట్లు పూర్తిచేశాననే భావిస్తున్నాను' అని ఆయన వ్యాఖ్యానించారు. విజయవంతమైన సీజేఐగా మారడానికి ఢిల్లీ హైకోర్టే నాకు ఒక ల్యాంచ్ ప్యాడ్‌లా దోహదపడిందన్నారు.

అది 'పెగసస్'గా నిర్ధారించలేం

- సుప్రీంకోర్టు ధర్మాసనానికి టెక్నికల్ ప్యానెల్ నివేదిక
- 29 ఫోన్లను పరీక్షిస్తే.. 5 ఫోన్లలో ఒకరకం మాల్‌వేర్
- దర్యాప్తునకు కేంద్ర ప్రభుత్వం సహకరించలేదు
- ఫిర్యాదుల పరిష్కారానికి యంత్రాంగాన్ని నెలకొల్పాలి



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ స్పైవేర్ పెగసస్‌ను కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా ఉపయోగిస్తోందంటూ వెల్లువెత్తిన ఆరోపణలపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు నియమించిన టెక్నికల్ ప్యానెల్ తన నివేదికను ధర్మాసనానికి అందజేసింది. 29 ఫోన్లను పరీక్షించగా, కేవలం 5 ఫోన్లలో ఒకరకం మాల్‌వేర్‌ను గుర్తించినట్లు నివేదికలో వెల్లడించింది. అయితే, అది నిజంగా ఇజ్రాయెల్ పెగసస్ స్పైవేర్ అవునో కాదో నిర్ధారణకు రాలేకపోతున్నట్లు పేర్కొంది. పెగసస్ అంశంపై దర్యాప్తునకు కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని ఆక్షేపించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌వీ రవీంద్రన్ నేతృత్వంలోని ప్యానెల్ తన నివేదికను తాజాగా సీజేఐ జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనానికి అందజేసింది. అందులోని వివరాలను ధర్మాసనం గురువారం బయటపెట్టింది. ''దర్యాప్తునకు కేంద్రం సహకరించలేదని కమిటీ(ప్యానెల్) చెప్పింది. పెగసస్ విషయంలో కోర్టులో విచారణకు మీరు(కేంద్రం) సహకరించలేదు. కమిటీకి సహకరించలేదు' అని పేర్కొంది. పౌరుల గోప్యత హక్కు రక్షణ, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయడానికి ఇప్పుడున్న చట్టాలను సవరించాలని సూచించిందని వివరించింది.

నివేదికను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం

పరీక్ష కోసం టెక్నికల్ కమిటీకి 29 ఫోన్లు అందజేయగా, అందులో 5 ఫోన్లలో మాల్‌వేర్ కనిపించడం కొంత ఆందోళనకరమైన విషయమేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ పేర్కొన్నారు. 29 ఫోన్లు ఇచ్చిన వారికి ఈ నివేదికను అందజేయలేదని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ, చట్టవిరుద్ధమైన నిఘా, పౌరుల గోప్యత విషయంలో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ప్యానల్ ప్రతిపాదించిందని చెప్పారు. నివేదికను విడుదల చేయొద్దంటూ ప్యానల్ తమను కోరిందన్నారు. ఇవన్నీ సాంకేతికపరమైన అంశాలని, నివేదికలో ఏయే భాగాలను బహిర్గతం చేయాలో తాము నిర్ణయిస్తామని, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని వివరించారు. ప్యానెల్ నివేదికను కక్షిదారులకు అందజేయాలని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాకేశ్ త్రివేది సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. దర్యాప్తునకు కేంద్రం సహరించలేదని ధర్మాసనం చెప్పగా, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందించారు. ఆ విషయం తనకు తెలియదని బదులిచ్చారు. ధర్మాసనం తదుపరి విచారణకు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

రాహుల్ క్షమాపణ చెబుతారా?: బీజేపీ

పెగసస్ వ్యవహారంలో ప్రధాని మోదీ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రతిపక్షాలు దుష్ప్రచారం సాగించాయని బీజేపీ నేత, కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్ ఇకనైనా క్షమాపణ చెబుతారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు, స్వయం ప్రకటిత మేధావులు, కొన్ని ప్రభుత్వేతర సంస్థలు, ఓ వర్గం మీడియా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేశాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఇన్నాళ్లూ అబద్ధాలు ప్రచారం చేసినట్లు తేటతెల్లమయ్యిందన్నారు.

కేంద్రం ఏదో దాస్తోంది: రాహుల్

పెగసస్ ఉదంతంలో కేంద్ర ప్రభుత్వంతో ఏదో దాచేస్తోందని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సుప్రీంకోర్టు నియమించిన ప్యానెల్‌కు మోదీ ప్రభుత్వం సహకరించలేదని తప్పుపట్టారు. దీన్నిబట్టి ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో తెలిసిపోతోందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేయాలని మోదీ సర్కారు కోరుకుంటోందన్నారు. దర్యాప్తునకు సహకరించలేదంటే ఏదో నిజాన్ని దాస్తున్నట్లు అంగీకరించినట్లేనని చెప్పారు. ఈ మేరకు రాహుల్ గురువారం ట్వీట్ చేశారు.

చర్మం ఒలిచినా దక్కని ఫలితం

వడోదర: రైల్వే ఉద్యోగం సాధించేందుకు ఓ యువకుడు చేసిన తెగింపు యత్నం బెడిసికొట్టింది. తన బొటన వేలి చర్మాన్ని ఒలిచి స్నేహితుడి వేలికి అతికించి, బయోమెట్రిక్ వెరిఫికేషన్‌లో బయటపడ్డాక తనకు బదులుగా పరీక్ష రాయించాలని పథకం వేశాడు. అయితే, బండారం బయటపడి ఇద్దరూ కటకటాల పాలయ్యారు. బిహార్‌లోని ముంగేర్ జిల్లాకు చెందిన మనీష్ కుమార్, రాజ్యగురు గుప్తా స్నేహితులు. 12వ తరగతి వరకు చదువుకున్నారు. రైల్వే శాఖలోని గ్రూప్ డి ఉద్యోగాలకు మనీష్ దరఖాస్తు చేసుకున్నాడు. ఎంపిక పరీక్ష వడోదరలో ఆదివారం జరిగింది. మనీష్ బదులు చదువులో ఎప్పుడూ ముందుండే గుప్తా పరీక్షకు వచ్చాడు. అభ్యర్థులకు బయోమెట్రిక్ వెరిఫికేషన్ తప్పనిసరి. ఈ గండం గట్టెక్కేందుకు మనీష్ తన బొటనవేలి చర్మాన్ని ఒలిచి గుప్తా చేతి వేలికి అతికించాడు. గుప్తా ఆ చేతిని ప్యాంట్ జేబులోనే ఉంచుకుని, మరో చేతి వేలితో చేసిన బయోమెట్రిక్ వెరిఫికేషన్ యత్నం పలుమార్లు విఫలమైంది. అనుమానించిన అధికారులు అతడి మరో చేతిని బయటకు తీయించి, శానిటైజర్ స్ప్రే చేశారు. బొటనవేలికి అతికించిన చర్మ ఊడి కింద పడింది. అధికారుల విచారణలో అసలు నిజం బయటకు వచ్చింది. దీంతో ఇద్దరు మిత్రులను పోలీసులు అరెస్ట్ చేశారు. పరీక్షకు ముందు బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను ఊహించిన కుమార్..పరీక్షకు ముందు రోజే ఎడమ బొటన వేలిని స్టౌపైన కాల్చుకుని, బ్లేడుతో ఆ చర్మాన్ని ఒలిచి గుప్తా బొటనవేలికి అంటించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. ఒకవేళ, అతికించిన చర్మం ఊడి రాకున్నా వారి పన్నాగం పారేది కాదని వైద్య నిపుణులు అంటున్నారు.



గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో 2020-బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

డీఆర్‌డీవో చీఫ్‌గా సమీర్ వి కామత్

సతీశ్ రెడ్డికి రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు బాధ్యతలు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ శాస్త్రవేత్త సమీర్ వి కామత్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(డీడీఆర్‌డీ) సెక్రటరీగా, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) చైర్మన్‌గా నియమితులయ్యారు. అదేవిధంగా, ప్రస్తుత డీఆర్‌డీవో చీఫ్ జి.సతీశ్‌రెడ్డిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శాస్త్రీయ సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సిబ్బంది వ్యవహారాల శాఖ గురువారం ఆదేశాలు జారీ చేసింది. కామత్ డీఆర్‌డీవోలో నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ విభాగానికి డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కామత్, సతీశ్‌రెడ్డిల నియామకాలను కేబినెట్ నియామకాల కమిటీ(ఏసీసీ) ఆమోదించిందని సిబ్బంది వ్యవహారాల శాఖ పేర్కొంది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 60 ఏళ్లు వచ్చే వరకు కామత్ నూతన బాధ్యతల్లో కొనసాగుతారని కూడా వివరించింది. డీఆర్‌డీవో చీఫ్‌గా జి.సతీశ్‌రెడ్డి రెండేళ్ల పదవీ కాలానికి గాను 2018లో నియమితులయ్యారు. 2020 ఆగస్టులో కేంద్రం ఆయన పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పొడిగించింది. తాజాగా ఆయనకు రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు బాధ్యతలు అప్పగించింది.

6,700 సీబీఐ కేసులు.. కోర్టుల్లోనే పెండింగ్

న్యూఢిల్లీ: సీబీఐ దర్యాప్తు ముగించిన 6,700 కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) తెలిపింది. ఇందులో 275 కేసులు 20 ఏళ్లు పైబడి న్యాయస్థానాల్లో విచారణ కోసం ఎదురు చూస్తున్నాయని 2021 సంవత్సరం నివేదికలో వెల్లడించింది. వీటితోపాటు 10,974 అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లు సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నట్లు వివరించింది. వీటిలో 361 అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లు 20 ఏళ్లకు పైగా హైకోర్టులు, సుప్రీంకోర్టులో మూలుగుతున్నాయంది. పనిభారం, సిబ్బంది కొరత, అనుమతుల్లో జాప్యం, కరోనా కారణాలతో దర్యాప్తు జాప్యం అవుతోందని సీవీసీ పేర్కొంది.

కాంగ్రెస్ చీఫ్ ఎన్నిక ప్రక్రియ ఆలస్యం!

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 20వ తేదీకల్లా పూర్తిచేయాల్సిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల క్రతువు మరి కొన్ని వారాలు వాయిదాపడే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భారత్ జోడో యాత్రా పనుల్లో ముఖ్య నేతలంతా పూర్తిగా నిమగ్నమవడంతో పార్టీ చీఫ్ ఎన్నిక ఇంకాస్త ఆలస్యం కానుందని సంబంధిత వర్గాలు గురువారం వెల్లడించాయి. ఎలక్షన్‌కు సంబంధించి పూర్తిచేయాల్సిన పనులను రాష్ట్ర విభాగాలు ఇంకా ఒక కొలిక్కి తేలేదని సంకేతాలొచ్చాయి. దీంతో ఎన్నికల ఆలస్యం తప్పదని తెలుస్తోంది.

కర్ణాటకలో ఘోరం

తుమకూరు/అగళి: కర్ణాటక రాష్ట్రంలోని 48వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది మృతి చెందగా, మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్తున్న వలసకూలీలే. రాయచూరు జిల్లాలోని సిరివార, దేవదుర్గ, మాన్వి ప్రాంతాలకు చెందిన 22 మంది కూలీలు బుధవారం అర్ధరాత్రి క్రూయిజర్ వాహనంలో బెంగళూరు వైపు బయలుదేరారు. గురువారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో శిర తాలూకా బాలేనహళ్లి వద్ద వీరి వాహనం టైరు పేలి, రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరి వాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో క్రూయిజర్ డ్రైవర్, ఐదుగురు మహిళలు సహా మొత్తం 10 మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 13 మందికి తీవ్రగాయాలయ్యాయి. మృతుల కుటుంబాలకు ప్రధాని సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

బిల్కిస్ కేసులో కేంద్రానికి, గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: గుజరాత్‌లో 2002లో జరిగిన మత ఘర్షణల సమయంలో సంచలనం సృష్టించిన బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం ఘటనలో 11 మంది దోషులను రెమిషన్ మీద విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. దోషుల శిక్షాకాలం తగ్గించి విడుదల చేయడంలో నిబంధనలన్నీ పాటించారా అని సుప్రీం కోర్టు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ నేతృత్వంలోని సుప్రీం బెంచ్ దీనిపై స్పందించాలంటూ కేంద్రానికి, గుజరాత్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీ కా అమృతోత్సవాలు జరుపుకుంటున్న వేళ బిల్కిస్ బానో దోషుల్ని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. అంత హేయమైన నేరంలో నిందితుల్ని విడుదల చేయడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీపీఐ(ఎం) నాయకురాలు సుభాషిణి అలీ, జర్నలిస్టు రేవతి లాల్, సామాజిక కార్యకర్త రూప రేఖ రాణిలు సుప్రీంకోర్టు కెక్కారు. ఈ కేసులో విడుదలైన 11 మంది దోషులని ఇంప్లీడ్ చేయాలంటూ పిటిషనర్లకి సుప్రీం బెంచ్ చెప్పింది. రెండు వారాలకు విచారణను వాయిదా వేసింది.

ఢిల్లీలో కేజ్రీవాల్ బలప్రదర్శన

- ఆమ్ ఆద్మీ పార్టీ సమావేశానికి 53 మంది ఎమ్మెల్యేల హాజరు
- 40 మంది ఎమ్మెల్యేలపై బీజేపీ కన్ను
- రూ.800 కోట్లు ఖర్చు చేసేందుకు బీజేపీ సిద్ధం
- ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఆరోపణ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర మాదిరి అధికార పార్టీ ఎమ్మెల్యేలను తమ వైపునకు తిప్పుకునేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నం చేసిందంటూ, ఢిల్లీలో అది అసాధ్యమని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ పరోక్షంగా ఎమ్మెల్యేలతో బల ప్రదర్శన చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన పార్టీ సమావేశంలో 62 మంది ఎమ్మెల్యేలకుగాను 53 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మిగతా తొమ్మిది మందీ తనకు నిరంతరం 'టచ్'లోనే ఉంటారంటూ ఢిల్లీ సర్కార్‌ను ఎవరూ పడగొట్టలేరని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. పార్టీ ఎమ్మెల్యేల సమావేశం కొద్ది నిమిషాల్లోనే ముగించారు. తర్వాత కేజ్రీవాల్‌సహా అందరూ గాంధీజీ స్మారకం రాజ్‌ఘాట్‌కు వెళ్లారు. ఆప్ ఎమ్మెల్యేలను బుట్టలో వేసుకునే బీజేపీ 'ఆపరేషన్ కమల్' వైఫల్యానికి గుర్తుగా రాజ్‌ఘాట్ వద్ద ప్రార్థనలు చేశామని చెప్పారు. దేశ పురోభివృద్ధి, శాంతిభద్రతల మెరుగు కోసం ప్రార్థనలు చేశామని సీఎం కేజ్రీవాల్ చెప్పారు. కొద్ది రోజులుగా సీఎంతో సత్సంబంధాలు లేని 12 మంది ఎమ్మెల్యేలతో కేజ్రీవాల్ విస్తృతస్థాయిలో మంతనాలు జరుపుతారని ఆప్‌లోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

ఆ రూ.800 కోట్లు ఎక్కడివి?: కేజ్రీవాల్

తన ఇంట్లో ఎమ్మెల్యేలతో భేటీ తర్వాత ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మాట్లాడారు. 'బీజేపీలో చేరితే చెరో రూ.20 కోట్లు ఇస్తామని 40 మంది ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ మభ్యపెట్టింది. ఎమ్మెల్యేలను గంపగుత్తగా కొనేందుకు బీజేపీ రూ.800 కోట్లు ఖర్చుచేసేందుకు సిద్ధమైంది. అంతటి డబ్బు బీజేపీకి ఎక్కడిది? దేశ పౌరులకు బీజేపీ సమాధానం చెప్పాల్సిందే. ఎప్పటికప్పుడు పెంచుతూపోయిన వస్తుసేవల పన్ను(జీఎస్టీ) నుంచి ఆ డబ్బు తెచ్చారా? లేకుంటే పీఎం కేర్స్ ఫండ్ నగదా?. లేదంటే ఆప్త మిత్రులు ఇచ్చారా?' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. తమతో చేయి కలిపితే సీఎపై మోపిన సీబీఐ, ఈడీ కేసులను మాఫీ చేస్తామని, సీఎంను చేస్తామని మనీశ్ సిసోడియాకు బీజేపీ భారీ ఆఫర్ ఇచ్చిందని కేజ్రీవాల్ గుర్తుచేశారు. 'బీజేపీ భారీస్థాయిలో డబ్బాశ చూపినా ఆప్ సుపరిపాలన ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు మద్దతుగా నిల్చున్నారు. తలలు తెగినా సరే వారెవరికీ అమ్ముడుపోరు' అని అన్నారు. ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీలో అవినీతి జరిగిందన్న ఆరోపణపై కేజ్రీవాల్ కొట్టిపారేశారు. ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఆప్ చేస్తున్న కొత్త స్టంట్ ఇది అని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ వ్యాఖ్యానించారు. ఆప్ నాటకాల్లో ఆరితేరిందని, ఎమ్మెల్యేల కొనుగోలు ఆరోపణలు చేస్తూ ఒక సినిమా స్క్రిప్టును చూపిస్తోందన్నారు. ఆప్ ఎమ్మెల్యేల రాకతో రాజ్‌ఘాట్ అపవిత్రమైందంటూ ఆ తర్వాత బీజేపీ నేతలు శుద్ధిచేస్తామంటూ అక్కడ గంగాజలం చల్లారు. మరోవైపు ఢిల్లీ రాష్ట్ర మంత్రులను లక్ష్యంగా చేసుకుని ఈడీ, సీబీఐ దర్యాప్తు సంస్థల దాడులపై చర్చించేందుకు శుక్రవారం ఢిల్లీ శాసనసభ ప్రత్యేకంగా సమావేశంకానుంది.



రాజ్‌ఘాట్ వద్ద మౌనముద్రలో కేజ్రీవాల్

ఫిరోజ్‌పూర్ ఎస్ఎస్‌పీదే బాధ్యత

ప్రధాని మోదీ పంజాబ్ పర్యటన భద్రతా వైఫల్యాలపై సుప్రీం కమిటీ నివేదిక

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనవరిలో పంజాబ్ పర్యటన సందర్భంగా భద్రతా వైఫల్యాలపై సుప్రీం కోర్టు నియమించిన కమిటీ తన నివేదికలో ఫిరోజ్‌పూర్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (ఎస్ఎస్‌పీ)ని తప్పు పట్టింది. పోలీసు బలగాలు సరిపడనంత మంది ఉన్నప్పటికీ తన విధుల్ని నిర్వర్తించడంలో ఫిరోజ్‌పూర్ ఎస్ఎస్‌పీ అవనీత్ హన్స్ విఫలమయ్యారని నివేదికలో పేర్కొంది. ప్రధానమంత్రి భద్రత కల్పించే పోలీసు అధికారులు బ్లూ బుక్‌ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారో లేదో పర్యవేక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రధానమంత్రి ఏదైనా రాష్ట్ర పర్యటనకు వెళితే భద్రతకు సంబంధించి రాష్ట్ర పోలీసు యంత్రాంగం, స్పెషల్ ప్రొటెక్షన్ అధికారులు ఏమేం చర్యలు చేపట్టాలో ఈ బ్లూబుక్‌లో వివరంగా ఉంటుంది. అప్పటి పంజాబ్ ఏడీజీపీ జి. నాగేశ్వరరావు ప్రధాని పర్యటించే ప్రాంతం చాలా ఇరుకుగా ఉంటుందని, భద్రత గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెండు గంటలు ముందే చెప్పారని, తగినంత సమయం, సరిపడా బలగాలు ఉన్నప్పటికీ ఎస్ఎస్‌పీ హన్స్ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని పేర్కొంది.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 26 । ఆగస్టు । 2022



38,466 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): మార్కెట్ యార్డుకు గురువారం 38,090 మిర్చి బస్తాలు వచ్చాయి. నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానంలో 38,466 బస్తాలు విక్రయించారు.



పులిచింతల నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో 38.694 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 92,352 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 63,149 క్యూసెక్కులు వదులుతున్నారు.



రావి అరుణకు జాతీయ అవార్డు

పెనమలూరు: కానూరు జెడ్పీ పాఠశాలలో పని చేస్తున్న భౌతిక,రసాయన శాస్త్ర ఉపాధ్యాయిని డాక్టర్ రావి అరుణను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకతో పెడన పట్టణం పరవశించింది. వెల్లువలా తరలి వచ్చిన జనం ప్రభంజనమై ఘనస్వాగతం పలికింది. జై జగన్ అంటూ నినదించింది. తమ జీవితాలకు భరోసా ఇస్తూ సాగిన ముఖ్యమంత్రి ప్రసంగంతో చేనేత కార్మికులు మురిసిపోయారు. సంక్షేమ ప్రదాతా వర్ధిల్లు అంటూ నిండు మనసుతో దీవించారు. పెడన పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయడంతోపాటు, బందరు పోర్టు శంకుస్థాపనకు త్వరలో మళ్లీ వస్తానంటూ ముఖ్యమంత్రి ప్రకటించి ప్రజల్లో ఉత్సాహం నింపారు.

పెడన సభకు హాజరైన జన సందోహం (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నేతనోత్తేజం



- పండగ వాతావరణంలో నేతన్న నేస్తం నాలుగో విడత పంపిణీ
- జిల్లాకు వరాలు కురిపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- త్వరలో బందరు పోర్టుకు శంకుస్థాపన చేస్తానంటూ ప్రకటన
- పెడన పట్టణ అభివృద్ధికి రూ.102 కోట్ల నిధులు మంజూరు
- సీఎం ప్రసంగాన్ని ఆసాంతం ఆసక్తిగా ఆలకించిన జనం



నేతన్న నేస్తం నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తున్న సీఎం వైఎస్ జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివాదం చేస్తున్న ప్రజలు

సాక్షి, మచిలీపట్నం: వైఎస్సార్ నేతన్న నేస్తం నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో పెడన పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. బందరు పోర్టు నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేసేందుకు వస్తానని ప్రకటించడంతోపాటు, పెడన అభివృద్ధికి రూ.102 కోట్ల నిధులు మంజూరు చేయడంతో జిల్లా వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పెడన పరిధిలోని తోటమూలలో రాష్ట్రస్థాయి వైఎస్సార్ నేతన్న నేస్తం నాలుగో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. సీఎం హోదాలో జననేత తొలిసారిగా పెడన రావడంతో ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా చేనేత కుటుంబాలు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని అన్ని వీధులు, సభా ప్రాంగణం కిక్కిరిశాయి.

డీపీటీ స్కీమ్‌ను వివరించిన సీఎం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో టీడీపీ, పవన్ కల్యాణ్, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5ల డీపీటీ స్కీమ్‌ను వివరించారు. డీపీటీ అంటే... దోచుకో, పంచుకో, తినుకో అని చెప్పారు. టీడీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో దుయ్యబట్టారు. ఉద్యోగాలు, సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే ప్రాధాన్యం ఇచ్చామని చెప్పిన సమయంలో 'జై జగన్' అన్న నినాదాలతో సభ మార్మోగింది. మన బడి నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలను మార్చి ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని ముఖ్యమంత్రి పేర్కొనగా సభికులు హర్షధ్వానాలు చేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయవాడ కార్పొరేషన్, జెడ్పీ చైర్‌పర్సన్, దుర్గగుడి చైర్మన్ పదవులను బీసీలకు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించిన సమయంలో ఉప్పాల హారిక లేచి నమస్కరించగా, జనం ఈలలు, చప్పట్లతో మద్దతు తెలిపారు.

సీఎంకు ఘన స్వాగతం

గుంటూరు జిల్లా తాడేపల్లి నుంచి గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో పెడనలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేరుకున్నారు. మంత్రి జోగి రమేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ప్రభుత్వ విప్ ప్రసాదరాజు, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేష్, కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో సీఎం సభా ప్రాంగణానికి బయలు దేరారు. దారి పొడవునా బారులు తీరిన ప్రజలు 'జై జగన్' అంటూ నినాదాలు చేశారు. ఆయన్ను తమ సెల్ ఫోనులతో ఫొటోల తీశారు. సభా ప్రాంగణం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆర్.కె.రోజా, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను స్వాగతం పలికారు. అనంతరం కృష్ణాజిల్లా అభివృద్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ మహేష్‌కుమార్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మగ్గం నేసిన ముఖ్యమంత్రి జగన్



ఎగ్జిబిషన్ వద్ద ఏర్పాటు చేసిన మగ్గాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం మగ్గం నేసి, చేనేత వస్త్రాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం రాయవరం, పోలవరం, పెడనకు చెందిన చేనేత కళాకారులతో ఫొటోలు దిగారు. నేతన్నలను పేరు పేరునా పలకరించి వారి సమస్యలను ఆలకించారు. వారి సమస్యలను నమోదు చేసి, పరిష్కరించాలని తన కార్యాలయ కార్యదర్శి ముత్యాలరాజు, కలెక్టర్ రంజిత్‌బాషాను ఆదేశించారు. అనంతరం వేదికపైకి చేరుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

త్వరలో బందరు పోర్టు శంకుస్థాపనకు వస్తా

వైఎస్సార్ నేతన్న నేస్తం ప్రారంభించే రోజున సంతోషకర వార్త తెలిసిందని సీఎం వైఎస్ జగన్ ప్రస్తావించారు. ఆ వార్త ఏమై ఉంటుందా అని సభికులు ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉన్నారు. బందరు పోర్టు నిర్మాణానికి కోర్టు అనుమతి లభించిందని, త్వరలో పోర్టు శంకుస్థాపనకు మరోసారి వస్తానని సీఎం ప్రకటించడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమానికి భారీగా జనం తరలి రావటంతో సభా ప్రాంగణం నిండిపోయింది. కూర్చునేందుకు స్థలం లేకపోయినా, వేలాది మంది ప్రాంగణం వెలుపలే ఎండలో నిలబడి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఆసాంతం ఆలకించారు. మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ టి.కల్పలత, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, రక్షణనిధి, బందరు మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, ఏపీ వ్యవసాయ శాఖ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ముడా చైర్‌పర్సన్ భవాని తదితరులు పాల్గొన్నారు.



వేదికపై ప్రసంగిస్తున్న లబ్ధిదారు సజ్జా కుమారి

28న చెస్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: ఆల్ ఇండియా ఫిడే ఓపెన్ రేటింగ్ చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లను ఈ నెల 28వ తేదీన ఎంపిక చేస్తామని ది విజయవాడ చెస్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు ఎండీ అక్బర్‌పాషా, ఎం.రాజీవ్ తెలిపారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఓపెన్, బాలికల విభాగంలో క్రీడాకారులను ఎంపిక చేస్తామని, ఆసక్తి ఉన్న వారు సొంత కిట్లతో ఎంపిక ప్రాంగణానికి హాజరుకావాలని సూచించారు. ఎంపికైన జిల్లా జట్లు సెప్టెంబర్ 8,9 తేదీల్లో విజయనగరం జిల్లాలో జరిగే ఆల్ ఇండియా ఫిడే ఓపెన్ రేటింగ్ చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 90303 08811 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

వైభవంగా దసరా ఉత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ. వేదికపై మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు, దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ ఐదో తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో దసరా ఉత్సవాల నిర్వహణపై దేవదాయ, పోలీస్, రెవెన్యూ, నగరపాలక సంస్థ, వైద్య ఆరోగ్య, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో మంత్రి గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ.. దసరా ఉత్సవాల్లో నిత్యం వేల మంది, మూలా నక్షత్రం రోజు రెండు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందన్నారు. భక్తులకు త్వరితగతిన దైవ దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ ఏడాది కరోనా తగ్గుముఖం పట్టినందున అంచనాలకు మించి భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు.

ప్రసాదాలకు అదనపు కౌంటర్లు

భక్తులకు ప్రసాదాలను విక్రయించేందుకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి సత్యనారాయణ ఆదేశించారు. భక్తులకు పేపర్ గ్లాసులతో నిరంతరం మంచి నీరు, మజ్జిగ పంపిణీ చేయాలని, తగినంత మంది క్షురకులను తాత్కాలిక పద్ధతిలో నియమించాలని సూచించారు. జిల్లా అధికారులు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం ఏర్పాట్లను పరిశీలిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి సత్యనారాయణ సూచించారు. సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ దేవినేని అవినాష్, ఎమ్మెల్సీలు ఎండీ రుహుల్లా, టి.కల్పలతరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఈఓ భ్రమరాంబ, ఆలయ స్థానాచార్యుడు వి.శివప్రసాద్, ప్రధాన అర్చకులు దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణ

నర్సింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు (గన్నవరం): మండలంలోని ఆత్కూరులో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సు) కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు గ్రామీణ యువతులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. రెండు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి ఏర్పాట్లు చేస్తామని సూచించారు. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల స్కిల్ నైపుణ్య కేంద్రంలో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చి, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సెప్టెంబర్ ఐదో తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 77300 65881 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

భాషకు సేవ.. రచనల తోవ

- సాహితీ వేత్తలకు తెలుగు భాషా పురస్కారాలు
- విజయవాడ నుంచి ఆరుగురు ఎంపిక
- తెలుగు భాషా దినోత్సవం రోజున ప్రదానం

విజయవాడ కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషలో విశిష్ట సేవలు అందించిన నలభై మందికి భాషా పురస్కారాలు ప్రకటించింది. ఇందులో నగరానికి చెందిన సాహితీవేత్తలు, పరిశోధకులు ఆరుగురు ఉన్నారు. 29వ తేదీ విశాఖపట్నం సిరిపురంలోని బాలల ప్రాంగణంలో ప్రభుత్వం నిర్వహించే భాషా దినోత్సవంలో వీరికి రూ.10 వేల నగదు బహుమతితోపాటు, విశిష్ట సత్కారం నిర్వహిస్తున్నట్లు అధికార భాషా సంఘం, ఆంధ్రప్రదేశ్ తెలుగు ప్రాధికార సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో పురస్కారానికి ఎంపికైన వారు భాషకు చేసిన సేవలు, వారి ప్రస్థానంపై ప్రత్యేక కథనం.

సాహితీ సుగంధాలు వెదజల్లుతూ..



గోళ్ల నారాయణరావు.. ఈయన ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ ద్వారా పలు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలకు నేతృత్వం వహించారు. తెలుగు భాషకు సంబంధించిన భాషోత్సవాలలో పత్ర సమర్పణ చేశారు. విశ్వనాథ, నారాయణ రెడ్డి, తదితర సాహితీవేత్తల జయంతులు, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తున్నారు.

అన్నమయ్య పద సేవలో..



డాక్టర్ గుమ్మా సాంబశివరావు.. ఈయన తెలుగు అధ్యాపకులు. ఆంధ్రా లయోలా కళాశాలలో సుదీర్ఘ కాలం పనిచేశారు. అన్నమయ్య పద సాహిత్యంపై పరిశోధన చేసినందుకుగానూ డాక్టరేట్ లభించింది. వందమంది పరిశోధక విద్యార్థులు వీరి పర్యవేక్షణలో డాక్టరేట్ పొందారు. 50 పైగా పుస్తకాలను రచించారు. దేశ విదేశాలలో భాషా సదస్సులకు నేతృత్వం వహించారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం భాషా పురస్కారంతో సత్కరిస్తోంది.

పాత్రికేయ సాహిత్యంలో దిట్ట..



డాక్టర్ కప్పగంతు రామకృష్ణ.. ఈయన బీఈడీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ప్రధానంగా కృష్ణాజిల్లా పత్రికారంగంలో విశేషమైన కృషి చేశారు. విద్యార్థుల కోసం 40 పైగా పుస్తకాలను రచించారు. ఇటీవల గణిత శాస్త్రంలో చేసిన పరిశోధనకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.

సాహిత్య వైద్యుడు



డాక్టర్ జీవీ పూర్ణచందు.. ఈయన వృత్తిరీత్యా వైద్యుడైనా, తెలుగు సాహిత్యం, పరిశోధన, నవల, మినీ కవిత, కథ ఏ రంగంలో చూసుకున్నా తనదైన ముద్రవేసుకున్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యుడు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం నిర్వహణలో కీలకమైన బాధ్యతలు తీసుకున్నారు. వందకు పైగా పుస్తకాలను రచించారు. ప్రపంచ తెలుగు రచయితల సభలను నగరంలో విజయవంతంగా నిర్వహించారు.

ప్రోత్సాహక సాహిత్యం



టి.శోభనాద్రి.. ఈయన ప్రముఖ ఇంజినీర్. ప్రవృత్తి సాహిత్యం. పరవస్తు చిన్నయసూరి కళాపీఠం ద్వారా అటు తెలుగులోనూ, సంస్కృతంలోనూ కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్ ద్వారా నూతన కవులు, రచయితలను ప్రోత్సహించారు. అనేక సాహితీ సదస్సులో పత్ర సమర్పణ చేశారు.

అనువాదంలో అందెవేసిన చేయి



డాక్టర్ వెన్నావల్లభ రావు.. ఈయన తెలుగు సాహిత్యంతో పాటు హిందీ సాహిత్యంలోనూ దిట్ట. తెలుగులో వచ్చిన అనేక సాహిత్య గ్రంథాలను హిందీలోకి అనువదించారు. అనువాద సాహిత్యంలో ఆయన చేసిన కృషికి కేంద్ర సాహిత్య పురస్కారం లభించింది. పింగళి వెంకయ్య జీవిత చరిత్రపై పరిశోధన చేసి తెలుగు వారికి అందించారు. దానిని హిందీలోకి అనువదించారు.

నేటి నుంచి సెంట్రల్ జోన్ క్రికెట్ మ్యాచ్‌లు

విజయవాడ స్పోర్ట్స్: సెంట్రల్ ఆంధ్రా సీనియర్ పురుషుల వన్డే రౌండ్ ర్యాబిన్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మైదానాల్లో శుక్రవారం నుంచి జరుగుతాయని మైదానాల ఇన్‌చార్జ్ రమేష్ గురువారం తెలిపారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు ఈ పోటీల్లో తలపడతాయని పేర్కొన్నారు. పోటీల అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే సెంట్రల్ ఆంధ్రా జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని వచ్చే నెల 5న జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక ఓ ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక ఉపాధ్యాయులు ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు 10 ఏళ్ల సర్వీసు కలిగి ఉండాలని, ఏ విధమైన క్రమశిక్షణ చర్యలు, క్రిమినల్ కేసులు లేనివారు అర్హులని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత ఉప విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖాధికారి లేదా పాఠశాలల ఉప తనిఖీ అధికారి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన మానస

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వైవై కాలనీకి చెందిన వివాహిత గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్ఐ బీవీ.రామారావు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వైవై కాలనీకి చెందిన నల్లగొర్ల మానస(35)కు గత కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఆమె భర్త నల్లగొర్ల రాము తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం పట్టణంలో ఓ హోటల్‌లో వంటమాస్టర్‌గా పనిచేస్తుండగా, వారికి ఇద్దరు మగ పిల్లలు. వారిలో ఒకరు 8, మరొకరు 10వ తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆమె కుటుంబ సభ్యులు, భర్త, పిల్లలు నిద్రిస్తుండగా వంట గదిలోకి వెళ్లి మానస ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శతాధిక వృద్ధుల సమాచారం ఇవ్వండి

మధురానగర్(విజయవాడ సెంట్రల్): అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ ఒకటో తేదీన శతాధిక వృద్ధులకు విజయవాడలో సత్కారం చేయనున్నట్లు వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శత వసంతాలు పూర్తిచేసుకున్న పదిమందిని ఒక్క చోటకు చేర్చి వారికి పాదాభివందనం చేస్తే సాక్షాత్తూ భగవంతుని పాదాలకు నమస్కరించినట్లేనని పురాణ ఇతిహాసాలు చెబుతున్నాయన్నారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వందేళ్లు పూర్తిచేసుకున్న వృద్ధులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తాము సొంత ఖర్చులతో విజయవాడకు తీసుకువచ్చి సత్కారించి.. తిరిగి వారి ఇంటివద్ద దిగబెడతామని తెలిపారు. శతాధిక వృద్ధుల సమాచారం చుట్టుగుంటలోని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో కానీ, 9848111138, 7989914413 నంబర్‌లకు కానీ తెలియజేయాల్సిందిగా కోరారు.

నేతన్నల కళ్లలో నూతన కళ

- నాలుగో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం ప్రారంభం
- ఎన్టీఆర్ జిల్లాలో 123 మందికి రూ. 29.52 లక్షలు ఆర్థిక సాయం
- జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మగ్గం ఉన్న చేనేత కుటుంబానికి నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కృష్ణా జిల్లా పెడనలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం లబ్ధిదారుల ఖాతాలో ఆర్థిక సహాయాన్ని నేరుగా జమ చేశారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా కార్యక్రమాన్ని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ, భట్రాజు కార్పొరేషన్ చైర్మన్ గీతాంజలిదేవి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ దేవినేని అవినాష్ వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువన ఉండి.. సొంత చేనేత మగ్గంపై పనిచేస్తూ, జీవనోపాధి పొందుతున్న చేనేత కార్మికులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా సొంత మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ. 24 వేలు చొప్పున నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామన్నారు.

జిల్లాలో లబ్ధి ఇలా..

ఇప్పటికే మూడు విడతల్లో జిల్లాలోని లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించామన్నారు. 2019–20 సంవత్సరంలో 54 మంది లబ్ధిదారులకు రూ.12.96 లక్షలు, 2020–21 సంవత్సరంలో 143 మంది లబ్ధిదారులకు రూ.34.32 లక్షలు, 2021–22 సంవత్సరంలో 113 మంది లబ్ధిదారులకు రూ. 27.12 లక్షలు అందజేశామన్నారు. ఈ ఏడాది నాలుగో విడతగా 123 మంది లబ్ధిదారులకు రూ.29.52 లక్షలు అందజేసినట్లు చెప్పారు. అనంతరం దీనికి సంబంధించిన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో చేనేత జౌళి డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజశేఖర్, జిల్లాలోని లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించండి

కృష్ణా డీఈవో తాహెరా సుల్తానాతో ఎమ్మెల్సీ కల్పలత



మచిలీపట్నం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సకాలంలో పరిష్కరించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ కల్పలత అన్నారు. గురువారం మచిలీపట్నం వచ్చిన ఆమె కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. డీఈవో తాహెరా సుల్తానా ఆమెకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఉపాధ్యాయుల సర్వీస్ పరమైన సమస్యలపై ఎమ్మెల్సీ కల్పలత, డీఈవో తాహెరా సుల్తానాతో చర్చించారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందని, అదే క్రమంలో ఉపాధ్యాయుల సమస్యలపైన ఎంతో సానుకూలంగా ఉంటుందన్నారు. విద్యారంగ కార్యక్రమాల అమల్లో కృష్ణా జిల్లా ముందుండాలని సూచించారు. విద్యాశాఖ పరంగా జిల్లాలో అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై డీఈవో ఈ సందర్భంగా వివరించారు. జిల్లాలో విద్యాశాఖ సంక్షేమ పథకాల అమలు పురోగతిపై ఎమ్మెల్సీ కల్పలత సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో జిల్లా విద్యాశాఖ పనిచేసి కృష్ణాజిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చండి

భవానీపురం(విజయవాడ పశ్చిమ): ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన ముదిరాజు సామాజిక వర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏలో చేర్చి ఆదుకోవాలని ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న వెంకట నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల ఆయన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2009లో తమను బీసీ–ఏలో చేరుస్తూ జీఓ ఇచ్చారని, అయితే అదే కేటగిరిలోని కొన్ని కులాలు కోర్టుకు వెళ్లటం వల్ల అది ఆగిపోయిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలకు పూర్తిగా అన్యాయం జరిగిందని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే బీసీలకు సరైన గుర్తింపు, గౌరవాన్ని కల్పించారని అన్నారు. ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా మాజీ జెడ్పీటీసీ చౌడేపల్లి మాధవరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ మాదిరిగా ముదిరాజు సామాజికవర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించి చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరారు. ముదిరా(రాజు), కుంద్రపాకం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థి బలవన్మరణం


మణికంఠ (ఫైల్)

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థి గంజాల మణికంఠ (17) గురువారం ఉరి వేసుకొని బలవన్మరణం చెందాడు. కృష్ణాజిల్లా కోడూరు మండలం ఇరాలి గ్రామానికి చెందిన మణికంఠ గతే డాది నూజివీడు ట్రిపుల్ ఐటీలో చేరాడు. అతని రూమ్‌లో ఉండే మరో విద్యార్థి బుధవారం రాత్రి తన స్నేహితుడి రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాడు. తెల్లవారిన తర్వాత ఫ్రెష్ అయ్యి తరగతులకు వెళ్దామని ఉదయం ఎనిమిది గంటలకు తన రూమ్‌కు రాగా తలుపులు వేసి ఉన్నాయి. ఎంత కొట్టినా తీయకపోవడంతో వెంటనే కేర్ టేకర్‌కు, సెక్యూరిటీ సిబ్బందికి విషయాన్ని తెలిపాడు. దీంతో వారు వచ్చి తలుపు గొళ్లెం పగులగొట్టి లోపల చూడగా, మణికంఠ ప్లాస్టిక్ వైరుతో ఫ్యానుకు ఉరివేసుకొని చనిపోయి ఉన్నాడు. వెంటనే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయగా డీఎస్పీ బుక్కాపురం శ్రీనివాసులు, సీఐ ఆర్.అంకరాజు, పట్టణ ఎస్ఐ తలారి రామకృష్ణ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సూసైడ్ లెటర్ ఏమైనా రాశాడేమోనని రూమంతా గాలించినా ఎలాంటి ఆధారం దొరకలేదు. మృతుడి వాట్సాప్ లాస్ట్ సీన్ ఉదయం 7.15 గంటలుగా ఉండటంతో ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఉరివేసుకొని చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ ఆచార్య కేసీ రెడ్డి, డైరెక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు హాస్టల్‌కు విచ్చేసి ఉరి వేసుకొన్న గదిని, మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పట్టణ ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధురాలు మృతి


మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: అనారోగ్యంతో బాధపడుతూ ప్రయాణం చేసిన ఓ వృద్ధురాలు అకాల మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పెడన మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన సమ్మెట రత్నమాణిక్యం(64) పెడనలో జరుగుతున్న వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమానికి హాజరు కావాలని తలంచింది. అనారోగ్యంతో బాధపడుతూనే.. ఇంట్లో వారు వద్దని వారించినా వినకుండా బయలుదేరింది. పెడనలో బస్సు దిగి వస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. తక్షణ వైద్య సేవలు అందించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ సీఎం వైఎస్ జగన్‌కు వీడ్కోలు సమయంలో హెలిప్యాడ్ వద్ద వృద్ధురాలు మృతి విషయాన్ని సీఎంకు తెలియజేశారు. తక్షణమే స్పందించిన సీఎం ఆ కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కృష్ణా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఒక గంటలో రూ. 10 లక్షల చెక్కుతో జిల్లా ఉన్నతాధికారులతో కలిసి మంత్రి జోగి రమేష్ నేరుగా మృతి చెందిన మాణిక్యం గృహానికి వెళ్లారు. ఆమె భౌతికఖాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యుల ఓదార్చారు. మృతి చెందిన మాణిక్యంకుటుంబసభ్యులకు తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి జోగి రమేష్ భరోసా కల్పించారు. రూ. 10 లక్షల చెక్కును అందించారు. ఆర్డీవో కిశోర్, తహసీల్దార్ మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుతరావు, నాగబాబు, బైరావలింగం, జోగి సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఎన్నికలు అనివార్యం

- కృష్ణా మిల్క్ యూనియన్‌లో ఫలించని రాజీ ప్రయత్నాలు
- ఎన్నికల బరిలో నలుగురు అభ్యర్థులు
- గుర్తులు కేటాయింపు, 30న పోలింగ్


గుర్తులు కేటాయిస్తున్న ఎన్నికల అధికారి గురునాథం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ల ఎన్నికలు ఈ నెల 30వ తేదీన జరగనున్నాయి. 3 డైరెక్టర్లకు గాను నలుగురు అభ్యర్థులు బరిలో నిలువగా, ఇక ఎన్నిక లాంఛనమేనని యూనియన్ పెద్దలందరూ భావించారు. పోటీలో ఉన్న నలుగురిలో ఒకరు పోటీ నుంచి తప్పుకునేలా బుధవారం సాయంత్రం నుంచి యూనియన్ పెద్దలు తీవ్రంగా ప్రయత్నించారు. గురువారం సాయంత్రం వరకు చేసిన రాజీ ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు నామినేషన్ల గడువు ముగియడంతో సాయంత్రం 5 గంటల తర్వాత ఎన్నికల అధికారి ఎల్. గురునాథం పోలింగ్ తేదీని ప్రకటించారు.

గుర్తుల కేటాయింపు..

పోటీలో నిలిచిన నలుగురు అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో పాటు వారికి పోలింగ్ పత్రాలను అందజేశారు. పోటీలో నెలకుదిటి నాగేశ్వరరావుకు బీరువా, పల్లగాని కొండలరావుకు బ్యాట్, పాలడుగు వెంకటరామ వరప్రసాద్‌కు బ్యాటరీ లైట్, మర్రెడ్డి బసివిరెడ్డికి బ్రష్ గుర్తులను కేటాయించారు. 30వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 3 గంటల పోలింగ్, ఆ తర్వాత కౌంటింగ్, ఆ వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు.

కేఎల్‌యూలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' పోటీలు ప్రారంభం


హ్యాకథాన్ పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలు ప్రారంభమైనట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ సారథివర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యావిభాగం, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తోందని, 18 రాష్ట్రాల నుంచి 30 బృందాలు ఈ పోటీలలో పాల్గొన్నాయని, రాష్ట్ర నైపుణ్యాల అభివృద్ధి సంస్థ చైర్మన్ అజయ్‌రెడ్డి ప్రారంభించారని అన్నారు. రాష్ట్ర నైపుణ్యాల అభివృద్ధి సంస్థ చైర్మన్ అజయ్‌రెడ్డి మాట్లాడుతూ వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు తమ సృజనాత్మకతను జోడించి పరిష్కరించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్నోవేటివ్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ లావణ్య, హ్యాక్‌థాన్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ డాక్టర్ శ్రీనాథ్, కో ఆర్డినేటర్ డాక్టర్ పవన్‌కుమార్, చీఫ్ కో ఆర్డినేటర్స్ డాక్టర్ సుమన్, డాక్టర్ శరత్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు టిఫిన్ బండ్లు పంపిణీ



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సమాజంలో పేదవర్గాలకు అవకాశమున్నంత మేర ప్రతి ఒక్కరూ సాయమందించేందుకు ముందుకు రావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధికార ప్రతినిధి మనోజ్‌కొఠారి అన్నారు. మనోజ్ కొఠారి యూత్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని నాలుగురు చిరు వ్యాపారులకు టిఫిన్‌బండ్లు పంపిణీ చేశారు. మనోజ్‌కొఠారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బేసిక్ లైఫ్ సపోర్టు విధానంపై అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): అత్యవసర సమయంలో ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బేసిక్ లైఫ్ సపోర్టు (బీఎల్ఎస్) పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ వైద్యులు జి.సమరం అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బీఎల్ఎస్, సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీ ససిటేషన్) విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్వాస ఆగిన వారికి తిరిగి గుండెను కొట్టుకునేలా చేయడంపై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సునీత, డాక్టర్ ప్రజ్వల, డాక్టర్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

చేనేతను ఆదరించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చేనేత వస్త్రాలను ధరించడం ద్వారా ఆ వృత్తిపై ఆధారపడుతున్న లక్షలాది మంది కార్మికులను ఆదరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఎంజీ రోడ్డులో బాపు ప్రదర్శనశాల (విక్టోరియా మ్యూజియం)లో నిర్వహిస్తున్న జాతీయ చేనేత సిల్క్ ఫ్యాబ్‌ను గురువారం ఆమె సందర్శించారు. చేనేత సిల్క్ ఫ్యాబ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. పట్టు చీరలు, కాటన్ చీరలు, ఖాదీ దుస్తులు, ఇమిటేషన్ జ్యూయలరీ, డ్రస్ మెటీరియల్, కిడ్స్‌వేర్ ఐటమ్స్ తిలకించారు. వాటి తయారీదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చేనేత సిల్క్ మార్కెటింగ్ కో–ఆర్డినేటర్ కోట దేవకీదేవి, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు మహేష్ మేయర్‌కు ఫ్యాబ్ వివరాలు తెలిపారు. సెప్టెంబరు 11వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అనధికార నిర్మాణం తొలగింపు



గుణదల(విజయవాడ తూర్పు):గురునానక్ నగర్‌లోని ఓ భవనంపై అనధికారికంగా నిర్మించిన నాల్గో అంతస్తును విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్–3 డిప్యూటీ ప్లానర్ జుటిన్ చీరన్ నేతృత్వంలో టీపీఎస్ వసీం బేగ్, ప్లానింగ్ సెక్రటరీ గురువారం తొలగించారు. భవన యజమాని నగర పాలక సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా అంతస్తు నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సెంట్రింగ్‌ను గతంలో తొలగించి యజమానికి హెచ్చరికలు జారీ చేశామన్నారు. ప్రవర్తన మార్చుకోకుండా నిర్మాణాన్ని ఇటీవల పూర్తి చేశాడన్నారు. వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాన్ని తొలగించామన్నారు.

మహిళను వేధించిన వ్యక్తి అరెస్ట్

కంచికచర్ల: ఓ వివాహిత మహిళను వేధించిన కేసులో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పీవీ సుబ్రహ్మణ్యం గురువారం రాత్రి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కంచికచర్లకు చెందిన ఓ వివాహిత తనను అదే గ్రామానికి చెందిన కె.ఆదిశేఖర్ నిత్యం వేధిస్తున్నాడని తన చేయి పట్టుకున్నాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల అమలు గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

భవానీపురం(విజయవాడ పశ్చిమ):పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి 47వ డివిజన్ 147వ వార్డ్ సచివాలయం పరిధిలోని కెఎల్‌రావు నగర్ 4,5,6,7 లైన్లు తదితర ప్రాంతాల్లో గురువారం ఇంటింటికీ తిరిగారు. మూడేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఏ ఇంటికి వెళ్లినా మంగళ హారతులిచ్చి స్వాగతం పలుకుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు సీఎం జగన్ సంక్షేమ పాలనే నిదర్శనమన్నారు.

పుంగనూరులో పోటీ చేసి గెలవండి....

సీఎం జగనన్న దెబ్బకు చంద్రబాబు కుప్పంలో తిష్ట వేశాడని, అయినా ప్రజల నుంచి ఎటువంటి స్పందన కనిపించక పోవడంతో వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కుప్పం కాకపోతే పుంగనూర్‌లో అయినా పోటీ చేసి గెలవాలని చంద్రబాబుకు సవాల్ విసిరారు. చంద్రబాబుది అంతా మేకపోతు గాంభీర్యమని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల తన పాలన మొత్తం గ్రాఫిక్స్, మైండ్ గేమ్‌తో ప్రజలను తప్పుదారి పట్టించిన చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఇకపై నమ్మే పరిస్థితిలో లేరన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు.

నోరు అదుపులో పెట్టుకోవాలి....

చంద్రబాబు మెప్పు కోసం సీఎం జగన్, ప్రభుత్వంపై బురద చల్లుతూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న ఆ పార్టీ మహిళా నాయకురాళ్లు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేని పక్షంలో వైఎస్సార్ సీపీ మహిళలంతా తగిన గుణపాఠం నేర్పుతారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి హెచ్చరించారు. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగనన్న, వారి రక్షణ, భద్రత కోసం ప్రవేశపెట్టిన దిశ యాప్ ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడారని అన్నారు. కార్పొరేటర్ గోదావరి గంగ, వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, దేరంగుల రమణ, కూరాకుల నాగ, సోమిశెట్టి వెంకటేష్, మద్దిరాల కమలాకర్, బండి కాశేశ్వరరావు, దిద్దుకూరి శివ, కర్నాటి రాంబాబు, యరజర్ల మురళి, కుంభ నాగేశ్వరరావు, వై రవి, నన్నం దుర్గ, ఇలిపిల్లి విజయలక్ష్మి, మదిర ప్రభాకర్, పోలిమెట్ల శరత్, బూదాల శ్రీను, మైలవరపు దుర్గారావు, విశ్వనాధ రవి, వెన్నం రజని, ఎండీ బాషా, కొరగంజి భాను తదితరులు పాల్గొన్నారు.

బీవైడీ ఎలక్ట్రిక్ కార్ షోరూమ్ ప్రారంభం



బీవైడీ ఈ6 కారును ఆవిష్కరిస్తున్న సంజయ్ గోపాలకృష్ణన్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు

రామవరప్పాడు: ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ బీవైడీ డీలర్‌షిప్ షోరూమ్‌ను గురువారం కరెన్సీనగర్‌లో బీవైడీ ఇండియా ఎలక్ట్రిక్ ప్యాసెంజర్ వెహికల్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ గోపాలకృష్ణన్, పీపీఎస్ మోటార్స్ మెనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీవైడీ ఈ6 కారును ఆవిష్కరించారు. సంజయ్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పీపీఎస్ మోటార్స్‌తో కలిసి మొట్టమొదటి షోరూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో పర్యావరణానికి మేలు చేకూర్చే ఎలక్ట్రిక్ వాహనాలదే హవా అన్నారు. వినియోగదారుల అభిరుచి మేరకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బీవైడీ కారు రూపుదిద్దుకుందని వివరించారు. ఒక్కసారి చార్జ్ చేస్తే 500 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుందని తెలిపారు. పీపీఎస్ వైస్ ప్రెసిడెంట్ రంగాచార్యులు మాట్లాడుతూ వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాలపై మక్కువ చూపిస్తున్నారన్నారు. ఈ షోరూమ్‌లో సుశిక్షితులైన కన్సల్టెంటు సేవలు అందిస్తారని తెలిపారు. కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ 29.60 లక్షలుగా ఉందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, షోరూమ్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఎంపీ ధర్మపురి అరవింద్

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎంపీ ధర్మపురి అరవింద్ దంపతులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం , ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు. ఎంపీ వెంట నగరానికి చెందిన పలువుర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):చిట్టీ డబ్బులు కట్టేందుకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఈ నెల 23వ తేదీన చిట్టీ డబ్బులు కట్టేందుకు తన తమ్ముడి వద్ద నుంచి రూ. 1500 తీసుకుని బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బీపీ మండల్ చిరస్మరణీయుడు



బీపీ మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శేషగిరిరావు తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ):బీసీలకు రిజర్వేషన్లు కల్పించటంలో విశేష కృషి చేసిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) చిరస్మరణీయుడని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యాధరపురంలో వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీల అభ్యున్నతికి 1978లో ఏర్పాటు చేసిన కమిషన్‌కు సారథ్యం వహించిన బీపీ మండల్ 1980లో మండల్ కమిషన్ నివేదికను ప్రభుత్వానికి అందించారని తెలిపారు. అయితే అప్పటి ప్రభుత్వాలు దానిని అమలు చేయలేదన్నారు. చివరికి 1990లో మండల్ కమిషన్ నివేదికను అమలు చేస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతో ఆధిపత్య కులాలు ఆందోళనకు దిగాయని గుర్తు చేశారు. 1993లో మండల్ నివేదిక అమలుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో బీసీలకు కేంద్ర సర్వీసుల్లో 27 శాతం రిజర్వేషన్ ఇవ్వటం జరిగిందన్నారు. మొత్తం మీద మండల్ కమిషన్ ద్వారా బీసీల అభివృద్ధికి 40 సూచనలు చేయగా అందులో ఒకటైన విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ మాత్రమే అమలు జరిగిందని వివరించారు. బీసీల అభ్యున్నతికి విలువైన సూచనలు చేసిన బీపీ మండల్ దేశంలోని బీసీలందరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు టీ పూర్ణయ్య, యు ఈశ్వర్ రాజు, ఎన్ శ్రీనివాస్, డీ అంకినీడు, జీ వెంకట్రామయ్య, టీ ప్రమీల, ఎ పార్వతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు



దుర్గా మహాలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్:మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీ రామచంద్రుడుని హరికథా భాగవతారిణి మోపిదేవి దుర్గా మహాలక్ష్మి తెలిపారు. అన్నమయ్య పరివారం (హైదరాబాద్) ఆదిభట్ల నారాయణదాసు శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో సీతారామా కల్యాణ మండపంలో గురువారం ఆదిభట్ల నారాయణ దాసు 158 జయంతి సందర్భంగా హరికథా మహోత్సవాలు నిర్వహించారు. దుర్గా మహాలక్ష్మి పాదుకాపట్టాభిషేకం మధురంగా గానం చేశారు. దశరథుడు పుత్ర సంతానం కోసం పుత్రకామేష్టి యాగం చేయడం, వర ప్రసాదంతో నలుగురు కుమారులు జన్మించడం, శ్రీరామ, లక్షణ, భరత శత్రుఘ్నులుగా నామకరణం చేయడం, విశ్వామిత్రుని వద్ద అస్త్ర, శస్త్ర విద్యలను నేర్చుకోవడం, సీతా కల్యాణం, కైక కోరిక మేరకు శ్రీ రాముడు వనవాసం, శ్రీరామునికి ప్రతినిధులుగా పాదుకలకు పట్టాభిషేకం చేయడం అంశాలుగా కథనం సాగుతుంది. సీతాపహరణం (మెగిలిచర్ల నాగమణి) శ్రీరామ సుగ్రీవమైత్రి (జయంతి సావిత్రి) సుందరా కాండ (బోడిగ లక్ష్మీనారాయణ భాగవతులు), శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం (బుర్రా పద్మనాభ శర్మ), భాగవత, నిర్వాహకులు దుర్గా మహాలక్ష్మితోపాటు పలువురు కథకులను, వాద్యసహకారం అందిచిన వారిని సత్కరించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



చోరీకి యత్నించిన ఏటీఎం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):ఏటీఎంను ధ్వంసం చేసి చోరీకి యత్నించిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణవీధిలో చోటు చేసుకుంది. సెక్యూరిటీ గార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సత్యనారాయణ స్వామి వారి ఆలయం ఆర్చీ ఎదుట ఎస్‌బీఐ ఏటీఎం ఉంది. బుధవారం అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో ఓ వ్యక్తి ముఖానికి మంకీ క్యాప్, ముక్కుకు మాస్క్ ధరించి డబ్బులు డ్రా చేసేందుకు అన్నట్లు ఏటీఎంలోకి వెళ్లాడు. ఆ సమయంలో ఏటీఎంకు బెల్లి వెంకటేశ్వర్లు సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. గార్డు బయట అటు ఇటు తిరుగుతుండగా లోపలకు వెళ్లిన వ్యక్తి పది నిమిషాలు అయినా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి చూశాడు. లోపల ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసేందుకు యువకుడు ప్రయత్నిస్తుండగా, వెంటనే గార్డు ఆ వ్యక్తి బయటకు రాకుండా డోర్ గట్టిగా మూసి పట్టుకున్నాడు. ఇంతలో ఆ విషయం తెలుసుకున్న లోపల యువకుడు తన బలాన్ని అంతా ఉపయోగించి డోర్‌ను స్పీడ్‌గా బయటకు నెట్టడంతో గార్డు కిందపడిపోయాడు. దీంతో కేకలు వేయడంతో యువకుడు పరారు కాగా , స్థానికులు నిద్రలేచి ఏటీఎం వద్దకు చేరుకున్నారు. జరిగిన విషయాన్ని వెంటనే ఏటీఎం నిర్వహణ అధికారులతో పాటు పోలీసులకు సమాచారం అందించాడు.

ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



అధికారులతో కలిసి పరిసరాలు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌ను గురువారం నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎక్సెల్ ప్లాంట్ లోని ట్రాన్స్ ఫర్ స్టేషన్, చెత్త వేయింగ్ మిషన్ పనితీరు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాలువ గట్టు వెంబడి పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. మంచినీరు సక్రమంగా ప్రజలకు అందే విధంగా ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు. సీతారామపురం కొత్తవంతెన రైవస్ కాలువ గట్టు ప్రాంతాలను నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలసి పరిశీలించారు. కాలువ గట్టు వెంబడి చెత్తవేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయా పరిసర ప్రాంతాలలోని సైడ్ డ్రెయిన్ ద్వారా మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఈ పీవీకే భాస్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏ.ఎస్.ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తనా చక్రవర్తి ఆలపాటి



మాట్లాడుతున్న దావులూరి వీరభద్రరావు, వేదికమీద డేవిడ్ రాజు, తదితరులు

విజయవాడ కల్చరల్:సంకీర్తనా చక్రవర్తి ఆలపాటి రామారావని వారి సంగీత సేవలు చిరస్మరణీయమని సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు అన్నారు. బెజవాడ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో గురువారం సంగీత విద్వాంసుడు ఆలపాటి రమారావు సంస్మరణ సభ, సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీరభద్రరావు మాట్లాడుతూ తన సంగీత ప్రదర్శన ద్వారా ఎందరినో ఆకట్టుకున్నారని అనేమ మందికి విద్యాదానం చేశారన్నారు. సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఆలపాటి రామారావుకు నగరంతో విడదీయలేని సంబంధముందని తెలిపారు. బెజవాడ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు సీహెచ్ జయరాజు, మల్లాది స్వాతి, కృష్ణ, శ్రీనివాసరావు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. ఆలపాటి రామారావు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలి



డీలర్లకు సూచనలు ఇస్తున్న ఏడీఏ సునీల్

గన్నవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులు, ఫెర్టిలైజర్స్ డీలర్లు విక్రయాలు జరపాలని వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు ఎం.సునీల్ ఆదేశించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఎరువులు, ఫెర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ప్రతి డీలర్ స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. దుకాణం ఎదుట స్టాక్ బోర్డులను ఏర్పాటు చేసి ఎరువులు, ఫెర్టిలైజర్స్ నిల్వలు, ధరలు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ప్రతి రైతుకు కొనుగోలుకు సంబంధించిన రశీదు ఇచ్చి సంతకం తీసుకోవాలని సూచించారు. ఈ–పాస్ మిషన్ ద్వారా ఎమ్మార్పీకే విక్రయాలు జరిపాలని స్పష్టం చేశారు. డీలర్లు సకాలంలో లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవడంతో పాటు జీరో ఫారమ్ జత చేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన డీలర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్ఎల్ తేజస్వి పాల్గొన్నారు.

అవగాహనతోనే మార్కెటింగ్‌లో రాణింపు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే అందులో అవగాహన అత్యంత అవసరమని ఇండియన్ సర్వీసెస్ సీఈవో సతీష్ అన్నారు. కేబీఎన్ పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మీట్ ది సీఈవో కార్యక్రమాన్ని గురువారం కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు ఏ మార్కెటింగ్ రంగంలో ప్రవేశించాలని భావిస్తున్నారో దానిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కొద్ది కాలం ఆ రంగంలో అనుభవాన్ని సైతం కలిగి ఉన్నప్పుడు మంచి విజయాలను అందిపుచ్చుకోవటానికి అవకాశముంటుందని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, అధ్యాపకులు బి.ప్రభాకర్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ సహకారంతో నగరాభివృద్ధి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తదితరులు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ ఇందిరానాయక్ నగర్ లో రూ. 17.54 లక్షలతో యూజీడీ పైప్ లైన్, భరతమాతకాలనీలో రూ. 9.81 లక్షలతో చేపట్టిన 6 అంతర్గత రహదారుల నిర్మాణ పనులకు డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానికులతో కలిసి గురువారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో 58వ డివిజన్ తీవ్ర నిర్లక్ష్యానికి గురయిందన్నారు.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నగర ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పించేందుకు రూ. వందల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి కేవలం రహదారులకే మూడేళ్లలో రూ.95.13 కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రతి డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. నిర్ణీత కాలవ్యవధిలోగా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. డీఈ (ఇంజినీరింగ్) గురునాథం, ఏఈ అరుణ్ కుమార్, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్.శివాజీ, వేదిక మీద, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు

విజయవాడ కల్చరల్: గణేష్ ఉత్సవాలను ఆదర్శంగా తీసుకోవాలని సామాజికవేత్త పాలూరి శ్రీనివాస్ అన్నారు. శ్రీగణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో గణేష్ ఉత్సవాల ద్వారా తిలక్ చైతన్యం నింపారన్నారు. ప్రముఖ న్యాయవాది వి. జయప్రకాష్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల అనుమతి కోసం ప్రభుత్వం సింగల్ విండో విధానం ప్రవేశపెట్టిందన్నారు. దరఖాస్తు పూర్తి చేసే విధానం, అనుమతులకు ఏయే పత్రాలు అందించాలో వివరించారు. సమస్య ఎదురైతే ఉత్సవ కమిటీలో లీగల్ సెల్ అందుబాటులో ఉందని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు దాసరి ఉమామహేశ్వరరావు, ఔటపల్లి శివప్రసాద్, నాగలింగం శివాజీ ఉత్సవ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వైదిక సంప్రదాయాలను వివరించారు.

క్లుప్తంగా

ఉప రాష్ట్రపతిని కలిసిన ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీనేత, రాజ్య సభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ విషయాన్ని ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేశారు.

ఏఈ పోస్టుల భర్తీకి మళ్లీ పరీక్ష నిర్వహించండి

- తెలుగులో కూడా ప్రశ్నపత్రం ఇవ్వండి
- పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: సహాయ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రశ్నపత్రాలను కేవలం ఇంగ్లిష్‌లోనే ఇవ్వడాన్ని హైకోర్టు తప్పు పట్టింది. ఇది రాజ్యాంగ విరుద్ధమన్న హైకోర్టు.. ఆ పోస్టుల భర్తీకి తిరిగి పరీక్ష నిర్వహించాలని ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించింది. ఏపీపీఎస్సీ 2021, అక్టోబర్‌లో జారీచేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా, 190 పోస్టుల భర్తీకి ఇంగ్లిష్, తెలుగులో ప్రశ్నపత్రం ఇవ్వాలని స్పష్టం చేసింది. భవిష్యత్తులో చేపట్టే నియామక ప్రక్రియలో అధికారభాషా చట్ట నిబంధనల ప్రకారం తెలుగులో కూడా ప్రశ్నపత్రాలు ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు ఇటీవల తీర్పు చెప్పారు. సహాయ ఇంజనీర్ పోస్టుల భర్తీకి సంబంధించి ఇంగ్లిష్‌లోనే ప్రశ్నపత్రం ఇవ్వడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలను విచారించిన న్యాయమూర్తి తెలుగులో ప్రశ్నపత్రాలు ఇస్తూ తిరిగి పరీక్ష నిర్వహించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించారు.

అక్టోబర్ నుంచి ఇండిగో ఎయిర్‌కార్గో సర్వీసులు

సాక్షి, అమరావతి: రాష్ట్రం నుంచి సరుకు రవాణాకు ప్రత్యేకంగా నాలుగు విమాన కార్గో సరీ్వసులు నడిపేందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ ముందుకొచ్చింది. అక్టోబర్ నుంచి తొలి ఎయిర్ కార్గో సర్వీసులు ప్రారంభిస్తామని ఇండిగో ఎయిర్‌లైన్స్ తెలిపినట్లు ఏపీ చాంబర్స్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో ఎయిర్ కార్గో సేవలు, సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిందిగా ఏపీ చాంబర్స్ ప్రతినిధులు ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను కోరగా.. దానికి సానుకూలంగా స్పందించినట్లు చాంబర్స్ ప్రెసిడెంట్ (ఎలెక్ట్) పొట్లూరి భాస్కరరావు తెలిపారు. విశాఖ, విజయవాడ, రాజమండ్రి నుంచి కార్గో సేవలను ప్రారంభిస్తామని, విశాఖ నుంచి ప్రపంచంలోని 27 నగరాలకు సరుకు రవాణా చేసేందుకు ఇప్పటికే నోటిఫై అయ్యిందని, కస్టమ్స్ అనుమతి రాగానే మొదలు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విమానాశ్రయాల్లో శీతలీకరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా చాంబర్స్ ప్రతినిధులు కోరారు.

27 నుంచి ఖేలో ఇండియా మహిళల జూడో టోర్నీ

సాక్షి, అమరావతి: దేశంలో తొలిసారిగా ఖేలో ఇండియా మహిళల జూడో టోర్నీ ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభంకానుంది. జాతీయ రౌండ్ కంటే ముందు ఓపెన్ కాంపిటీషన్ కింద నాలుగు జోన్లలో సబ్ జూనియర్ (12–15 ఏళ్లు), క్యాడెట్ (15–17 ఏళ్లు), జూనియర్ (15–20 ఏళ్లు), సీనియర్ (15 ఏళ్లు పైబడి) విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. టోర్నమెంట్ నిర్వహణ కోసం కేటాయించిన రూ.1.74 కోట్లలో రూ.48.86 లక్షలను ప్రైజ్‌మనీగా ప్రకటించింది. జాతీయ రౌండ్ పోటీలను అక్టోబర్ 20–23 తేదీల్లో న్యూఢిల్లీలోని కె.డి.జాదవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

జోన్‌ల పోటీ షెడ్యూల్

తేదీ	జోన్	వేదిక
ఆగస్టు 27-31	ఈస్ట్	సాయ్ సెంటర్ గౌహతి (అస్సాం)
సెప్టెంబర్ 1-5	సౌత్	వి.కె.ఎన్.మీనన్ స్టేడియం, త్రిసూర్ (కేరళ)
సెప్టెంబర్ 5-9	నార్త్	పెస్టిల్‌వుడ్ స్కూల్, డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్)
సెప్టెంబర్ 11-15	వెస్ట్	సర్దార్ పటేల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (గుజరాత్)

ఓటుకు కోట్లు కేసు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు రూ.కోట్లు కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 2017లో దాఖలు చేసిన ఈ పిటిషన్ గురువారం జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ కృష్ణమురారితో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది రమేష్, తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది ఉదయ్‌కుమార్ సాగర్ విచారణ వాయిదా వేయాలని కోరారు. సెప్టెంబర్ మూడో వారంలో విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. విచారణ తేదీని వెల్లడించాలని చంద్రబాబు తరఫు న్యాయవాది సిద్ధార్థ లూత్రా కోరారు. అది వెంటనే చెప్పలేమని, సెప్టెంబరు 13, 14 తేదీల్లో ఏదో ఒక రోజు విచారణ జాబితాలో చేరుస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

విజయవాడకు తూర్పు మణిహారం



ఎన్‌హెచ్-16పై 40 కి.మీ. తూర్పు బైపాస్ నిర్మాణానికి మార్గం సుగమం

- భూసేకరణ వ్యయానికి ప్రత్యామ్నాయంగా ఎన్‌హెచ్‌ఏఐకి 100 ఎకరాలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం

సాక్షి, అమరావతి: విజయవాడకు తూర్పు మణిహారంగా జాతీయ రహదారికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదనలకు కేంద్ర ఉపరితల రవాణాశాఖ గతంలోనే ఆమోదం తెలిపింది. భూసేకరణ వ్యయానికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) సూత్రప్రాయంగా ఆమోదించడంతో అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. దాదాపు రూ.2 వేల కోట్లతో 40 కిలోమీటర్ల మేర విజయవాడ తూర్పు బైపాస్ మార్గం రూపుదిద్దుకోనుంది. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ తుదిదశకు చేరుకుంది. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధమవుతోంది.

హైవేపై ట్రాఫిక్ కష్టాలకు తక్షణ పరిష్కారం

చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్–16) విజయవాడ నగరంలో నుంచి వెళుతుండటంతో దశాబ్దాలుగా ట్రాఫిక్ సమస్యలు జటిలమవుతూ వస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం ట్రాఫిక్ సమస్యకు తక్షణ పరిష్కారం గురించి యోచించకుండా గ్రాఫిక్కులతో కనికట్టు చేసిన అమరావతిలో ఓఆర్ఆర్ నిర్మించాలని ప్రతిపాదించింది. 30 ఏళ్ల తరువాత ఆ ప్రాంతంలో పెరిగే ట్రాఫిక్ కోసమని ఇప్పుడు పశ్చిమ బైపాస్ నిర్మాణం పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విజయవాడ ట్రాఫిక్ సమస్యలకు తక్షణ పరిష్కారం గురించి యోచించింది. బందరు పోర్టు నిర్మాణం పూర్తయితే పోర్టు నుంచి రాకపోకలు సాగించే భారీ వాహనాలతో విజయవాడ వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రమవుతాయని గుర్తించింది. ఈ సమస్యకు పరిష్కారంగా విజయవాడకు తూర్పు వైపున బైపాస్ రహదారి నిర్మించాలని ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. ఆయన ప్రతిపాదనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడంతో తూర్పు బైపాస్ నిర్మాణం దిశగా ఎన్‌హెచ్‌ఏఐ కార్యాచరణ చేపట్టింది.

కాజ నుంచి చిన అవుటపల్లి వరకు..

జాతీయ రహదారిపై గుంటూరు జిల్లాలోని కాజ నుంచి కృష్ణాజిల్లాలోని కంకిపాడు మీదుగా చిన అవుటపల్లి వరకు నాలుగు లేన్ల బైపాస్ రహదారి నిర్మించాలని నిర్ణయించారు. 40 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ బైపాస్ ప్రాజెక్టులో భాగంగా కృష్ణానదిపై 3,600 మీటర్ల పొడవున వంతెన నిర్మిస్తారు. దాదాపు రూ.2 వేలకోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఈ బైపాస్ నిర్మాణంతో చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై వాహనాలు విజయవాడ నగరంలోకి రాకుండా ప్రయాణిస్తాయి. బందరు పోర్టుకు వెళ్లే, వచ్చే వాహనాలు కూడా విజయవాడ నగరంలోకి రాకుండానే జాతీయ రహదారిపై బైపాస్ మీదుగా అటు చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్‌ల వైపు వెళ్లవచ్చు.

మల్టీమోడల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి 100 ఎకరాలు

బైపాస్ రహదారి నిర్మాణానికి అయ్యే రూ.2 వేలకోట్లలో దాదాపు రూ.525 కోట్లు భూసేకరణ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. రహదారి, వంతెన నిర్మాణాలకు ఎన్‌హెచ్‌ఏఐ నిధులు సమకూరుస్తుంది. భూసేకరణ వ్యయంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పలు ప్రతిపాదనలు సమర్పించింది. జీఎస్టీలో రాష్ట్ర ప్రభుత్వ వాటాను మినహాయించుకుంటామని ప్రతిపాదించింది. అందుకు సమ్మతించిన కేంద్రం భూసేకరణ వ్యయంలో 50 శాతం భరించాలని చెప్పింది. దీనిపైన కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు తెరపైకి తెచ్చింది. అదే సమయంలో ఎన్‌హెచ్‌ఏఐ రాష్ట్రంలో జాతీయ రహదారుల పక్కన మల్టీమోడల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం 100 ఎకరాలను కేటాయిస్తామని ప్రతిపాదించింది. దీనికి బదులుగా విజయవాడ తూర్పు బైపాస్ కోసం భూసేకరణ వ్యయాన్ని కేంద్రమే భరించాలని కోరింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పట్టుబట్టడంతో కేంద్రం ఆమోదించింది. భూసేకరణ వ్యయంతోసహా విజయవాడ తూర్పు బైపాస్ నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా భరించేందుకు సూత్రప్రాయంగా సమ్మతించింది.

గ్రంథాలయాలకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

డాక్టర్ కత్తి పద్మారావు



పొన్నూరు: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ప్రముఖ రచయిత, దళిత ఉద్యమనేత డాక్టర్ కత్తి పద్మారావు కోరారు. గుంటూరు జిల్లా పొన్నూరు అంబేడ్కర్ కాలనీలో గురువారం డాక్టర్ కత్తి పద్మారావును రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు కలిశారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మండలంలో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి, లైబ్రేరియన్‌ను నియమించాలని, విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తద్వారా విద్యారంగం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి గ్రంథాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలు అందుబాటు ఉంచాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కత్తి పద్మారావు ఆలోచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళతానని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.దేవానంద్, డీడీ ప్రసన్నకుమార్, షేక్ పీర్ అహమ్మద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భారతదేశం శ్రామికుడి శక్తి : ప్రధాని

- తిరుమల బాలాజీకి నమస్కరించి పీఎం సందేశం
- కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, భద్రత కల్పిస్తాం



వర్చువల్ విధానంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

తిరుపతి అర్బన్/తిరుపతి కల్చరల్: కార్మికుల సదస్సుకు పవిత్ర స్థలాన్ని వేదిక చేసుకోవడం అభినందనీయమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. తిరుపతి నగరంలోని తాజ్ హోటల్‌లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్, కార్మిక, ఉపాధి కల్పన, పెట్రోలియం, సహజవాయు శాఖల సహాయ మంత్రి రామేశ్వర్ నేతృత్వంలో నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గురువారం వర్చువల్ పద్ధతిలో ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. అనంతరం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సందేశాన్ని తెలియజేశారు. భారతదేశం శ్రామికుల శక్తిగా అభివర్ణించారు. శ్రామికశక్తిని సామాజిక పరిధిలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. కేంద్రం శ్రామికుల సంక్షేమం, భద్రత కోసం ప్రధాన మంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్ యోజన, సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి బీమా యోజన తదితర పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో కోట్లాది మంది కార్మికులు దేశం కోసం నిరంతరం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా ఏడాదికి 28కోట్ల మందికి 400 ప్రాంతాల్లో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. దేశాన్ని ఒక్కటి చేయడంలో కార్మికుల పాత్ర అభినందనీయమన్నారు. గత 8 ఏళ్లగా బానిసత్వం, పూర్వకాలపు చట్టాల రద్దుతోపాటు ఎన్నో మార్పులు తీసుకువచ్చినట్టు చెప్పారు. ప్రధానంగా 29కార్మిక చట్టాలు, 4 సాధారణ చట్టాలుఘబూ మార్పు చేసినట్లు ఆయన వివరించారు. లేబర్ కోడ్స్ ద్వారా కార్మికుల సాధికారత, కనీస వేతనం, సామాజిక భద్రత, ఆరోగ్య భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. విజన్ 2047 నాటికి కార్మికశాఖ ప్రత్యేక ముందుచూపుతో నడుస్తుందని, ఎన్నో మార్పులతో కార్మికుడికి మంచి జరుగుతుందన్నారు. దేశాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్పు చేయడానికి దోహదపడుతుందన్నారు. మహిళా కార్మికశక్తిని పూర్తిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవన కార్మికుల సెస్ వినియోగంపై మాట్లాడుతూ.. దేశంలో పలు రాష్ట్రాలు రూ.38 వేల కోట్లు ఉపయోగించలేదన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మిక శాఖ మంత్రులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల నేతల అరెస్ట్

కేంద్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు తిరుపతిలో నిర్వహిస్తున్న కార్మిక మంత్రుల జాతీయ సదస్సును అడ్డుకునేందుకు ప్రయత్నించిన కార్మిక సంఘాల నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. మాజీ ఎంపీ పి.మధు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ సహా పలువురు నేతలు అరెస్టయిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన

- ఈ ఏడాది 35.05 లక్షల ఎకరాల్లో అమలు
- 14.15 లక్షల మంది రైతులకు ప్రయోజనం



సాక్షి, అమరావతి: మూషికాల ఆట కట్టించేందుకు సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమానికి వ్యవసాయ శాఖ శ్రీకారం చుట్టింది. 2022–23 వ్యవసాయ సీజన్‌లో రూ.1.87 కోట్లతో 35.05 లక్షల ఎకరాల్లో అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాలో 22.72 లక్షల ఎకరాల్లోనూ, రబీలో 12.33 లక్షల ఎకరాల్లో అమలు చేయనున్నారు. ఇందుకోసం ఆర్బీకేల ద్వారా రైతులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఖరీఫ్ సీజన్ కోసం 9,234 కిలోల బ్రోమోడయోలిన్ మందును సిద్ధం చేయగా.. రబీలో 4,866 కిలోలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఉభయ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోనూ అమలు చేస్తుండగా.. రబీలో నవంబర్ నుంచి మార్చి వరకు ఉభయ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, నెల్లూరు జిల్లాల్లో అమలు చేస్తున్నారు.

కార్యాచరణ ఇలా..

- సామూహిక ఎలుకల నిర్మూలన కోసం ఆర్బీకే స్థాయిలో ఈ నెల 26వ తేదీ నుంచి ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నారు.
- ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సామూహికంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు.
- హెక్టార్‌కు 8–10 గ్రాముల ఎలుకల మందును రైతులకు వంద శాతం రాయితీపై పంపిణీ చేస్తారు.
- ఈ మందులో నూకలు, వెజిటబుల్ నూనెను కలిపి ఎలుకల బొరియల్లో ఉంచితే చాలు, తిన్న 4 రోజుల తర్వాత ఎలుకలు చనిపోతాయి.
- వ్యవసాయ క్షేత్రాలతో పాటు సాధారణ స్థలాలు, రోడ్లు, కాలువలు, మురుగు కాలువలు, బీడు, బంజరు, ప్రభుత్వ భూముల్లో కూడా అమలు చేస్తారు.
- ఆర్బీకేల వద్ద విషపు ఎరను తయారు చేసి సాగు విస్తీర్ణాన్ని బట్టి రైతులకు పంపిణీ చేస్తారు.
- విషపు ఎరలకు వ్యవసాయ క్షేత్రాల్లో అయ్యే ఖర్చును రైతులు, బంజరు, ప్రభుత్వ భూముల్లో అయ్యే ఖర్చును పంచాయతీలు భరించాల్సి ఉంటుంది.

నేటి నుంచి ప్రారంభం

ఈ ఏడాది కూడా సామూహిక నిర్మూలనకు ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం ఆర్బీకే స్థాయిలో శుక్రవారం నుంచి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఎలుకల నివారణ మందును ఆర్బీకే ద్వారా రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

గడప గడపన ఘన స్వాగతం



వైఎస్సార్ జిల్లా చాగలేరులో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



కృష్ణా జిల్లా గుడివాడలోని 8వ వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, అమలు చేస్తున్న పథకాలను వివరించి బుక్‌లెట్‌లు, కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అని అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రతి ఇంటి వద్ద ప్రజలు వారికి ఘనంగా స్వాగతం పలికారు. వివిధ పథకాలతో తాము పొందిన లబ్ధి గురించి చెప్పి ప్రభుత్వానికి తాము అండగా ఉంటామని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు తప్పనిసరి

అధికార భాషా సంఘం చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



సాక్షి, అమరావతి: తెలుగు భాష పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని అధికార భాషా సంఘం చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. సచివాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. రెండు దశాబ్దాల తెలుగు భాషాభిమానుల కలైన తెలుగు భాషా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ విశేషమైన అధికారాలతో అన్ని స్థాయిల్లో తెలుగు భాష అమలు తీరును సమీక్షిస్తుందన్నారు. ఇకపై కచ్చితంగా ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగును పాలనా భాషగా అమలు చేయాలని.. నామ ఫల కాలు, బోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, ఇతర ప్రచార అంశాలను తెలుగులోనే నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చామన్నారు. తెలుగును పాలనా భాషగా అమలుకు ప్రజల సహకారం అవసరమన్నారు.

29న తెలుగు భాషా దినోత్సవం

వాడుక భాషా వైతాళికుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి వేడుకల్లో తెలుగు భాషోద్యమకారులు, తెలుగు వికాసం, పరిరక్షణకు కృషి చేసిన 40 మందిని ఘనంగా సత్కరించనున్నట్టు వివరించారు. సన్మాన గ్రహీతలకు ప్రశంసాపత్రంతో పాటు ఒక్కొక్కరికీ రూ.15 వేల నగదు పురస్కారాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో సాహితీ వేత్తలను, భాషాభిమానులను సత్కరిస్తామన్నారు. సాంస్కృతిక శాఖ సీఈవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పోలవరానికి అడ్‌హక్ నిధుల విడుదలకు ఆమోదం

ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధుల భేటీ



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి. పక్కన బుగ్గన

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు అడ్‌హక్ నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం తెలిపిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి తెలిపారు. అలాగే విజయనగరం జిల్లాలో నిర్మించనున్న భోగాపురం విమానాశ్రయానికి రెండు, మూడు రోజుల్లో కేంద్రం నుంచి అనుమతులు రానున్నాయన్నారు. ఏపీ విభజన చట్టంలోని హామీల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ప్రధాని నియమించిన కమిటీ సమావేశం గురువారం ఆర్థిక శాఖ కార్యదర్శి సోమనాథన్ నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎంపీ విజయసాయిరెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఉన్నతాధికారులు కరికాల వలవన్, కృష్ణబాబు, గోపాలకృష్ణ ద్వివేది, ప్రవీణ్ ప్రకాశ్, హిమాన్షు కౌశిక్, రమణారెడ్డి హాజరయ్యారు. అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీపి కబురు అందనుందని తెలిపారు. ఏపీ విభజన చట్టానికి సంబంధించిన అంశాలు పురోగతిలో ఉన్నాయన్నారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించినప్పుడు ప్రధాని మోదీ ఒక కమిటీని నియమించారని గుర్తు చేశారు. ఈ కమిటీ రెండో సమావేశం గురువారం రెండున్నర గంటలకు పైగా సాగిందన్నారు. ప్రధానితో సీఎం జగన్ ఏ అంశాలైతే చర్చించారో అవే అంశాల పరిష్కారానికి ముందుకెళ్లేలా చర్చ జరిగిందని చెప్పారు.

కడప స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కోరాం

'తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏపీకి రావాల్సిన విద్యుత్ బకాయిల గురించి కేంద్ర కమిటీతో చర్చించాం. రేషన్ కార్డుల విషయంలో ఏపీకి అన్యాయం జరిగిందని న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశాం. ఉమ్మడి ఏపీలో పౌర సరఫరాల సంస్థ విభజన అనంతరం ఏపీకి వచ్చింది.. దీంతో రుణ భారం ఆ సంస్థకు ఎక్కువైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ భాగాన్ని ఆ రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరాం. అలాగే కడప స్టీల్ ప్లాంటుకు గనులు కేటాయించాలని విన్నవించాం. బీచ్ శాండ్ మినరల్స్ విషయంలో కేంద్రం నిబంధనల కారణంగా పరిశ్రమలు రావడం లేదని, వాటిని సడలించాలని కోరగా, సానుకూలంగా స్పందించారు. ఏపీలో 26 జిల్లాలను ఏర్పాటు చేశాక 12 జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలు లేవు. వీటిలో ఆరు జిల్లాలు మాత్రమే కేంద్రం నిబంధనలకు అర్హత సాధించాయి. మిగిలిన ఆరు జిల్లాల్లోనూ ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశాం. షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంకుల్లో ఏపీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రుణ ప్రతిపాదనలను అనుమతించాలని కోరాం. దీనిపై రిజర్వ్ బ్యాంక్ అధికారులతో కూలంకషంగా చర్చించాలని సమావేశం నిర్ణయించింది. మొత్తం 11 అంశాలపై ఈ సమావేశంలో చర్చించాం. ఆయా అంశాలకు సంబంధించిన కేంద్ర అధికారులంతా సమావేశానికి హాజరై సానుకూలంగా స్పందించారు. గతానికి, ఇప్పటికి చాలా అంశాల్లో పురోగతి సాధించాం. పోలవరం రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరాం. త్వరలోనే అవి వస్తాయి. పోలవరం ప్రాజెక్టు నిర్దేశిత సమయానికే పూర్తవుతుంది. 14వ ఆర్థిక సంఘం సమయంలో చంద్రబాబు హయాంలో రాష్ట్ర ప్రభుత్వం అతిగా చేసిన అప్పులను రెగ్యులరైజ్ చేయాలని కోరాం. అలాగే రిసోర్స్ గ్యాప్ ఫండ్‌పై కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు.' అని విజయసాయిరెడ్డి చెప్పారు.

చంద్రబాబు వల్లే పోలవరం ఆలస్యం

రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ పోలవరం ఆలస్యానికి కారణం చంద్రబాబేనని ధ్వజమెత్తారు. '2015లో చిత్తశుద్ధి లేకుండా 2013–14 ధరల ప్రకారం, 2010–11 క్వాంటిటీ ప్రకారం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని అవివేకంతో నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు కట్టాలంటే కొన్నేళ్లు పడుతుంది. ఒక సంవత్సరం రేటుకే కట్టుబడి ఉంటే ప్రాజెక్టు ముందుకెలా వెళ్తుంది? దాని లోపాలు తొలగించడానికే ఇంత సమయం పట్టింది. చంద్రబాబు ఇతర రాష్ట్రాల్లో రాజకీయాలు చేసి చేతులు కాల్చుకుని హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చారు. విజయవాడలో కూర్చొని రాష్ట్రానికి సంబంధించినవి అడగలేకపోయారు. కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ తరఫున ఇద్దరు మంత్రుల్ని కూర్చోబెట్టి కూడా పెండింగ్ అంశాలను సాధించలేకపోయారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ చొరవతో ఇవన్నీ పరిష్కారమవుతున్నాయి. ప్రస్తుతం కరోనా వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ ఢిల్లీకి వస్తున్నాం. కేంద్రం దగ్గరకు వచ్చి ఇది మాకు రావాల్సిన సాయం.. ఇది మా హక్కు అని అడుగుతున్నాం. అలా చేస్తున్నాం కాబట్టే ఒక్కొక్కటి పరిష్కారమవుతున్నాయి. ' అని బుగ్గన చెప్పారు.

1న పోలవరంపై కీలక భేటీ

- సీడబ్ల్యూసీ అధికారులతో వర్చువల్‌గా సమావేశం కానున్న రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు
- రూ.10 వేల కోట్లను అడ్‌హక్‌గా ఇవ్వాలన్న ప్రతిపాదనపై చర్చ
- దాని ఆధారంగా కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇవ్వనున్న సీడబ్ల్యూసీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు అడ్‌హక్‌గా రూ.10 వేల కోట్లు ఇవ్వాలన్న ప్రతిపాదనపై చర్చించేందుకు సెప్టెంబర్ ఒకటో తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారులు వర్చువల్‌గా సమావేశం కానున్నారు. ఇందులో చర్చించిన అంశాల ఆధారంగా పోలవరానికి నిధుల విడుదలపై కేంద్ర జల్ శక్తి శాఖకు సీడబ్ల్యూసీ నివేదిక ఇస్తుంది. తర్వాత దీన్ని కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం జల్ శక్తి శాఖ పంపుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదించాక నిధుల విడుదలకు కేంద్ర ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేయడానికి సహాయ, సహకారాలు అందించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు గురువారం ఢిల్లీలో రాష్ట్ర అధికారుల బృందంతో కేంద్ర అధికారుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో 2017–18 ధరల ప్రకారం.. కేంద్ర జల సంఘం సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) నిర్ధారించిన మేరకు రూ.55,656.87 కోట్ల వ్యయాన్ని ఆమోదించి, ఆ మేరకు నిధులు ఇవ్వాలని రాష్ట్ర అధికారులు కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖజానా నుంచి ఖర్చు చేసిన రూ.2,863 కోట్లను రీయింబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడం కోసం రూ.10 వేల కోట్లను అడ్‌హక్‌గా ఇవ్వాలని కోరారు. సహాయ, పునరావాస ప్యాకేజీ కింద నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూపంలో చెల్లించాలన్నారు. రాష్ట్ర అధికారులు చేసిన ఈ ప్రతిపాదనపై జలవనరుల శాఖ అధికారులతో సమావేశమై.. కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీకి కేంద్ర కమిటీ సూచించింది. దీంతో కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు వచ్చే నెల ఒకటిన రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సీడబ్ల్యూసీ అధికారులు వర్చువల్‌గా భేటీ కానున్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం ॥ 26-8-2022

ఫ్యాషన్



ఇంట్లో నిత్యం మన కళ్ల ముందు కనిపించే వస్తువులను పెయింటింగ్ రూపంలో చూసే ఉంటారు. అదే ఎంబ్రాయిడరీ వర్క్‌తో ఎలా ఉంటాయో ఈ బ్లౌజ్ డిజైన్స్ చూస్తే తెలిసిపోతుంది. క్యాలెండర్, కుట్టు మిషన్, రేడియో, కుండల దొంతర.. ఇలా మన కళ్ల ముందు కనిపించే వస్తువులనే కుట్టుపనితో అందమైన డిజైన్లుగా రూపుకట్టవచ్చు చీర కట్టుకు ప్రత్యేక కళ తీసుకురావచ్చు..



వెన్నంటే కళ





చీరకట్టు పాతదే. కానీ, అన్ని డ్రెస్సుల్లోనూ ఎవర్‌గ్రీన్ మార్కులు కొట్టేస్తూ ఎప్పుడూ ఓ ప్రత్యేకమైన కళను సొంతం చేసుకుంటూనే ఉంటుంది. ఏ చిన్న హంగు చేరినా మరింత ఆకర్షణీయంగా మారిపోతుంది. శుభానికి సూచనగా, అపురూపమైన జ్ఞాపకాలను రూపుకట్టేలా చేస్తే ఎక్కడైనా ప్రత్యేకంగా వెలిగిపోతుంది. ఇక దానికి సరికొత్త ఎంబ్రాయిడరీ జత చేరితే అందం, ఆకర్షణ కలబోసుకున్నట్టే.

బ్లౌజ్ డిజైన్లలో బ్యాక్ స్పేస్ పెయింటింగ్‌కి కాన్వాస్‌గానే ఎంబ్రాయిడరీకి ముచ్చటైన వేదికయ్యింది. హైనెక్ బ్లౌజ్ డిజైన్స్‌ని ఇష్టపడేవాళ్లు ఇలా ప్రత్యేకమైన ఎంబ్రాయిడరీ లేదా పెయింటింగ్ లుక్‌తో అదనపు హంగులను చేర్చచ్చు అని నిరూపిస్తున్నారు డిజైనర్లు.









అల్లోల దివ్యారెడ్డి

గోమాత

ఆవు... అమ్మ తర్వాత అమ్మ. పిల్లలకు పాలిచ్చి పోషిస్తుంది. నేలకు సారం... మట్టికి జీవం ఇస్తుంది. పంటకు ప్రాణం... అవుతుంది. అందుకే ఆవు... ఆరాధ్యదైవం అయింది. మనిషి మనుగడకు ఆధారం అయింది. అలాంటి మన ఆవు ప్రమాదంలో ఉంది. ఇప్పుడు ఆవును కాపాడే ఒక అమ్మ కావాలి. ఆ అమ్మ... అల్లోల దివ్యారెడ్డి.

పెట్ రైట్స్ కోసం పోరాటాలు జరుగుతున్నాయి. వన్యప్రాణుల సంరక్షణకు చట్టాలున్నాయి. పులుల సంఖ్యను పెంచడానికి ప్రత్యేక సంరక్షణ చర్యలు తీసుకుంది ప్రభుత్వం. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచమంతా ఉద్యమాలు జరుగుతున్నాయి. మరి పర్యావరణ వ్యవస్థలో మన ఆవులు ఎందుకు స్థానాన్ని కోల్పోతున్నాయి. ఆవును మచ్చిక చేసుకుని అడవి నుంచి ఇంటికి తెచ్చుకున్నారు మన పూర్వికులు. ఇప్పుడవి ఎల్లలు దాటి వెళ్లిపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నాం మనం. ఇప్పుడు కూడా మేల్కొనకపోతే ఆ తర్వాత ఉద్యమించినా ప్రయోజనం ఉండదంటారు అల్లోల దివ్యారెడ్డి. మన దేశీయ ఆవులను సంరక్షించే బాధ్యతను చేపట్టారామె. 'ప్రమాదం అంచున ఉన్న దేశీయ ఆవులను సంరక్షించు కుందాం'... అని పిలుపునిస్తున్నారు. ఇందుకోసం సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. ఈ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ స్టూడెంట్ ఇప్పుడు ఎకలాజికల్ ఇంజనీరింగ్ బాధ్యతను చేపట్టిన ప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారామె.

ఏటూ మిల్క్ మన ఆవులవే!

''మాది తెలంగాణ, సంగారెడ్డి జిల్లా కేంద్రం. పెరిగింది మాత్రం హైదరాబాద్‌లోనే. నాన్న వాటర్ వర్క్స్‌లో ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా రిటైర్ అయ్యారు. నేను ఇంజనీరింగ్ తర్వాత పెళ్లి చేసుకుని, మా వారికి వ్యాపారంలో సహాయంగా ఉన్నాను. అత్తగారిల్లు నిర్మల్. ఇద్దరు పిల్లలతో నాలోకం నాదిగా, పిల్లలను చక్కగా పెంచుకోవడమే తొలి ప్రాధాన్యంగా ఉండేది. అలాంటిది 2014 నన్ను పూర్తిగా మార్చేసింది. అప్పుడు వార్తా పత్రికల్లో, టీవీ చానెళ్లలో పాల కల్తీ గురించి వరుస కథనాలు వచ్చాయి. నా పిల్లలకు తాగిస్తున్న పాలు స్వచ్ఛమైనవి కావా, విషపూరితమైన ఆహారాన్ని పిల్లలకు ఇస్తున్నానా... అని ఎంత ఆవేదన చెందానో మాటల్లో చెప్పలేను. అప్పటి నుంచి స్వచ్ఛమైన ఏటూ (A2) పాల గురించి అధ్యయనం మొదలుపెట్టాను. మన దేశీయ ఆవు ఇచ్చే పాలే ఏటూ మిల్క్ అని తెలిసిన తర్వాత సంతోషం వేసింది. హైదరాబాద్‌లో ఏటూ మిల్క్ కోసం అన్వేషణ మొదలు పెట్టాను. ఆశ్చర్యం... పాలు దొరకనే లేదు. మనం, మన పిల్లలు మాత్రమే కాదు, మన ఆవు కూడా ప్రమాదం అంచున ఉన్నట్లు అప్పుడు తెలిసింది. వెంటనే పది ఆవులతో సంగారెడ్డిలోని మా పొలంలోనే క్లిమామ్ గోశాల మొదలుపెట్టాను. అక్కడి నుంచి మా ఇంటికి నలభై నిమిషాల ప్రయాణం. అప్పటి నుంచి మా పిల్లలు స్వచ్ఛమైన పాలతో పెరుగుతున్నారు. మన దేశీయ గోసంతతి పెంచడానికి నేను చేస్తున్న ప్రయత్నంలో భాగంగా 2015లో పది ఆవులతో మొదలైన గోశాలలో ఇప్పుడు 250 ఉన్నాయి. మా క్లయింట్‌లు చాలా మంది ఇప్పుడు రెండు - మూడు ఆవులను పెంచుకుంటున్నారు. కొంత మంది ఏకంగా వంద ఆవులతో ఫార్మ్ పెట్టారు.

ఆవు నన్ను ఎంచుకుంది!

ఆవుతో కలిసి సాగుతున్న నా జర్నీ అంతటినీ ఓసారి వెనక్కి చూసుకుంటే... గోసేవను ఎంచుకున్నది నేను కాదు, గోవులే నన్ను ఎంచుకున్నాయనిపిస్తోంది. నేను చేస్తున్నదేదీ ముందుగా ప్రణాళిక వేసుకుని మొదలుపెట్టింది కాదు. పాల కల్తీ గురించి తెలిసినప్పటి నుంచి ఒక్కటొక్కటిగా అడుగులు వాటంతట అవే పడుతున్నాయి. ఈ పోరాటంలో విజయం సాధించేవరకు విశ్రమించను. ఆవును నగరాల్లో ఇళ్లకు కూడా పరిచయం చేయడానికి మట్టి గణపతిలో కొద్దిగా గోమయం కలిపి చేస్తున్నాను. గోమయంతో కూడిన మట్టి గణపతి విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేయవచ్చు లేదా కరిగించి ఇంట్లో మొక్కలకు ఎరువుగానూ వేసుకోవచ్చు. మన ఆవు కోసం ఇంకా ఏ ఆలోచన వస్తే దానిని ఆచరణలో పెడుతూ ముందుకు వెళ్తాను. మన జాతీయ చిహ్నంలో ఉన్న ఎద్దు బొమ్మను ఉదహరిస్తూ జాతి సంపదను పరిరక్షించుకుందాం... అని సమాజాన్ని చైతన్యవంతం చేసే ప్రయత్నంలో ఉన్నాను.

– అల్లోల దివ్యారెడ్డి, వ్యవస్థాపకురాలు, క్లిమామ్ గోశాల

దేశ పర్యటన

మూపురం ఉన్న ఆవు మన దేశీయ ఆవు. అలాంటి దేశీయ ఆవుల సంఖ్య పెంచడానికి దాదాపుగా దేశమంతా పర్యటించాను. రైతులతో మాట్లాడాను. ఆవును పెంచడం పాలకోసం అనుకుంటారు, కానీ నిజానికి ఆవు పాలు మనకు బోనస్ మాత్రమే. అసలైన ప్రయోజనం నేలకోసం. నేలను సారవంతంగా ఉంచుకున్నంత కాలమే మనిషికి మనుగడ. వందగ్రాముల ఆవు పేడలో పదిలక్షల సూక్ష్మజీవులుంటాయి. అవి నేలను సజీవంగా ఉంచుతాయి. రసాయన ఎరువులు, పురుగుమందులతో నేలలో ఉండాల్సిన జీవజాలం అంతరించిపోతోంది. ఆవుపేడ ద్వారా వాటిని తిరిగి పొందవచ్చు. అందుకే 'నేల పండాలంటే ఆవు ఉండాలి. అది మన దేశీయ ఆవు అయి ఉండాలి' అంటాను.

సేంద్రియం మనకు కొత్త కాదు!

మన రైతులు సేంద్రియ వ్యవసాయమే చేసేవారు. యాభై – అరవై ఏళ్ల వెనక్కి వెళ్లి చూడండి. వాళ్లకు యూరియాలు, డీఏపీలు తెలియదు. ఆవులు, గేదెల ఎరువుతో సేద్యం చేసుకుంటూ రైతు రాజులాగా జీవించాడు. అలాంటి రైతును అధిక దిగుబడి అంటూ రసాయన ఎరువులతో పక్కదారి పట్టించాం. ఇప్పుడు రైతు ఉన్నంత దీనస్థితిలో మరెవరూ ఉండకపోవచ్చు, వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న ఒడిదొడుకులు మరే పరిశ్రమలోనూ కనిపించవు. ఇప్పుడు మళ్లీ రైతును సేంద్రియం వైపు మళ్లించడానికి వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. గ్రామాల్లో ప్రతి ఇంట్లో కనీసం ఒక్క దేశీయ ఆవు ఉన్నా చాలు, దేశంలో ఆవుల సంతతి పెరుగుతుంది, వ్యవసాయం బాగుపడుతుంది. మనిషి జీవనం గాడిలో పడుతుంది. ఆవులకు కృత్రిమ గర్భధారణను తప్పనడం లేదు, కానీ విదేశీ బ్రీడ్‌తో గర్భధారణను వ్యతిరేకిస్తున్నాను. రెడ్ సింధీ, సహీవాల్, గిర్ వంటి రోజుకు పదిహేను లీటర్ల పాలిచ్చే రకాలున్నాయి. అలాంటి మనదేశీయ జాతితో గర్భధారణ చేసినప్పుడే మన ఆవు మనకు మిగులుతుంది. లేకపోతే శ్రీలంక పరిస్థితి తప్పదు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియాల నుంచి ఆవులను దిగుమతి చేసుకుందా దేశం. సొంత నేల ఆవు జాతులను పట్టించుకోలేదు. చివరికి దిగుమతి చేసుకున్న బ్రీడ్ నిలవలేదు, సొంత బ్రీడ్ అంతరించిపోయిందక్కడ. నేను న్యాయస్థానం మెట్లెక్కింది కూడా ఈ విషయంలోనే. కృత్రిమ గర్భధారణ హైబ్రీడ్‌తో వద్దు, మన దేశీయ జాతులతో చేయాలని న్యాయస్థానాన్ని కోరాను'' అన్నారు అల్లోల దివ్యారెడ్డి. ఇంత పెద్ద బాధ్యతను భుజానికెత్తుకున్నప్పటికీ ఎక్కడా అవరోధాలు లేకుండా ముందుకు సాగడానికి ఇంట్లో అందరి సహకారం ఉందని, కుటుంబ సభ్యుల పట్ల కృతజ్ఞత వ్యక్తం చేశారామె.



ఈ ఏడాది మే నెలలో సుప్రీం కోర్టులో పిల్ వేసిన సందర్భంగా కోర్టు ఆవరణలో...


– వాకా మంజులారెడ్డి
ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

వేడివేడి కరకరలు

ఎప్పుడూ చేసుకునే పకోడి, పునుగులు, బజ్జీలు, వడలు కాకుండా.. దుంపలు, పాలకూర, గుడ్లు, చికెన్‌తో విభిన్నంగా ప్రయత్నించి చూడండి. నోరూరించే క్రంచీ కరకరలు మళ్లీమళ్లీ కావాలనిపిస్తాయి. వీటిని ఎలా చేయాలో చూసేద్దామా మరి...

హరభరా కబాబ్స్



కావలసినవి: **బంగాళ దుంపలు** – ఐదు, **పచ్చిమిర్చి** – నాలుగు, **పచ్చిబఠాణి** – కప్పు, **పాలకూర** – చిన్న కట్టలు రెండు, **కొత్తిమీర తరుగు** – అరకప్పు, **అల్లం వెల్లుల్లి పేస్టు** – ఒకటిన్నర టీస్పూన్లు, **శనగపిండి** – మూడు టేబుల్ స్పూన్లు, **గరం మసాలా** – అర టీస్పూను, **ఆమ్‌చూర్ పొడి** – టీస్పూను, **బ్రెడ్‌ముక్కల పొడి** – పావు కప్పు, **ఉప్పు** – రుచికి సరిపడా, **నూనె** – కబాబ్‌లు వేయించడానికి సరిపడా, **జీడిపప్పు** – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● బంగాళదుంపలను ఉడించి తొక్కతీయాలి. పాలకూరను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి ● శనగపిండిని మంచి వాసన వచ్చేంత వరకు దోరగా వేయించి చల్లారనివ్వాలి ● స్టవ్ మీద బాణలి పెట్టి టీస్పూను నూనె వేయాలి. వేడెక్కిన నూనెలో అల్లంవెల్లుల్లి పేస్టు వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి ● ఇప్పుడు పచ్చిబఠాణి, పచ్చిమిర్చివేసి మగ్గనివ్వాలి ● బఠాణి ఉడికిన తరువాత పాలకూర వేసి ఉడికించాలి ● పాలకూర మగ్గిన తరువాత గరం మసాలా వేసి ఐదునిమిషాలు మగ్గనిచ్చి దించేయాలి. చల్లారాక పేస్టు చేసి పెట్టుకోవాలి ● ఇప్పుడు ఒకగిన్నెలో దుంపలు, పాలకూర పేస్టు, వేయించిన శనగపిండి, కొత్తిమీర, ఆమ్‌చూర్ పొడి, బ్రెడ్ ముక్కల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి చక్కగా కలుపుకోవాలి ● ఈ మిశ్రమం మొత్తాన్ని కబాబుల్లా చేసుకుని, జీడిపప్పుతో గార్నిష్ చేసుకుని గోల్డెన్ బ్రౌన్ కలర్‌లో క్రిస్పీగా మారేంత వరకు ఫ్రై చేసుకుని సర్వ్‌చేసుకోవాలి. కెచప్ లేదా కారంగా ఉండే చట్నీతో హరభర కబాబ్‌లు చాలా బావుంటాయి.

క్రిస్పీ ఛీజ్



కావలసినవి: **మొజారెల్లా చీజ్ అంగుళం ముక్కలు** – వంద గ్రాములు, **చికెన్ ఖీమా** – 300 గ్రాములు, **సేమియా** – కప్పున్నర, **అల్లం తరుగు** – అరటేబుల్ స్పూను, **వెల్లుల్లి తరుగు** – అరటేబుల్ స్పూను, **పచ్చిమిర్చి తరుగు** – టీస్పూను, **పుదీనా తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు, **ఉల్లిపాయ** – ఒకటి (సన్నగా తరగాలి), **కారం** – అరటీస్పూను, **గరం మసాలా** – ఒకటిన్నర టీస్పూను, **గుడ్డు** – ఒకటి, **ఉప్పు** – రుచికి సరిపడా, **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ● చికెన్ ఖీమాను గిన్నెలో వేసి అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, పుదీనా తరుగు, ఉల్లిపాయ ముక్కలు, కారం, రుచికి సరిపడా ఉప్పు, గరం మసాలా, గుడ్డు పచ్చసొన వేసి కలిపి పదిహేను నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● చీజ్‌ముక్కలను ఒక్కొక్కటి స్టిక్‌కు గుచ్చాలి. ఈ చీజ్ స్టిక్‌కు చికెన్ మిశ్రమం కోటింగ్‌లా పట్టించాలి ● కోటింగ్‌కు కొద్దిగా చేతులతో తడిచేసి సేమియాలో ముంచి ఆవిరి మీద పది నిమిషాలపాటు ఉడికించి పక్కన పెట్టుకోవాలి ● ఆవిరి మీద ఉడికించిన చీజ్‌స్టిక్స్‌ను క్రిస్పీగా, గోల్డెన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేసి సర్వ్ చేసుకోవాలి.

చట్‌పటే కోకోనట్



కావలసినవి: **క్యారట్లు** – మూడు, **బంగాళ దుంపలు** – రెండు, **పాలకూర** – కట్ట, **కొత్తిమీర** – చిన్నకట్ట ఒకటి, **పచ్చిమిర్చి** – మూడు, **కారం** – టీస్పూను, **మిరియాల పొడి** – టీస్పూను, **మెంతిపొడి** – టీస్పూను, **మైదా** – ముప్పావు కప్పు, **పచ్చికొబ్బరి తురుము** – రెండు కప్పులు, **గుడ్లు** – మూడు, **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: ●ముందుగా కూరగాయ ముక్కలన్నింటిని ఉడికించి మెత్తగా రుబ్బుకోవాలి ● ఈ మిశ్రమంలో కారం, మిరియాలపొడి, మెంతిపొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలిపి కబాబ్స్‌లా వత్తుకోవాలి ● గుడ్లసొనను ఒక గిన్నెలో వేసి బీట్ చేసి పెట్టుకోవాలి ● ఇప్పుడు కబాబ్స్‌ను ముందుగా గుడ్లసొనలో ముంచి తరువాత మైదా, చివరిగా కొబ్బరి తురుములో ముంచి సన్నని మంట మీద గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేసి పీనట్ సాస్‌తో సర్వ్ చేసుకోవాలి.

బటాడా వడ



కావలసినవి: **బంగాళ దుంపలు** – పావు కేజీ, **పచ్చిమిర్చి** – రెండు, **అల్లం** – అంగుళం ముక్క, **వెల్లుల్లి రెబ్బలు** – నాలుగు, **కొత్తిమీర తరుగు** – రెండు టేబుల్ స్పూన్లు, **ఉప్పు** – రుచికి సరిపడా, **నిమ్మరసం** – పావు టీస్పూను, **పంచదార** – ముప్పావు టీస్పూను, **నూనె** – టేబుల్ స్పూను, **ఆవాలు** – అరటీస్పూను, **జీలకర్ర** – అరటీస్పూను, **పసుపు** – పావు టీస్పూను, **ఇంగువ** – చిటికెడు, **కరివేపాకు** – రెండు రెమ్మలు, **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా. **బ్యాటర్ కోసం: శనగపిండి** – కప్పు, **పసుపు** – పావు టీస్పూను, **కారం** – పావు టీస్పూను, **ఉప్పు** – రుచికి సరిపడా, **బేకింగ్ సోడా** – చిటికెడు.


తయారీ: ● బంగాళ దుంపలను ఉడికించి తొక్క తీసుకోవాలి. ఒక గిన్నెలో వేసి కొత్తిమీర తరుగు, ఉప్పు వేసి మెత్తగా చిదుముకుని పక్కన పెట్టుకోవాలి ● పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి రెబ్బలను కొద్దిగా నీళ్ల వేసుకుని పేస్టుచేసి పెట్టుకోవాలి ● స్టవ్ మీద బాణలి పెట్టి టేబుల్ స్పూను నూనె వేయాలి. వేడెక్కిన నూనెలో ఆవాలు, జీలకర్ర వేసి చిటపడలానివ్వాలి. తరువాత పసుపు, చిటికెడు ఇంగువ వేసి కలపాలి ● తిప్పిన వెంటనే పచ్చిమిర్చి పేస్టు, కరివేపాకు వేసి పచ్చివాసన పోయేంతవరకు వేయించాలి ● ఇవన్నీ చక్కగా వేగాక చిదిమిపెట్టుకున్న దుంపల మిశ్రమం, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● చివరిగా నిమ్మరసం, పంచదార వేసి నిమిషం పాటు మగ్గనిచ్చి దించేయాలి ● ఈ మిశ్రమం చల్లారాక ఉండలుగా చుట్టి పక్కన పెట్టుకోవాలి ● బ్యాటర్ కోసం తీసుకున్న పదార్థాలన్నింటిని గిన్నెలో వేసి కాసిన్ని నీళ్లపోసుకుని గరిటజారుగా కలిపి పక్కన పెట్టుకోవాలి ● దుంపల ఉండలను బ్యాటర్లో ముంచి లేతబంగారు వర్ణంలోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేసి సర్వ్ చేసుకోవాలి. ● వేయించిన పచ్చిమిర్చి, కొబ్బరి చట్నీతో ఈ వడలు చాలా బావుంటాయి.

యువర్స్

● బ్రెయిన్ జిమ్

ఫటాఫట్ ధనాధన్


ప్రశ్న స్థానంలో ఉండాల్సిన సంఖ్య ఏమిటి? ఎందుకు?



జవాబు:
ఒకటి: 10+10+10=30
(ఒక గాలం విలువ పది)
రెండు: 10+1+1=12 (ఒక చేప విలువ 1)
మూడు: 7+7+1=15
(ఫిషింగ్ హుక్ విలువ 7)
నాలుగు: 9×2+14 =32
ఇక్కడ గాలం విలువ 9 కావడానికి కారణం... పై వాటిలోలాగా చేప లేదు. చేపలు రెండు, ఫిషింగ్ హుక్‌లు రెండు ఉండడం వల్ల 2, 14 వచ్చింది.

● ఆర్ట్ అండ్ కల్చర్

నీ కోపమే నీకు విలన్



'కోపం పాప కారణం' అనడంతో పాటు 'తన కోపమే తనకు శత్రువు' అని కూడా అంటారు. ఇరాన్ కార్టూనిస్ట్, ఇలస్ట్రేటర్ మెహ్‌సెన్ జరిఫియన్ గీసిన ఈ కార్టూన్‌ను చూస్తే 'నిజమే సుమీ' అనిపిస్తుంది. యవ్వనానికి కోపం అనేది కొద్ది దూరంలోనే ఉంటుంది. 'యూత్ అంటే ఆ మాత్రం ఫైర్ లేకపోతే ఎలా!' అనుకుంటే ఆ ఫైర్ మనల్నే కాల్చే ప్రమాదం లేకపోలేదు. మన ఆవేశం, కోపం, ప్రేలాపనల వల్ల అవతలి వ్యక్తికి ఎంత నష్టం వాటిల్లిందనేది పక్కన పెడితే...మనకు జరిగే నష్టం తక్కువేమీ కాదు. కావున.. బీకేర్‌ఫుల్, బీకూల్.

● సక్సెస్ స్టోరీ



కల్యాణ్ శివశైలం

5 స్టార్

సమస్య ఎదురైనప్పుడు నిట్టూర్చేవారు బోలెడు మంది. ఆ సమస్యను నిట్టనిలువునా నిలదీసి, విశ్లేషించి పరిష్కారం సాధించేవారు కొద్దిమంది. వీరినే విజేతలు అంటారు. కల్యాణ్ శివశైలం ఈ కోవకు చెందిన యువకుడు. క్లౌడ్-బేస్డ్ ప్లాట్‌ఫామ్ '5సి నెట్‌వర్క్స్'తో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న కల్యాణ్ గురించి...

అవసరాల నుంచి ఆవిష్కరణలు పుడతాయి... అనే మాటను కల్యాణ్ శివశైలం విషయంలో మరోసారి గట్టిగా నమ్మవచ్చు. కొన్ని సంవత్సరాల క్రితం కల్యాణ్ స్నేహితుడు అనారోగ్యంతో హాస్పిటల్‌లో చేరాడు. ఎంఆర్ఐ రిపోర్ట్ కోసం రెండు రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది.

చికిత్సలో రిపోర్ట్ కీలకం కదా!

'ఎందుకు ఈ ఆలస్యం?' అనే ఆలోచనకు కల్యాణ్‌లో ఆరోజే బీజం పడింది.

అది ఒక రూపం తీసుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

స్నేహితుడు అహ్మద్‌తో కలిసి బెంగళూరు కేంద్రంగా '5సి నెట్‌వర్క్' పేరుతో హెల్త్‌టెక్ స్టార్టప్ స్టార్ట్ చేశాడు. ఊహించినట్లుగానే సూపర్ హిట్ అయింది.

ఈ క్లౌడ్‌బేస్డ్ ప్లాట్‌ఫామ్ 42 నిమిషాల్లోనే రేడియాలజీ టెస్ట్ రిజల్ట్‌ను తెలియజేస్తుంది. ఈ రిజల్ట్‌ను మరో రేడియాలజిస్ట్ క్రాస్ చెక్ చేస్తాడు. కచ్చితమైన ఫలితాల కోసం ఏఐ మోడల్‌ను ఉపయోగిస్తారు.

'5సి నెట్‌వర్క్' దేశవ్యాప్తంగా ఎన్నో హాస్పిటల్స్, డయాగ్నొస్టిక్ సెంటర్‌లు, ఎంతో మంది రేడియాలజిస్ట్‌లతో అనుసంధానమై పని చేస్తుంది.

దేశంలోఎంతమంది రేడియాలజిస్ట్‌లు ఉన్నారు అనే విషయం కంటే, సమర్థవంతమైన రేడియాలజిస్ట్‌లతో కలిసి పనిచేయడానికి తొలి ప్రాధాన్యత ఇచ్చింది 5సి నెట్‌వర్క్. 'యాక్సెస్ టు క్వాలిటీ రేడియాలజిస్ట్'ను తన విధానంగా ఎంచుకుంది.

'5సి నెట్‌వర్క్' వల్ల గతంతో పోల్చితే రేడియాలజిస్ట్‌లు రెండింతలు ఎక్కువ సంపాదించే అవకాశం ఏర్పడింది. చిన్న క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ సెంటర్‌లకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

కంపెనీ మొదలు పెట్టిన కొత్తలో నెలకు 26 రేడియాలజీ రిపోర్ట్‌లు వెలువరించేవారు. ఇప్పుడు ఆ సంఖ్య వేలలో ఉంది.

తమ తొలి క్లయింట్ మైసూర్‌లోని సీఎస్ఐ హాస్పిటల్.

'పే-పర్-యూజ్ బిజినెస్ మోడల్'తో నిర్వహించబడుతున్న '5సి నెట్‌వర్క్' అంతర్జాతీయ స్థాయిలో విస్తరించాలనేది భవిష్యత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఎన్నో దేశాల్లో కంపెనీకి అనువైన వాతావరణం ఏర్పడింది.

మంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ)లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ చదువుకున్న కల్యాణ్‌కు 'సమస్య' గురించి విచారించడం కంటే విశ్లేషించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం అలవాటు. విశ్లేషణలోనే అతనికి పరిష్కారాలు దొరికేవి.

అది ఇంటికి సంబంధించిన చిన్న సమస్యలు కావచ్చు. చదువుకు సంబంధించినవి కావచ్చు. ఇప్పుడు అదే పాఠాలు తన జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేలా చేసింది.

పాతికేళ్ల వయసులో స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాడు కల్యాణ్.

'కుర్రాడు ఏదో చెబుతున్నాడు. రిస్క్ ఎందుకులే' అని అవతలి వాళ్లు అనుకునే వయసు అది. మరి ఆ వయసులోనే పెద్ద పెద్ద ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చలు జరపడం, చేయి తిరిగిన రేడియాలజిస్ట్‌లతో చేయి కలపడం, తన ప్రాజెక్ట్‌కు ఓకే చేయించుకోవడం అంత తేలికైన విషయం కాదు. నిర్లక్ష్యం, అసహనం...మొదలైనవి తనకు ఎదురయ్యే ఉంటాయి. అయితే వాటి గురించి కల్యాణ్ ఎక్కడా ప్రస్తావించలేదు.

విజయంలో హాయిగా తేలిపోతున్నప్పుడు, ఆ బరువు ఎందుకు అనుకున్నాడేమో!

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్‌లో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా చదువుకున్న కల్యాణ్‌కు శాస్త్రీయ విషయాలపైనే కాదు న్యాయ సూత్రాలపైన కూడా మంచి అవగాహన ఉంది. ఇది తన వ్యాపారానికి ప్లస్ అవుతుంది కూడా.

ప్రతి సంస్థకు తనదైన యుఎస్‌పీ ఉంటుంది. మరి '5సి నెట్‌వర్క్స్' యుఎస్‌పీ ఏమిటి?

కల్యాణ్ శివశైలం మాటల్లోనే చెప్పాలంటే...

'కాంబినేషన్ ఆఫ్ టెక్నాలజీ, సుపీరియర్ సర్వీస్ లెవెల్స్'

'5సి' పరుగు చూస్తుంటే అది అక్షరాలా నిజమే అనిపిస్తుంది!

● టెక్.టాక్

గూగుల్‌టెల్లర్



రోజూ ఏదో ఒక రకంగా గూగుల్‌తో మనకు పని ఉంటుంది. అయితే ట్విట్టర్, యాపిల్, ఫేస్‌బుక్...మొదలైన బిగ్‌టెక్ కంపెనీలతో పోల్చితే గూగుల్ ద్వారానే మన వ్యక్తిగత డేటా ఎక్కువగా ట్రాక్ అవుతుందని తాజా అధ్యయనం ఒకటి చెప్పింది. మన వ్యక్తిగత డేటాను గూగుల్ ఏ మేరకు ట్రాక్ చేస్తుందో తెలుసుకోవడానికి బెర్ట్ హబెర్ట్ అనే డెవలపర్ 'గూగుల్‌టెల్లర్' అనే యాప్‌ను క్రియేట్ చేశాడు. డేటాను యూజర్ కంప్యూటర్ గూగుల్‌కు పంపుతున్న ప్రతిసారి 'గూగుల్‌టెల్లర్' బీప్ సౌండ్ ఇస్తుంది. ఆసక్తి ఉన్నవారు దీన్ని ఫ్రీగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతం దీన్ని లైనక్స్-బేస్డ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ (డెబియన్, ఆర్చ్, ఫెడోరా...మొదలైనవి) కోసం మాత్రమే డిజైన్ చేశారు.

వాట్సాప్‌లో కొత్త ఫీచర్‌లు



ఇన్‌స్టంట్ మెసేజింగ్ అప్లికేషన్ వాట్సాప్ సరికొత్త ప్రైవసీ ఫీచర్లను ప్రవేశపెట్టింది. అవి: లీవ్ గ్రూప్స్ సైలెంట్లీ, చూజ్ హు కెన్ సీ వెన్ యూ ఆర్ ఆన్‌లైన్, స్క్రీన్‌షాట్ బ్లాకింగ్ ఫర్ వ్యూ వన్స్ మెసేజెస్, డిసప్పియరింగ్ డబుల్ ఎన్‌క్రిప్టెడ్ బ్యాకప్స్, డిజప్పియరింగ్ మెసేజెస్, బ్లాక్ అండ్ రిపోర్ట్, టు-స్టెప్ వెరిఫికేషన్. వీటి గురించి రాబోయే రోజుల్లో షార్ట్‌ఫిల్మ్స్ ద్వారా వాట్సాప్ ప్రచారం నిర్వహించనుంది.

● గేమింగ్



రణక్షేత్రంలో క్షణక్షణం

మిత్రులారా, రణక్షేత్రంలోకి అడుగుపెట్టడానికి ముందు క్షణకాలం ఆలోచించండి. మీ బలాన్ని అంచనా వేసుకొని ముందుకు కదలండి. మీ ప్రాంతంలో శాంతి నెలకొల్పడానికి బలమైన సైన్యం తయారుచేసుకోవాలి. పట్టణాన్ని విస్తరించాలి. కళ్లు మూసి కళ్లు తెరిసే లోపు, కదనరంగంలో వ్యూహాలకు పదును పెట్టాలి. అదును చూసి శత్రువును అంతం చేయాలి. ప్లేయర్స్‌గా ఇవి చేయడానికి మీకు ఆసక్తిగా ఉందా? అయితే 'ది డ్రాగనెస్: కమాండ్ ఆఫ్ ది ఫ్లేమ్' మీ కోసం ఎదురు చూస్తుంది. ఈ హీరోస్ ఆఫ్ మైటీ అండ్ మ్యాజిక్ ఇన్‌స్పైర్ గేమ్ వచ్చే నెల 1న విడుదల అవుతుంది. గత నెలలో విడుదలైన స్టోరీ ట్రైలర్ ఆకట్టుకుంది.

ప్లాట్‌ఫామ్స్: పీసీ, **జానర్స్:** ఆర్‌పీజీ, స్ట్రాటజీ, రోగ్-లైట్

పుట్ ఏ టైగర్ ఇన్ ది ట్యాంక్

ENGLISH ఇడియమ్స్

శక్తిమంతంగా పనిచేయండి, ఉత్సాహం ఉరకలు వేయాలి, సంకల్పబలం కనిపించాలి...ఇలా ఎవరినైనా వెన్నుతట్టే సమయంలో ఉపయోగించే ఇడియమ్ 'పుట్ ఏ టైగర్ ఇన్ ది ట్యాంక్' **ఉదా:** ఆల్ దీజ్ షాట్స్ ఆఫ్ ఎగ్జాయిట్‌మెంట్స్ విల్ హెల్ప్ పుట్ ఏ టైగర్ ఇన్ దేర్ ట్యాంక్

దీని మూలాల్లోకి వెళితే... 1880లో లండన్‌లో ప్రారంభం అయిన ఎసో ఆయిల్ కంపెనీ ఆ తరువాత అమెరికాలో కూడా సత్తా చాటింది. 1960లో తమ కంపెనీ గురించి 'పుట్ ఏ టైగర్ ఇన్ యువర్ ట్యాంక్' థీమ్‌తో వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేసింది. ఇది బాగా క్లిక్ అయింది. ఎమ్రీ స్మీత్ దీనికి రూపకల్పన చేశారు. ఆ తరువాత 'పుట్ ఏ టైగర్..'ను ఇతరులలో ఉత్సాహం, ధైర్యం నింపడం....మొదలైన సందర్భాలలో వాడడం మొదలైంది.




సినిమా

వచ్చే నెలలో వైజాగ్‌లో...

హీరో రామ్‌చరణ్- డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కియారా అద్వానీ కథానాయిక. 'దిల్' రాజు నిర్మిస్తున్న ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ని సెప్టెంబరులో ఆరంభించనున్నట్లు అప్‌డేట్ ఇచ్చారు శంకర్. ఈ మేరకు ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. టాలీవుడ్‌లో ఆగస్టు 1 నుంచి షూటింగ్‌లు బంద్ కావడంతో ఈ సినిమా షూటింగ్ కూడా ఆగింది. సెప్టెంబర్ 1నుంచి తిరిగి షూటింగ్‌లు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే రామ్‌చరణ్-శంకర్ సినిమా కూడా రీ స్టార్ట్ కానుంది. ''ప్రస్తుతం కమల్‌హాసన్‌తో 'ఇండియన్ 2, రామ్ చరణ్‌తో 'ఆర్‌సి 15' సినిమాలు చేస్తున్నాను. ఈ రెండు చిత్రాల షూటింగ్స్‌ను పర్ఫెక్ట్‌గా ప్లాన్ చేశాం. 'ఆర్‌సి 15' తర్వాతి షెడ్యూల్ హైదరాబాద్, వైజాగ్‌లో జరగనుంది. సెప్టెంబర్ తొలి వారంలోనే షూటింగ్ ఆరంభిస్తాం'' అని శంకర్ ట్విట్టర్ ద్వారా తెలియజేశారు.



● రామ్‌చరణ్



● నాగార్జున

వదిలేసి పారిపోండి

''ఊటీ నుంచి ఫోనొచ్చింది' అనే నాగార్జున డైలాగ్‌తో 'ది ఘోస్ట్' సినిమా ట్రైలర్ రిలీజైంది. అక్కినేని నాగార్జున, సోనాల్ చౌహాన్ జంటగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ది ఘోస్ట్'. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు, శరత్ మరార్ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 5న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో మహేశ్‌బాబు విడుదల చేశారు. 'నువ్వు, నీ కూతురు బతికుండాలంటే అన్నీ వదిలేసి పారిపోండి', 'చావును చాలాసార్లు చాలా దగ్గరగా చూశాను ప్రియ' అంటూ నాగార్జున చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. పవర్‌ఫుల్ ఇంటర్‌పోల్ ఆఫీసర్ విక్రమ్‌గా కనిపించబోతున్నారు నాగార్జున'' అని చిత్రబృందం పేర్కొంది. గుల్ పనాగ్, అనిఖా నటించిన ఈ చిత్రానికి కెమెరా: ముఖేష్ జి., సంగీతం: మార్క్ కె. రాబిన్

మారుతి కన్ఫార్మ్



● ప్రభాస్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో ఓ సినిమా రూపుదిద్దుకోనుందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ వార్తలు నిజమే. ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లోని సినిమా ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ చిత్ర నిర్మాణసంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కార్యాలయంలో పూజా కార్యక్రమాల జరిగాయి. ఇటలీలో ఉండటంవల్ల ప్రభాస్ ఈ ప్రారంభోత్సవంలో పాల్గొనలేదు. హారర్-కామెడీ జానర్‌లో తెరకెక్కనున్న ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారని, 'రాజా డీలక్స్' అనే టైటిల్ అనుకుంటున్నారనే ప్రచారం వినిపిస్తోంది. మరోవైపు ఇప్పటికే 'సలార్', 'ప్రాజెక్ట్ కె' చిత్రాలు చేస్తున్నారు ప్రభాస్. అలాగే ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' చిత్రం వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఇక 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ 'స్పిరిట్' చిత్రం చేయనున్న సంగతి తెలిసిందే.

ప్రేమకథ ఆరంభం



● హెబ్బా, దినేష్, పాయల్, ఆంజనేయులు


'హుషారు' ఫేమ్ దినేష్ తేజ్ హీరోగా, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా 'అలా నిన్ను చేరి' సినిమా గురువారం ప్రారంభమైంది. మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి మండడి కిషోర్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు క్లాప్ కొట్టారు. ''రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న చిత్రమిది. సెప్టెంబర్ 5న షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. డైరెక్టర్, కెమెరామేన్ 'గరుడవేగ' అంజి, 'హుషారు' ఫేమ్ తేజస్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కర్నాటి రాంబాబు, సంగీతం: సుభాష్ ఆనంద్, కెమెరా: పీజీ విందా.

వాంగ... వణక్కం!

బాలీవుడ్ హీరోలు కొందరు తమిళం నేర్చుకునే పనిలో ఉన్నారు. కానీ వారు తమిళ సినిమాల్లో నటించడం లేదు. మరి ఎందుకు భాష నేర్చుకుంటున్నారంటే తమిళ దర్శకులతో సెట్స్‌లో కమ్యూనికేషన్ కోసం అన్నమాట. ఎందుకంటే ఆ తమిళ దర్శకులతో ఈ హీరోలు 'వాంగ వణక్కం' (రండి.. నమస్కారం) అంటూ హిందీ సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ డైరెక్టర్లు-బాలీవుడ్ హీరోల కాంబినేషన్ చిత్రాల గురించి తెలుసుకుందాం.



● సల్మాన్



● రణ్‌వీర్

బాలీవుడ్ అగ్ర హీరోల్లో ఒకరైన షారుక్ ఖాన్ ప్రస్తుతం మూడు (పఠాన్, జవాన్, డంకీ) సినిమాలు చేస్తున్నారు. వీటిలో 'జవాన్' సినిమాకు అట్లీ దర్శకుడు. తమిళంలో 'రాజా రాణి', 'తేరి', 'మెర్సెల్', 'బిగిల్' వంటి హిట్ చిత్రాలను అట్లీ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. హిందీలో అట్లీకి 'జవాన్' తొలి చిత్రం. అలాగే ఈ చిత్రంలో హీరోయిన్‌గా అగ్రతార నయనతార నటిస్తున్నారు. హిందీలో నయనతారకు కూడా 'జవాన్' తొలి చిత్రం కావడం ఓ విశేషం. 'జవాన్' చిత్రం వచ్చే ఏడాది జూన్‌లో రిలీజ్ కానుంది. ఇంకోవైపు తమిళ దర్శకుడు శంకర్‌తో సినిమాకి సై అన్నారు రణ్‌వీర్ సింగ్. 2005లో శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'అన్నియన్' (తెలుగులో 'అపరిచితుడు') మంచి విజయం సాధించింది. పదిహేను సంవత్సరాల తర్వాత ఈ సినిమాను హిందీలో రీమేక్ చేస్తున్నట్లుగా ప్రకటించారు దర్శకుడు శంకర్. ఈ సినిమా షూటింగ్ ఈపాటికే ఆరంభం కావాల్సింది కానీ 'అన్నియన్' హిందీ రీమేక్ హక్కుల విషయంలో చిన్న వివాదం నడుస్తోంది. ప్రస్తుతం కమల్‌హాసన్‌తో శంకర్ 'ఇండియన్ 2', రామ్‌చరణ్‌తో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాల చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చాక శంకర్ 'అన్నియన్' హిందీ రీమేక్‌ను ఆరంభిస్తారని ఊహించవచ్చు. దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత హిందీలో శంకర్ చేయనున్న సినిమా ఇదే కావడం విశేషం. గతంలో 'ఒకే ఒక్కడు'ని హిందీలో 'నాయక్' (2001)గా తెరకెక్కించారు శంకర్. ఇక 2017లో విడుదలైన 'విక్రమ్ వేదా' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. పుష్కర్-గాయత్రి ద్వయం ఈ సినిమాను తెరకెక్కించారు. ఇప్పుడు ఈ చిత్రం హిందీలో రీమేక్ అయ్యింది. సైఫ్ అలీఖాన్, హృతిక్ రోషన్ హీరోలుగా నటించారు. తమిళ 'విక్రమ్ వేదా'కు దర్శకత్వం వహించిన పుష్కర్-గాయత్రి ద్వయమే హిందీ రీమేక్‌నూ తెరకెక్కించారు.



● 'జవాన్'లో షారుక్



● విక్రమ్ వేదా'లో హృతిక్, సైఫ్

పుష్కర్-గాయత్రి ద్వయానికి హిందీలో ఇదే తొలి సినిమా. ఈ సినిమా ఈ ఏడాది సెప్టెంబరు 30న విడుదల కానుంది. మరోవైపు తక్కువ టైమ్‌లో కోలీవుడ్‌లో స్టార్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ హిందీలో ఓ సినిమా చేయనున్నారని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్‌తో లోకేశ్ కనగరాజ్ ఓ సినిమా (తమిళ సినిమా 'మాస్టర్' హిందీ రీమేక్) చేయాల్సింది. కానీ కుదర్లేదు. అయితే సల్మాన్‌తో లోకేశ్ వేరే ఓ సినిమా చేయనున్నారని కోలీవుడ్ టాక్. ఇంకోవైపు రజనీకాంత్‌తో 'కబాలి', 'కాలా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన పా. రంజిత్ హిందీలో ఓ సినిమా కమిట్ అయ్యారు. జార్ఖండ్‌కు చెందిన ట్రైబల్ ఫ్రీడమ్ ఫైటర్ బిర్సా జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఎవరు హీరోగా నటిస్తారు? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, 'జై భీమ్' సినిమాతో ప్రతిభగల దర్శకుడిగా పేరు తెచ్చుకున్న టీజే జ్ఞానవేల్ రాజా హిందీలో ఓ సినిమా చేయనున్నారు. 'దోసా కింగ్'గా చెప్పుకునే పి. రాజగోపాల్ జీవితంలోని ముఖ్య ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. రాజగోపాల్, జీవ జ్యోతి శాంతకుమార్‌ల కోర్టు కేసు ప్రధానాంశంగా ఈ సినిమా రూపొందనుంది. వీరితోపాటు మరికొందరు తమిళ దర్శకులు హిందీలో సినిమాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆలోచింపజేసే చిత్రమిది - సునీల్



● హెబ్బా, సునీల్, రాచయ్య

''గీత' వంటి సందేశాత్మక కథా చిత్రంలో నటించినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా ప్రతి ఒక్కర్నీ ఆలోచింపజేసేలా చేస్తుంది. దర్శకుడుగా విశ్వ, నిర్మాతగా రాచయ్యలకు మంచి భవిష్యత్ ఉంటుంది'' అని సునీల్, హెబ్బా పటేల్ అన్నారు. వీవీ వినాయక్ శిష్యుడు విశ్వ దర్శకత్వంలో ఆర్. రాచయ్య నిర్మించిన చిత్రం 'గీత'. 'మ్యూట్ విట్‌నెస్' అన్నది ఉపశీర్షిక. హెబ్బా పటేల్ టైటిల్ రోల్ చేసిన ఈ చిత్రంలో సునీల్ ముఖ్య పాత్రలో, సాయికిరణ్ విలన్‌గా నటించారు. ఈ సినిమా సెప్టెంబర్ 9న విడుదల కానుంది. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆర్. రాచయ్య మాట్లాడుతూ– ''గురువుకు తగ్గ శిష్యుడు అనిపించుకునేలా మా డైరెక్టర్ విశ్వ 'గీత' చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. మా సినిమా ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది'' అన్నారు. ''దర్శకునిగా అవకాశం ఇచ్చిన రాచయ్యగారికి రుణపడి ఉంటాను'' అన్నారు విశ్వ. ఈ వేడుకలో మాజీ మంత్రి పి. రామసుబ్బా రెడ్డి, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, కెమెరామేన్ క్రాంతికుమార్, డిస్ట్రిబ్యూటర్స్ పాలిశెట్టి, డీవీడీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▼ 311	59,773
నిఫ్టీ ▼ 82	17,522

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్డాక్	12,562	▲	130
డోజోన్స్	33,039	▲	70
ఎఫ్టీఎస్ఈ 100	7,480	▲	8
డాక్స్	13,272	▲	52
షాంఘై	3,246	▲	31
నికాయ్	28,479	▲	166

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

భారతీ టెలికంకు సింగ్‌టెల్ వాటా

3.33 శాతం వాటా కొనుగోలుకు రెడీ

న్యూఢిల్లీ: ప్రమోటర్ భారతీ టెలికం.. కంపెనీలో సింగ్‌టెల్‌కు గల 3.33 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ తాజాగా పేర్కొంది. మాతృ సంస్థ భారతీ టెలికం ఈ వాటాను 90 రోజుల్లోగా సొంతం చేసుకోనున్నట్లు తాజాగా తెలియజేసింది. ఇందుకు 2.25 బిలియన్ సింగపూర్ డాలర్ల(రూ. 12,895 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. కాగా.. భారతీ టెలికంలో భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ మిట్టల్ కుటుంబంతోపాటు, సింగ్‌టెల్ సైతం ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ లావాదేవీ తదుపరి భారతీ ఎయిర్‌టెల్‌లో సింగ్‌టెల్ గ్రూప్ వాటా 29.7 శాతానికి చేరనుంది. రెండు సంస్థల మధ్య ఈ లావాదేవీ పూర్తయ్యాక ఎయిర్‌టెల్‌లో భారతీ టెలికం ప్రధాన వాటాదారుగా కొనసాగనున్నట్లు సునీల్ మిట్టల్ పేర్కొన్నారు.

హీరో ఎలక్ట్రిక్, జియో–బీపీ జోడీ

న్యూఢిల్లీ: హీరో ఎలక్ట్రిక్ తాజాగా జియో–బీపీతో చేతులు కలిపింది. ఇందులో భాగంగా జియో–బీపీ కేంద్రాల్లో ఉన్న చార్జింగ్, స్వాపింగ్ సౌకర్యాలను హీరో ఎలక్ట్రిక్ కస్టమర్లు ఉపయోగించుకోవచ్చు. జియో–బీపీ పల్స్ యాప్ ద్వారా చార్జింగ్ సెంటర్లు ఎక్కడ ఉన్నాయో వినియోగదార్లు తెలుసుకోవచ్చు.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	52,094	▲	464
బంగారం (99.5 స్వచ్ఛత)	51,885	▲	462
వెండి (కిలో)	55,883	▲	659

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-8-2022	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
25-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	417-00
వరంగల్	418-00
రిటైల్ ధర	4.75

ఇండియా పోస్ట్ భారీ విస్తరణ

- కొత్తగా 10,000 శాఖలు...
- ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభం



న్యూఢిల్లీ: ఇంటి వద్దకే సేవలను అందించడం లక్ష్యంగా ఇండియా పోస్ట్ భారీ విస్తరణ దిశగా అడుగులేస్తోంది. దేశవ్యాప్తంగా కొత్తగా 10,000 శాఖలను తెరవనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ మేరకు అనుమతి లభించిందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ సెక్రటరీ అమన్ శర్మ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ నూతన శాఖలను తెరువనున్నట్లు చెప్పారు. వీటి చేరికతో మొత్తం శాఖల సంఖ్య సుమారు 1.7 లక్షలకు చేరుతుందని వెల్లడించారు. 'పోస్టల్ శాఖను విస్తరించాల్సిందిగా ప్రభుత్వం కోరుతోంది. అయిదు కిలోమీటర్ల పరిధిలోనే బ్యాంకింగ్, ఆర్థిక సేవలు చేరువలో ఉండాలన్నది భావన. పోస్టాఫీసుల ఆధునీకరణకు ప్రభుత్వం రూ.5,200 కోట్లు సమకూర్చింది. డ్రోన్ల ద్వారా డెలివరీలను ఇటీవల గుజరాత్‌లో విజయవంతంగా నిర్వహించాం. 2012లో ప్రారంభించిన ఐటీ ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళ్లాలని ప్రభుత్వం సూచించింది. సాంకేతికత ఆధారంగా పోస్టల్, ఇతర ప్రభుత్వ సేవలు త్వరలో ఇంటి వద్దకే అందనున్నాయి. ప్రజలు పోస్టాఫీసులకు రావాల్సిన అవసరం ఉండదు. మహమ్మారి కాలంలో ఆధార్ సహిత చెల్లింపుల వ్యవస్థ ఆధారంగా రూ.20,000 కోట్ల పైచిలుకు నగదును ప్రజల ఇంటి వద్దకే చేర్చాం' అని వివరించారు.

టెలికం టవర్ల ఏర్పాటుకు అనుమతి అవసరం లేదు

న్యూఢిల్లీ: టెలికం రంగానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం ఇటీవల నోటిఫై చేసిన కొత్త రైట్ ఆఫ్ వే రూల్స్ ప్రకారం.. ప్రైవేట్ భవనాలు, స్థలాల్లో మొబైల్ టవర్లు, స్తంభాలను అమర్చడం, కేబుల్స్ ఏర్పాటుకు టెలికం కంపెనీలకు ఎటువంటి అనుమతి అవసరం లేదు. అయితే సంబంధిత అధికారులకు ముందస్తుగా రాతపూర్వకంగా



సమాచారం తప్పనిసరి. భవనం, నిర్మాణం వివరాలు, ఎంత మేరకు భద్రంగా ఉన్నదీ స్ట్రక్చరల్ ఇంజనీర్ నుంచి ధ్రువీకరణతో సమాచారాన్ని టెలికం కంపెనీలు అందించాల్సి ఉంటుంది. 5జీ సేవలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

సెబీ అనుమతి తప్పనిసరి

ప్రమోటర్ల వాటా కొనుగోలుపై ఎన్‌డీటీవీ వెల్లడి

న్యూఢిల్లీ: కంపెనీకి చెందిన ప్రమోటర్ల వాటా కొనుగోలుకి క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి తప్పనిసరి అంటూ వార్తా చానళ్ల మీడియా సంస్థ ఎన్‌డీటీవీ తాజాగా స్పష్టం చేసింది. చెల్లించని రుణాలస్థానే ప్రమోటర్ గ్రూప్ సంస్థ ఆర్ఆర్‌పీఆర్ లిమిటెడ్‌లో వాటాను చేజిక్కించుకునేందుకు వీసీపీఎల్.. సెబీ అనుమతి పొందవలసి ఉన్నట్లు పేర్కొంది. 2020 నవంబర్ 27న కంపెనీ వ్యవస్థాపక ప్రమోటర్లు ప్రణయ్, రాధికా రాయ్‌లను సెబీ రెండేళ్లపాటు సెక్యూరిటీ మార్కెట్ల నుంచి నిషేధించింది. తద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సెక్యూరిటీల కొనుగోలు, విక్రయం లేదా సెక్యూరిటీల మార్కెట్లలో ఏ ఇతర కార్యకలాపాలు చేపట్టకుండా ఆంక్షలు విధించింది. ఈ నిషేధం 2022 నవంబర్ 26న ముగియనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎన్‌డీటీవీ వివరించింది. దీంతో గడువుకంటే ముందుగానే ఆర్ఆర్‌పీఆర్‌లో వీసీపీఎల్ వాటాను సొంతం చేసుకునేందుకు సెబీ అనుమతి తప్పనిసరిగా తెలియజేసింది. మంగళవారం వీసీపీఎల్ ద్వారా ఎన్‌డీటీవీలో 29.18% వాటాను కొనుగోలు చేసినట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది. దీంతో సాధారణ వాటాదారుల నుంచి మరో 26% వాటా కొనుగోలుకి షేరుకి రూ. 294 ధరలో ఓపెన్ ఆఫర్‌ను సైతం ప్రకటించిన విషయం విదితమే.

వారెంట్ల నిబంధనలు కీలకం

ఎన్‌డీటీవీ బలవంతపు టేకోవర్‌కు అదానీ గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలలో వారెంట్ల జారీలో చోటుచేసుకున్న నిబంధనలు కీలకంగా నిలవనున్నట్లు న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు. అదానీ గ్రూప్‌నకు చెందిన వీసీపీఎల్ నుంచి వారెంట్ల జారీ ద్వారా ఎన్‌డీటీవీ ప్రమోటర్ సంస్థ ఆర్ఆర్‌పీఆర్ హోల్డింగ్ గతంలో దాదాపు రూ. 404 కోట్ల రుణాలు పొందింది. వీటిని ఈక్విటీగా మార్పిడి చేసుకోవడం ద్వారా ఆర్ఆర్‌పీఆర్‌లో 99.9 శాతం వాటాను పొందినట్లు అదానీ గ్రూప్ తెలియజేసింది. వెరసి ఎన్‌డీటీవీలో 29.18 శాతం వాటాను సొంతం చేసుకున్నట్లు వెల్లడించింది. అయితే ప్రమోటర్లకు ఈ విషయం తెలియదంటూ ఎన్‌డీటీవీ పేర్కొంది. దీంతో వారెంట్ల జారీలో అంగీకరించిన నిబంధనలు ఇకపై కీలక పాత్ర పోషించనున్నట్లు న్యాయనిపుణులు పేర్కొంటున్నారు.

రేటింగ్‌పై ఎఫెక్ట్...

బిలియనీర్ గౌతమ్ అదానీ గ్రూప్ ఇతర కంపెనీల కొనుగోళ్ల ద్వారా భారీగా విస్తరిస్తోంది. అయితే రుణాల ద్వారా చేపడుతున్న ఈ కొనుగోళ్లు కంపెనీ రేటింగ్‌పై ఒత్తిడిని పెంచుతుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తాజాగా పేర్కొంది. 1988లో కమోడిటీల ట్రేడర్‌గా ప్రారంభమైన గ్రూప్ మైనింగ్, పోర్టులు, విద్యుత్ ప్లాంట్లు, విమానాశ్రయాలు తదితర పలు రంగాలలో భారీగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ బాటలో ఇటీవలే సిమెంట్ రంగంలో 10.5 బిలియన్ డాలర్ల విలువైన కొనుగోళ్లకు తెరతీసింది.

మేడిన్ ఇండియా ఐఫోన్ 14

- సత్వర తయారీ సన్నాహాల్లో యాపిల్
- నవంబర్ కల్లా అందుబాటులోకి!
- చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకే...



న్యూఢిల్లీ: కొత్తగా ప్రవేశపెట్టబోయే ఐఫోన్ 14ని చైనాతో పాటు భారత్‌లోనూ దాదాపు ఏకకాలంలో తయారుచేయడంపై టెక్ దిగ్గజం యాపిల్ కసరత్తు చేస్తోంది. చైనాలో ఉత్పత్తి మొదలుపెట్టిన రెండు నెలలకే తర్వాత భారత్‌లోనూ తయారీ ప్రారంభించాలని భావిస్తోంది. దీంతో చైనాలో తయారయ్యే ఐఫోన్ 14 సెప్టెంబర్‌లో మార్కెట్లోకి రానుండగా.. మేడిన్ ఇండియా వెర్షన్ అక్టోబర్ ఆఖరు లేదా నవంబర్ నాటికి సిద్ధం కాగలదని భావిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ దీపావళి పండుగ సీజన్‌ను పురస్కరించుకుని అక్టోబర్ 24కే ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. సాధారణంగా చైనాలో ఉత్పత్తి చేసే ఐఫోన్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టాక యాపిల్ ఆరు నుంచి తొమ్మిది నెలల తర్వాత భారత్‌లో తయారు చేస్తోంది. అయితే, ఇటీవలి కాలంలో అమెరికా, చైనా ప్రభుత్వాల మధ్య విభేదాలు తలెత్తడం, కోవిడ్‌పరమైన లాక్‌డౌన్‌లతో సమస్యలు తలెత్తడం వంటి అంశాల వల్ల చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ప్రత్యామ్నాయంగా భారత్‌లో తయారీ కార్యకలాపాలను పెంచుకోవడంపై యాపిల్ దృష్టి పెడుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే రెండు దేశాల్లో తయారీ కార్యకలాపాల మధ్య జాప్యాన్ని గణనీయంగా తగ్గించుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ ఉంటున్న ఆరు నుంచి తొమ్మిది నెలల జాప్యాన్ని రెండు నెలలకు తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వివరించాయి. భారత్‌లో తయారీని వేగవంతం చేసేందుకు సరఫరాదారులతో కూడా కంపెనీ చర్చలు జరుపుతోంది.

ఏకకాలంలో ఉత్పత్తి..

భారత్‌లో యాపిల్ ఐఫోన్ల తయారీ 2017లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఫాక్స్‌కాన్, విస్ట్రన్, పెగాట్రాన్ సంస్థలు యాపిల్ కోసం ఐఫోన్ 13 ఫోన్లను దేశీయంగా తయారు చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 47,000 కోట్ల విలువ చేసే ఐఫోన్లను భారత్ నుంచి ఎగుమతి చేయాలని యాపిల్ లక్ష్యంగా పెట్టుకుంది. భారత మార్కెట్లో యాపిల్ ఉత్పత్తుల విక్రయాలూ భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో యాపిల్ తమ ఉత్పత్తులను ఇరు దేశాల్లో (భారత్, చైనా) ఏకకాలంలో ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయని టీఎఫ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీస్ గ్రూప్ వర్గాలు తెలిపాయి. తదుపరి ఐఫోన్ వెర్షన్.. భారత్, చైనా నుంచి ఒకే సమయంలో రావచ్చని పేర్కొన్నాయి. ఇందుకోసం చైనా నుంచి విడిభాగాలను ఎగుమతి చేయడం, భారత్‌లో వాటిని అసెంబ్లింగ్ చేయడానికి సంబంధించిన ప్రక్రియను ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది నుంచే రెండు దేశాల్లో ఉత్పత్తి ఏకకాలంలో ప్రారంభించాలని యాపిల్, ఫాక్స్‌కాన్ భావించినప్పటికీ ప్రస్తుత పరిస్థితుల రీత్యా సాధ్యపడకపోవచ్చని ఇరు కంపెనీలు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, దీర్ఘకాలికంగానైనా ఈ ప్రణాళికను అమలు చేయాలని అవి భావిస్తున్నట్లు వివరించాయి. ఐఫోన్లను అసెంబ్లింగ్ చేయడమంటే చాలా కష్టతరమైన వ్యవహారమే. ఓవైపు వందల కొద్దీ సరఫరాదారులతో సమన్వయం చేసుకుంటూ మరోవైపు యాపిల్ విధించే కఠినతరమైన డెడ్‌లైన్లు, నాణ్యతా ప్రమాణాలను అందుకోవాల్సి ఉంటుంది. చైనాకు దీటుగా ఐఫోన్ల ఉత్పత్తిని సాధించగలిగితే భారత్‌కు పెద్ద మైలురాయిగా మారగలదు.

ఆఖర్లో అమ్మకాలు



ముంబై: ఆఖర్లో ఆర్థిక, ఐటీ, ప్రైవేట్ బ్యాంక్స్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు గురువారం నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 231 పాయింట్ల లాభంతో 59,316 వద్ద మొదలైంది. నిఫ్టీ 74 పాయింట్లు పెరిగి 17,679 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ప్రథమార్థంలో సానుకూల సంకేతాలు అందడంతో సెన్సెక్స్ 399 పాయింట్లు బలపడి 59,484 వద్ద, నిఫ్టీ 121 పాయింట్లు బలపడి 17,726 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. అయితే యూరప్ మార్కెట్ల నష్టాల ప్రారంభం సెంటిమెంట్ దెబ్బతింది. ద్వితీయార్థంలో ప్రభుత్వరంగ బ్యాంక్స్, రియల్టీ షేర్లలో మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు తలెత్తడంతో ఆరంభ లాభాల్ని కోల్పోయాయి. ముఖ్యంగా ట్రేడింగ్ చివర్లో ఆర్థిక, ఐటీ, ప్రైవేట్ బ్యాంక్స్ షేర్లకు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్టం(59,484) నుంచి 709 పాయింట్ల నష్టంతో 58,773 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో గరిష్టస్థాయి (17,726) నుంచి 204 పాయింట్లు క్షీణించి 17,522 వద్ద స్థిరపడింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- అదానీ గ్రూప్ ఓపెన్ ఆఫర్ నేపథ్యంలో ఎన్‌డీటీవీ షేర్లు వరుసగా రెండోరోజూ అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 5% దూసుకెళ్లి రూ.407.60 వద్ద ఏడాది గరిష్టాన్ని చేరింది.
- కేంద్రంతో పాటు ఎల్ఐసీ సైతం వాటాలను విక్రయించేందుకు సిద్ధమవడంతో ఐడీబీఐ బ్యాంక్ షేరుకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో ఈ షేరు ఏడుశాతం లాభపడి రూ.43 వద్ద నిలిచింది.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ఆటగాడు సుమిత్ నగాల్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. న్యూయార్క్‌లో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 464వ ర్యాంకర్ సుమిత్ 6–7 (2/7), 4–6తో ప్రపంచ 132వ ర్యాంకర్ వాసెక్ పోస్‌పిసిల్ (కెనడా) చేతిలో ఓడిపోయాడు. గంటా 56 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ఒక ఏస్ సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు, 26 అనవసర తప్పిదాలు చేశాడు. తొలి రౌండ్‌లో ఓడిన సుమిత్‌కు 21,100 డాలర్ల (రూ. 16 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీ లభించింది. భారత్‌కే చెందిన రామ్‌కుమార్ రామనాథన్ కూడా తొలి రౌండ్‌లో ఓడిపోగా, యూకీ బాంబ్రీ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు.





హైదరాబాద్‌లో పుల్లెల గోపీచంద్ అకాడమీలో గురువారం జూనియర్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ సిరీస్ టోర్నీ మొదలైంది. ఈ నెల 28 వరకు జరిగే టోర్నీలో వివిధ దేశాలకు చెందిన దాదాపు 450కు పైగా షట్లర్లు ఐదు కేటగిరీలలో పాల్గొంటున్నారు. టోర్నీని ప్రారంభించిన తర్వాత ఆటగాళ్లతో కరచాలనం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర క్రీడా మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్.

ఎన్ని వేల కోట్లో!

భారత్‌లో ఐసీసీ టోర్నీల ప్రసార హక్కులపై నేడు వేలం



దుబాయ్: క్రికెట్‌కు కామధేనువు భారత మార్కెట్ నుంచి భారీగా ఆర్జించేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సిద్ధమైంది. వచ్చే ఎనిమిదేళ్లలో (2023–2031 మధ్య) జరిగే ఐసీసీ టోర్నీలను భారత్‌లో ప్రసారం చేసేందుకు ఇచ్చే హక్కుల కోసం నేడు వేలం జరగనుంది. ఐపీఎల్ వేలం ద్వారా బీసీసీఐ జాక్‌పాట్ కొట్టడంతో ఇప్పుడు అదే తరహాలో ఐసీసీ వేలం నిర్వహించనుంది. టీవీ, డిజిటల్, టీవీ అండ్ డిజిటల్ అంటూ మూడు వేర్వేరు కేటగిరీల కోసం వేలం జరుగుతుంది. నాలుగేళ్ల కాలానికి లేదా ఎనిమిదేళ్ల కాలానికి హక్కులను కేటాయిస్తారు. 2023–2031 మధ్య పురుషులు, మహిళల విభాగాల్లో కలిపి మొత్తం 22 ఐసీసీ ఈవెంట్లు ఉన్నాయి. వన్డే, టి20 ప్రపంచకప్‌లతో పాటు చాంపియన్స్ ట్రోఫీ, అండర్–19 వరల్డ్‌కప్‌లు కూడా ఇందులో భాగమే. హక్కులను చేజిక్కించుకునేందుకు ప్రధానంగా ఐదు కంపెనీలు బరిలో నిలిచాయి. డిస్నీ స్టార్, సోనీ, జీ, వయాకామ్, అమెజాన్ సంస్థలు వేలంలో పెద్ద మొత్తం చెల్లించేందుకు పోటీ పడనున్నాయి. మొత్తంగా ఒక్క భారత మార్కెట్ నుంచి ఐసీసీ సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 32 వేల కోట్లు) ఆశిస్తోంది.

పతకాలకు విజయం దూరంలో...

- క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్
- పురుషుల డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్, అర్జున్–ధ్రువ్ జోడీలు కూడా
- నేడు గెలిస్తే కాంస్యాలు ఖాయం

టోక్యో: ఈ ఏడాది థామస్ కప్‌లో భారత్ తొలిసారి చాంపియన్‌గా అవతరించడంలో కీలకపాత్ర పోషించిన హెచ్ఎస్ ప్రణయ్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లోనూ దూసుకుపోతున్నాడు. వరుసగా రెండో ఏడాది ఈ మెగా ఈవెంట్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన ఈ కేరళ ప్లేయర్ మరో విజయం సాధిస్తే కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంటాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 18వ ర్యాంకర్ ప్రణయ్ 17–21, 21–16, 21–17తో ప్రపంచ 10వ ర్యాంకర్, గత ఏడాది కాంస్య పతక విజేత, భారత్‌కే చెందిన లక్ష్య సేన్‌పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకున్నాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో చైనాకు చెందిన జావో జున్ పెంగ్‌తో ఆడతాడు. గత ఏడాది ఈ ఇద్దరూ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించారు. ఈసారి మాత్రం ఒకరికి సెమీఫైనల్ బెర్త్‌తోపాటు పతకం కూడా లభించనుంది.

మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి... ఎం.ఆర్. అర్జున్–ధ్రువ్ కపిల జోడీలు చరిత్ర సృష్టించేందుకు విజయం దూరంలో నిలిచాయి. ఈ రెండు జోడీలు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–12, 21–10తో జెప్పా బే–లాసె మోల్వెడె (డెన్మార్క్) జోడీపై... అర్జున్–ధ్రువ్ జోడీ 18–21, 21–15, 21–16తో టెరీ హీ–లో కీన్ హీన్ (సింగపూర్) ద్వయంపై గెలుపొందాయి. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ మొహమ్మద్ అహసాన్–సెతియవాన్ (ఇండోనేసియా)లతో అర్జున్–ధ్రువ్... రెండో సీడ్ టకురో హోకి–యుగో కొబయాషి (జపాన్)లతో సాత్విక్–చిరాగ్ తలపడతారు. ఈ మ్యాచ్‌ల్లో గెలిస్తే కనీసం కాంస్య పతకాలు ఖాయమవుతాయి. ఇప్పటివరకు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు పురుషుల డబుల్స్ విభాగంలో ఒక్కసారి కూడా పతకం రాలేదు.



ప్రణయ్



చిరాగ్, సాత్విక్

సైనాకు నిరాశ

మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత స్టార్ సైనా నెహ్వాల్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సైనా 17–21, 21–16, 13–21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. బుసానన్ చేతిలో సైనా ఓడిపోవడం ఇది ఐదోసారి కావడం గమనార్హం.

అబుదాబి మాస్టర్స్ చెస్ టోర్నీ విజేత అర్జున్



సాక్షి, హైదరాబాద్: ఆద్యంతం నిలకడగా రాణించిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి అబుదాబి మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా అవతరించాడు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో గురువారం ముగిసిన ఈ టోర్నీలో వరంగల్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల అర్జున్ 7.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో అర్జున్ ఆరు గేముల్లో విజయం సాధించి, మరో మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ తెల్లపావులతో ఆడుతూ 67 ఎత్తుల్లో స్పెయిన్ గ్రాండ్‌మాస్టర్ డేవిడ్ ఆంటోన్ గిజారోపై గెలుపొందాడు. భారత్‌కే చెందిన రోహిత్‌కృష్ణ, దీప్‌సేన్ గుప్తా, రౌనక్ సాధ్వాని, అలెగ్జాండర్ ఇందిక్ (సెర్బియా), వాంగ్ హావో (చైనా)లపై కూడా అర్జున్ నెగ్గాడు. ఎవగెనీ తొమాషెవ్‌స్కీ (రష్యా), జోర్డెన్ వాన్ ఫారెస్ట్ (నెదర్లాండ్స్), రాబ్సన్ రే (అమెరికా)లతో జరిగిన గేమ్‌లను అర్జున్ 'డ్రా' చేసుకున్నాడు. విజేతగా నిలిచిన అర్జున్‌కు 15 వేల డాలర్ల (రూ. 12 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది. మాస్టర్స్ టోర్నీలో మొత్తం 148 మంది క్రీడాకారులు పాల్గొనగా... ఇందులో 43 మంది గ్రాండ్‌మాస్టర్లు, 35 మంది అంతర్జాతీయ మాస్టర్లు, ఏడుగురు మహిళా గ్రాండ్‌మాస్టర్లు, ముగ్గురు మహిళా అంతర్జాతీయ మాస్టర్లు ఉండటం విశేషం.

రన్నరప్ ఆదిత్య వరుణ్



అబుదాబి అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్‌లో భాగంగా జూనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆదిత్య వరుణ్ గంపా రన్నరప్‌గా నిలిచాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత ఆదిత్య వరుణ్ ఎనిమిది పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఏడు గేముల్లో గెలిచిన ఆదిత్య, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. ఇరాన్ ప్లేయర్ రెజా మహదావి 8.5 పాయింట్లతో టైటిల్ సాధించాడు.

అనిల్ కుంబ్లేతో పంజాబ్ కటీఫ్

హెడ్ కోచ్ పదవి నుంచి తప్పించిన ఐపీఎల్ ఫ్రాంచైజీ



మొహాలి: మూడు ఐపీఎల్ సీజన్లలో తమ జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించినా... ఆశించిన ఫలితాలు అందించలేకపోయిన అనిల్ కుంబ్లేతో పంజాబ్ కింగ్స్ బంధం తెంచుకుంది. వచ్చే సీజన్ కోసం కుంబ్లేతో ఒప్పందాన్ని పునరుద్ధరించడం లేదని ప్రకటించింది. టీమ్ యజమానులైన ప్రీతి జింటా, నెస్ వాడియా తదితరులు కలిసి సమష్టిగా ఈ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే కొత్త కోచ్‌ను ఫ్రాంచైజీ ఎంపిక చేస్తుంది. 2020లో కుంబ్లే హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా వరుసగా రెండేళ్లు టీమ్ ఐదో స్థానంలో నిలిచింది. 2022లో పది టీమ్‌ల ఐపీఎల్‌లో పంజాబ్ ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. జట్టులో ఎన్ని మార్పులు చేసినా, వ్యూహాలు మార్చినా పంజాబ్ కోచ్ పదవి ఎవరికీ కలిసి రాలేదు. 2014 నుంచి చూస్తే ఆ జట్టుకు కుంబ్లే ఐదో కోచ్. వరుసగా సంజయ్ బంగర్, వీరేంద్ర సెహ్వాగ్, బ్రాడ్ హాడ్జ్, మైక్ హెసన్ కోచ్‌గా పని చేసినా జట్టు రాత మారలేదు. కుంబ్లే కోచ్‌గా ఉన్న సమయంలో పంజాబ్ 42 మ్యాచ్‌లు ఆడగా... 18 గెలిచి, 22 ఓడింది. మరో 2 మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. ఓవరాల్‌గా కూడా 2008 నుంచి ఐపీఎల్‌లో ఉన్నా రెండుసార్లు మాత్రమే పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు వెళ్లగలిగింది. 2014లో ఫైనల్ చేరడం ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన. గత సీజన్ వేలంలో బెయిర్‌స్టో, రబడ, లివింగ్‌స్టోన్, శిఖర్ ధావన్‌లాంటి ఆటగాళ్లను ఎంచుకున్నా ఫలితం మాత్రం మారలేదు. కోచ్‌ను తప్పించిన పంజాబ్ మరోవైపు కెప్టెన్‌గా మయాంక్ అగర్వాల్‌ను కొనసాగించే విషయంలో ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

టీకా తీసుకోని జొకోవిచ్... యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీకి దూరం



న్యూయార్క్: కోవిడ్ టీకా తీసుకోని కారణంతో... సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌కూ దూరమయ్యాడు. కరోనా టీకా వేసుకోకపోవడంతో ఈ ఏడాది ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్‌ను ఆడనివ్వలేదు. అయితే యూఎస్ ఓపెన్ టోర్నీ నుంచి మాత్రం ఈ సెర్బియా స్టార్ స్వయంగా తప్పుకున్నాడు. 'డ్రా' విడుదలకు కొన్ని గంటల ముందు ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా అతను వెల్లడించాడు. 'యూఎస్ ఓపెన్ ఆడేందుకు నేను న్యూయార్క్‌కు వెళ్లట్లేదు. ఇది బాధాకరమే కాని తప్పలేదు. ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఆశావహ దృక్పథంతో వచ్చే సీజన్‌లో ఆడేందుకు కృషి చేస్తా' అని ట్వీట్ చేశాడు. 35 ఏళ్ల సెర్బియన్ ఖాతాలో 21 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లున్నాయి. స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ (22 టైటిల్స్) కంటే ఒకటి తక్కువ. దీన్ని తాజా గ్రాండ్‌స్లామ్‌లో జొకో సాధిస్తాడని అభిమానులు ఆశించారు. అతను 2011, 2015, 2018లో మూడుసార్లు విజేతగా నిలిచాడు. మరో ఆరుసార్లు రన్నరప్‌గా తృప్తి పడ్డాడు. ఇంతటి ఘన రికార్డు ఉన్న అతనికి న్యూయార్క్‌లో మరో టైటిల్ గెలవడం, నాదల్ రికార్డును సమం చేయడం కష్టం కాదు. అయితే అమెరికా, కెనడా దేశాల్లో స్వదేశీయులు తప్ప టీకా తీసుకోని విదేశీయులను అనుమతించడం లేదు. అందువల్లే జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌కు దూరంగా ఉంటున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడిన ఈ సెర్బియన్ క్వార్టర్స్‌లో నాదల్ చేతిలో ఓడాడు. కానీ వింబుల్డన్‌లో విజేతగా నిలిచాడు.


దక్షిణాఫ్రికా 151 ఆలౌట్



బ్రాడ్, అండర్సన్

మాంచెస్టర్: ఆతిథ్య ఇంగ్లండ్ పేస్ అస్త్రంతో దక్షిణాఫ్రికాను కూల్చేసింది. గురువారం మొదలైన రెండో టెస్టులో తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 53.2 ఓవర్లలో 151 పరుగులకే ఆలౌటైంది. టెయిలెండర్ రబడ (36; 2 ఫోర్లు) టాప్‌స్కోరర్. సొంతగడ్డపై వందో టెస్టు ఆడుతున్న అండర్సన్ (3/32), బ్రాడ్ (3/37), స్టోక్స్ (2/17) సఫారీ బ్యాటర్స్‌పై నిప్పులు చెరిగారు. దీంతో ఆఖరి సెషన్ మొదలైన కాసేపటికే తొలి ఇన్నింగ్స్ ముగిసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. ఆరంభంలో 43 పరుగులకే కీలకమైన లీస్ (4), ఓలీ పోప్ (23), రూట్ (9) వికెట్లను కోల్పోయింది. ఓపెనర్ క్రాలీ (17 బ్యాటింగ్; 2 ఫోర్లు), బెయిర్‌స్టో (38 బ్యాటింగ్; 6 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

సాగర్ 4 గేట్ల నుంచి దిగువకు నీరు



శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్ట్‌గేట్లను గురువారం సాయంత్రం మూసేశారు. మంగళవారం ఇన్‌ఫ్లో పెరగడంతో నాలుగోసారి బుధవారం గేట్లను ఎత్తిన విషయం తెలిసిందే. ఇన్‌ఫ్లో తగ్గుతుండడంతో గురువారం ఉదయం 9 గంటలకు ఒక గేటు, మధ్యాహ్నం మూడుగంటలకు ఒక గేటు, సాయంత్రం ఆరుగంటలకు మరో గేటు మూసేశారు. జూరాల, సుంకేసుల నుంచి జలాశయానికి 96,467 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. విద్యుత్ ఉత్పాదన అనంతరం 64,048 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 72,569 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 18 వేల క్యూసెక్కులు, హంద్రీ-నీవా సుజలస్రవంతికి 1,688 క్యూసెక్కు లు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,186 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 212.4385 టీఎంసీల నీరు ఉంది. డ్యామ్ నీటిమట్టం 884.40 అడుగులకు చేరింది. నాగార్జునసాగర్ జలాశయం నాలుగు రేడియల్ క్రస్ట్‌గేట్ల ను ఐదడుగులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 33,454 క్యూసెక్కులు, నాలుగు గేట్ల ద్వారా 32,316 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ, వరద కాలువలు, ఎస్‌ఎల్‌బీసీకి కలిపి మొత్తం 1,03182 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ప్రస్తుతం సాగర్ జలాశయంలో నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. 311.4474 టీఎంసీల నీరు ఉంది.

కేంద్ర ప్రాజెక్టుల ప్రారంభానికి ఏపీకి రండి..

ప్రధాని మోదీని కలిసిన ఎంపీ జీవీఎల్



ప్రధాని మోదీకి వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందిస్తున్న జీవీఎల్

సాక్షి,న్యూఢిల్లీ/ఎంవీపీకాలనీ(విశాఖతూర్పు): విశాఖపట్నంలో ప్రధాన కార్యాలయంతో మంజూరైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యాలయ సముదాయంతో పాటు, విశాఖలో మంజూరై న అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయాలని ప్రధాని మోదీని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసిం హారావు కోరారు. జాతీయ అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకూ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు విశాఖపట్నం పర్యటనకు రావాలని అభ్యర్థించారు. గురువారం ప్రధాని మోదీని ఆయన కార్యాల యంలో కలిసిన జీవీఎల్.. పలు అంశాలపై చర్చించారు. విశాఖలో పూర్తికానున్న పలు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల గురించి ప్రధానికి వివరించారు. అందులో రూ. 26,000 కోట్లతో విశాఖపట్నం హెచ్‌పీసీఎల్ పెట్రోలియం రిఫైనరీ విస్తరణతో పాటు ఆధునికీకరణ ప్రాజెక్ట్, ఐఐఎం విశాఖపట్నం ఆధునిక, హరిత క్యాంపస్ మొదటి దశ, క్రూయిజ్ టెర్మినల్ మొదలైనవి ఉన్నాయి. సుమారు రూ.400 కోట్లతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ ప్రాజెక్ట్, ఈఎస్ఐ స్పెషాలిటీ హాస్పిటల్ తదితరాలున్నాయి.

తెలంగాణ

రాజాసింగ్‌పై పీడీ చట్టం

- అదుపులోకి తీసుకున్న హైదరాబాద్ పోలీసులు
- బందోబస్తు మధ్య చర్లపల్లి జైలుకు తరలింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు చెందిన గోషామహల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ లోధాపై హైదరాబాద్ పోలీసులు ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టాన్ని ప్రయోగించారు. ఈ మేరకు అనుమతిస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కొద్దిసేపటికే దీనికి సంబంధించి నోటీసులు ఎమ్మెల్యేకు అందజేసిన పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. రాజాసింగ్ సోమవారం ఓ వీడియోలో ఓ వర్గాన్ని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతకు కారణమవడం తెలిసిందే. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఆయనపై పలు పోలీసుస్టేషన్లలో 15 కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళ్‌హాట్‌లో నమోదైన కేసుకు సంబంధించి తొలుత పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆయన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలు, ప్రజా జీవితానికి విఘాతం కలిగిస్తున్న రాజాసింగ్‌ను కట్టడి చేయడానికి పీడీ చట్టాన్ని ప్రయోగించాలని బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్‌లో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే రాజాసింగ్‌పై పీడీ యాక్ట్ ప్రయోగించడానికి ముందు నగర పోలీసులు భారీ కసరత్తే చేశారు. 2004 నుంచి నేరచరితుడైన రాజాసింగ్‌పై ఇప్పటివరకు మొత్తం 101 కేసులు నమోదయ్యాయి. వీటిలో 18 మతపరమైన నేరాలకు సంబంధించినవి ఉన్నాయి. దీంతోపాటు ఇటీవల కాలంలో నమోదైన కేసుల వివరాలను నగర పోలీసు విభాగంలోని పీడీ సెల్ అధ్యయనం చేసింది. వీటితోపాటు మంగళవారం పోలీసులు అరెస్టు చేస్తున్నప్పుడు మీడియాతో రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు కూడా పీడీ యాక్ట్ ప్రయోగానికి తగిన కీలక ఆధారాలయ్యాయి. తాను మరో వీడియో విడుదల చేస్తానని రాజాసింగ్ ఆ సమయంలో చెప్పారు. అదే జరిగితే ప్రజా జీవితానికి, శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతుందని భావించిన పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. కాగా, పీడీ యాక్ట్ ప్రయోగించే విషయం రాజాసింగ్‌ను అదుపులోకి తీసుకునే వరకు బయటకు పొక్కకుండా పోలీసులు అత్యంత గోప్యంగా వ్యవహరించారు. తొలుత గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్ ఠాణాలకు చెందిన పోలీసులు రాజాసింగ్ ఇంటికి వెళ్లారు. గత ఫిబ్రవరి 19న మంగళ్‌హాట్ ఠాణాలో, ఏప్రిల్ 12న షాహినాయత్‌గంజ్ పోలీసుస్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసులకు సంబంధించి సీఆర్పీసీ 41 (ఏ) నోటీసులు జారీ చేశారు. వీటిపై స్పందించిన రాజాసింగ్ తనను మళ్లీ అరెస్టు చేయడానికే ఎప్పుడో నమోదైన కేసులకు సంబంధించి నోటీసులిచ్చారంటూ సందేశాలు పంపారు. అయితే అనుచరులు స్పందించేలోపే మంగళ్‌హాట్ పోలీసులు మరోసారి ఎమ్మెల్యే ఇంటికి వెళ్లారు. మరో కేసుకు సంబంధించి నోటీసులివ్వడానికి వచ్చి ఉంటారని భావిస్తుండగా.. పీడీ యాక్ట్‌కు సంబంధించిన నోటీసులు ఇచ్చిన పోలీసులు టాస్క్‌ఫోర్స్ సాయంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం సాయంత్రం 4:45 నిమిషాల సమయంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ చర్లపల్లి జైల్లోకి తీసుకెళ్లారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.